

కారు నంబరుకు 1.17 కోట్లు

వేలంపాటలో హెచ్‌ఆర్‌88బీ8888 నంబరును సొంతం చేసుకున్న హరియాణా వ్యక్తి దేశంలో అత్యధిక ధర పలికిన నంబరు ఇదే

2

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

రివాల్వర్‌ను తాకట్టు పెట్టిన ఎస్సై



దొంగల నుంచి రికవరీ చేసిన బంగారాన్నీ కూడా..

ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలై అక్రమాలు

3


హైదరాబాద్‌లోని అంబర్‌పేట పీఎస్‌లో ఘటన

ఎస్సై భానుప్రకాశ్ రెడ్డి సస్పెన్షన్

గురువారం | 27-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 239 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా.12:30 తదుపరి అష్టమి; నక్షత్రం: ధనిష్ఠ రా.2:32 తదుపరి శతభిషం; వర్జ్యం: శేషం ఉ.7:22; దుర్ముహూర్తం: ఉ.10:12-ఉ.10:56, మ.2:37-3:22; అమృతఘడియలు: మ.3:42-5:22; రాహుకాలం: మ.1:30-3:00; సూర్యోదయం: 6:30, సూర్యాస్తమయం: 5:34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరోపార్క్‌లో ఏర్పాటు చేసిన సఫ్రాన్ కంపెనీ సెంటర్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు



హైదరాబాద్.. ఏరోస్పేస్ డిఫెన్స్ హబ్

ఈ రంగాల్లో గత ఏడాది రెట్టింపైన ఎగుమతులు

- సఫ్రాన్ ఏర్పాటు తెలంగాణ వృద్ధికి ఒక మైలురాయి.. వెయ్యి మంది నిపుణులు, ఇంజనీర్లకు ఉపాధి
- ఎంఎస్ఎంఈలకు దక్కనున్న వ్యాపారావకాశాలు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- జీఎంఆర్ ఏరోపార్క్‌లో సఫ్రాన్ సంస్థ ఎంఆర్‌వో సెంటర్.. వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- బెంగళూరు-హైదరాబాద్‌ను డిఫెన్స్, ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానికి రేవంత్ విజ్ఞప్తి

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా హైదరాబాద్ ఎదుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ రంగాల్లో ఎగుమతులు గత ఏడాది రెట్టింపయ్యాయని, 9 నెలల్లో రూ.30,742 కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుంచి తెలంగాణ.. ఏరోస్పేస్ అవార్డును పొందిందన్నారు. బుధవారం శంషాబాద్ సమీపంలోని జీఎంఆర్ ఏరో పార్క్ (సెజ్)లో ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ సంస్థ సఫ్రాన్ నెలకొల్పుతున్న లీప్ ఇంజన్ ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్) సెంటర్‌ను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. తెలంగాణపై నమ్మకంతో హైదరాబాద్‌ను ఎంచుకున్న సఫ్రాన్‌కు అభినందనలు తెలిపారు. ఈ కొత్త సదుపాయం ఏరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ వృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఇది భారతదేశంలో లీప్ ఇంజన్ల మొట్టమొదటి ఎంఆర్‌వో సెంటర్ అని చెప్పారు. రూ.1,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం వెయ్యి మందికి పైగా నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లకు ఉపాధి కల్పిస్తుందన్నారు. స్థానిక ఎంఎస్ఎంఈలకు, ఇంజనీరింగ్ కంపెనీలకు కొత్త వ్యాపార అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. దాంతోపాటు సఫ్రాన్‌కు

మిగతా 13వ పేజీలో...



ప్రధాని మోదీ వర్చువల్ ప్రసంగం

2

యుద్ధ విమానాలకు ఇక దేశీ ఇంజన్లు!

ఐదో తరం ఫైటర్ జెట్ అమ్కాకు ఇంజన్

టెక్నాలజీని 100% బదిలీ చేసేందుకు

సిద్ధమైన ఫ్రెంచ్ సంస్థ సఫ్రాన్

జీటీఆర్ఈతో జాయింట్ వెంచర్

120 కేఎన్ ఇంజన్ల తయారీ

బీసీ రిజర్వేషన్లు 21.39%



17 శాతానికి తగ్గించారన్న విపక్షాల ఆరోపణలు పూర్తిగా అవాస్తవం

2019 పంచాయతీ ఎన్నికల తరహాలోనే ఈసారీ రిజర్వేషన్ల ఖరారు

కానీ ఎస్టీ నోటిఫైడ్ గ్రామాలను కలిపి లెక్కించడంతో వాస్తవాలు తారుమారు

నిజానికి 8 జిల్లాల్లో పెరిగిన బీసీ రిజర్వేషన్లు

సుప్రీం ఆదేశాలకు అనుగుణంగానే ప్రక్రియ

పంచాయతీ రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టత

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గాయంటూ విపక్షాలు, వివిధ సంఘాల ఆరోపణలు అవాస్తవమని రాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. బీసీ రిజర్వేషన్లను 17శాతానికి తగ్గించారంటూ చేస్తున్న ప్రచారం పూర్తిగా తప్పు అని.. బీసీ రిజర్వేషన్లు 21.39 శాతంగా ఉన్నాయని బుధవారం లెక్కలతో సహా వెల్లడించింది. 2019లో, ప్రస్తుతం పంచాయతీ రిజర్వేషన్ల తీరును ప్రజల ముందు పెట్టింది. పూర్తిగా ఎస్టీలకే కేటాయించే నోటిఫైడ్ గ్రామాలను కూడా కలిపి లెక్కించడంతోనే వాస్తవాలు తారుమారు అయ్యాయని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అన్నిరకాల రిజర్వేషన్లు కలిపి 50శాతం మించకూడదన్న నిబంధనను

మిగతా 14వ పేజీలో...

బీసీల గొంతు కోసిన రేవంత్‌రెడ్డి

14

42% రిజర్వేషన్ పేరిట మోసం

24 శాతాన్ని 17% కి తగ్గించారు

ఫ్యూచర్ సిటీ పేరిట 5లక్షల కోట్ల దోపిడీకి యత్నం: కేటీఆర్

50 వేల కోట్ల విద్యుత్తు కుంభకోణానికి తెరలేపారు

11

రామగుండం, పాల్వంచ, మక్తల్ పవర్ ప్లాంట్లలో భారీ అవినీతి

వాటాల పంపకాల కోసమే కేబినెట్ సమావేశాలు: హరీశ్‌రావు

రిజర్వేషన్లు తగ్గడంపై బీసీల ఆగ్రహం

జీవో 46ను రద్దు చేసి 42% రిజర్వేషన్ కల్పించాలి

అప్పటి దాకా పంచాయతీ ఎన్నికలను ఆపేయాలి

లేనిపక్షంలో ఆందోళన ఉధృతం: బీసీ సంఘాల నేతలు

14

స్మార్ట్ డిస్కమ్!

కొత్తగా ఏర్పాటుచేసే డిస్కమ్‌లో అన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు స్మార్ట్ మీటర్లే

డిస్కమ్ పరిధిలోకి వ్యవసాయ, ఎత్తిపోతల, వాటర్‌బోర్డు కనెక్షన్లు

స్మార్ట్ మీటర్లతో పక్కాగా కరెంటు వినియోగం లెక్కలు

డిస్కమ్‌కు 2 వేల మంది సిబ్బంది.. లైసెన్స్‌కు ఈఆర్‌సీకి దరఖాస్తు



హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను కొత్తగా ఏర్పాటు చేసే డిస్కమ్‌కు బదిలీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం, వాటికి సంబంధించిన పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్‌లు)కు స్మార్ట్ మీటర్లు బిగించనుంది. దాంతో ఒక డీటీఆర్ పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లు ఏ మేరకు విద్యుత్ వినియోగిస్తున్నాయనే లెక్కలు కచ్చితంగా రికార్డు కానున్నాయి. దీంతో పాటు వాటర్ బోర్డు, ఎత్తిపోతల పథకాలు, గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థకు విద్యుత్ అందించే ఫీడర్లను

మిగతా 3వ పేజీలో...



ఆర్మీలోకి లక్ష మంది అగ్నివీర్‌లు

ఏటా నియమించాలని యోచన

జవాన్ల తీవ్ర కొరత దృష్ట్యా నిర్ణయం

సైన్యంలో ప్రతి సంవత్సరం 60 వేల మంది పదవీ విరమణ

న్యూఢిల్లీ, నవంబరు 26: అగ్నివీర్‌లను భారీఎత్తున సైన్యంలోకి తీసుకునేందుకు రక్షణ శాఖ సిద్ధమవుతోంది. అగ్నిపథ్ విధానంలో ఇకపై ఏడాదికి లక్ష మందికి పైగా అగ్నివీర్‌లను భర్తీ చేసుకోవాలని భావిస్తోంది. 2020కి ముందు భర్తీ అయిన జవాన్లు ఏడాదికి దాదాపు 60 వేల మంది చొప్పున ప్రతి సంవత్సరం పదవీవిరమణ

మిగతా 2వ పేజీలో...

ప్రజలకు తెలిసేలా నిషేధిత భూములు

వచ్చేనెల 3 నుంచి అందరికీ అందుబాటులో 22ఏ జాబితాలు

ఏర్పాట్లు చేస్తున్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ.. 24నే జాబితాలు పంపిన కలెక్టర్లు

తప్పుల సవరణ పూర్తయిన వెంటనే వెబ్‌సైట్‌లో వివరాలు



హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నిషేధిత జాబితా (22ఏ)లో ఉండే భూముల వివరాలు డిసెంబరు 3వ తేదీ నుంచి ప్రజలందరికీ అందుబాటులోకి రానున్నాయి. ఈ జాబితాల రిజిస్టర్‌ను ఆరోజు నుంచి పబ్లిక్ డొమైన్‌లో ఉంచేందుకు రిజిస్ట్రేషన్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. గతంలో ఉన్న 22ఏ జాబితా స్థానంలో తాజాగా రూపొందించిన రికార్డునే ఇక నుంచి సబ్ రిజిస్ట్రార్లు ప్రామాణికంగా

మిగతా 11వ పేజీలో...

13

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు మోదీని ఆహ్వానిద్దాం

వివిధ శాఖల కేంద్ర మంత్రులను కూడా..

మాట్లాడే వక్తల పేర్లను సిద్ధం చేయండి

మంత్రులు, అధికారులతో సీఎం రేవంత్

'తెలంగాణ రైజింగ్'పై రెండో రోజు సమీక్ష

మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలి

ఐపీఎస్ ప్రొబేషనర్లకు సీఎం దిశానిర్దేశం

AADHAAR

2 కోట్ల ఆధార్ నంబర్ల రద్దు!

మరణించిన వ్యక్తుల వివరాలను తొలగించిన యూఐడీఏఐ

2

గత ఏడాది ప్రారంభమైన ప్రక్రియ

ఆధార్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకే

కుటుంబసభ్యులు స్వచ్ఛందంగా వివరాలు నమోదు చేయాలని పిలుపు

అహ్మదాబాద్‌లో 2030 కామన్వెల్త్ క్రీడలు

ఆతిథ్య హక్కులు దక్కించుకున్న భారత్

క్రీడల సమాఖ్య ఏజీఎంలో అధికారిక ఆమోదం

సుమారు 17 క్రీడాంశాల్లో పోటీలు

11

కాళోజీ హెల్త్ వర్సిటీ పరీక్షల నియంత్రణ విభాగం సీజ్

ఆరోగ్య శాఖ కార్యదర్శి ఆదేశాలతో రంగంలోకి అధికారులు

త్వరలో ఫోరెన్సిక్, సాంకేతిక బృందాల దర్యాప్తు

'ఆంధ్రజ్యోతి' కథనానికి ప్రభుత్వం స్పందన

14



అగ్నికి ఆహుతి అవుతున్న నివాస సముదాయాలు

2

హాంకాంగ్‌లో ఘోర అగ్నిప్రమాదం.. 36 మంది దుర్మరణం

279 మంది గల్లంతు.. తాయ్‌పో జిల్లాలో ఘటన

శత్రు డ్రోన్లపై 'ఇంద్రజాల్' అస్త్రం

దేశంలో మొట్టమొదటి యాంటీ డ్రోన్ గస్తీ వాహనం

కృత్రిమ మేధ సాయంతో డ్రోన్లపై నిఘా

10 కిలోమీటర్ల దూరంలో ఉండగానే గుర్తింపు

శత్రు డ్రోన్‌గా నిర్ధారణ కాగానే నిర్వీర్యం

13

అభివృద్ధి చేసిన హైదరాబాదీ సంస్థ ఇంద్రజాల్



కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

అరుదైన ఖనిజాలకు 7,280 కోట్ల ఊతం

రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ తయారీకి కేంద్ర ప్రభుత్వం కొత్త పథకం

6,000 మెట్రిక్ టన్నుల వార్షిక సామర్థ్యం లక్ష్యం.. క్యాబినెట్ ఓకే

న్యూఢిల్లీ, నవంబరు 26: అనేక రంగాల్లో వినియోగిస్తున్న అరుదైన భూ అయస్కాంతాల తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రూ.7,280 కోట్లతో కొత్త పథకానికి ఆమోదముద్ర వేసింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో రేర్ ఎర్త్ పర్మనెంట్ మ్యాగ్నెట్స్ తయారీని ప్రోత్సహించే పథకానికి ఆమోదం

మిగతా 2వ పేజీలో...



ఇమ్రాన్‌ఖాన్ మృతి?

- జైలులో హత్యకు గురయ్యారంటూ పాకిస్థాన్‌లో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం
- ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్, ఐఎస్ఐ కారణమంటూ ఆరోపణలు
- ఇమ్రాన్‌ను చూసేందుకు వెళ్లిన ఆయన ముగ్గురు చెల్లెళ్లపై జైలులోనే పోలీసుల దాడి.. పీటీఐ శ్రేణుల్లో కలవరం
- జైలు ముట్టడికి కార్యకర్తలు, అభిమానుల యత్నం

న్యూఢిల్లీ, నవంబరు 26: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైల్లో మరణించారంటూ వదంతులు వ్యాపించడంతో.. ఆయన ఎక్కడున్నారంటూ అడియాలా జైలుపై పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) కార్యకర్తలు, అభిమానులు దాడికి దిగారు. బుధవారం వేలాది మంది జైలు ముందు చేరి ముట్టడించేందుకు యత్నించినట్లు సమాచారం. అవినీతి కేసులో రెండేళ్లుగా ఇమ్రాన్ జైలు శిక్ష అనుభవిస్తున్నారు. అయితే అడియాలా జైలులో ఇమ్రాన్ అనుమానాస్పద స్థితిలో హత్యకు గురయ్యారంటూ పాక్‌తో పాటు

మిగతా 2వ పేజీలో...



2

బలమైన ప్రజాస్వామ్యానికి పునాది

రాజ్యాంగ బాధ్యతలే

బాధ్యతల నుంచే హక్కులు వస్తాయన్న గాంధీజీ మాటలు గుర్తుంచుకోవాలి

పౌరులంతా కచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి: ప్రధాని మోదీ

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా లేఖ

రాజ్యాంగంపై బీజేపీ ప్రేమ రాజకీయ నాటకం.. కాంగ్రెస్ విమర్శలు

ఆర్మీలోకి లక్ష మంది అగ్నివీర్‌లు

(మొదటి పేజీ తరువాయి)

చేయనున్నారు. కొవిడ్ చుట్టుముట్టిన రెండేళ్ల కాలం సైన్యంలోకి భర్తీలు నిలిచిపోయాయి. దానివల్ల రానున్న సంవత్సరాల్లో పదవీవిరమణల కారణంగా తీవ్ర సిబ్బంది కొరతను సైన్యం ఎదుర్కోనుంది. దాదాపు 1.80 లక్షల పోస్టులు ఖాళీ అవుతాయని అంచనా. దానికితోడు నాలుగేళ్ల కోసం భర్తీ చేసుకున్న అగ్నివీర్‌ల పదవీకాలం కూడా వచ్చే ఏడాది చివరికి పూర్తి కానుంది. రక్షణ శాఖ 2022 మధ్యలో అగ్నిపథ్ పథకం తెచ్చేనాటికి త్రివిధ దళాల్లో మొత్తం 46 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఆర్మీలోనే 40 వేల మంది సిబ్బందికి కొరత ఉంది. అగ్నిపథ్ కింద గరిష్ఠంగా మొత్తం 1.75 లక్షల మంది అగ్నివీర్‌లను మిలిటరీలోకి, దాదాపు 28,700 మందిని వాయుసేవ, నేవీలోకి భర్తీ చేసుకోవాలని అప్పట్లో భావించారు. అయితే, రెగ్యులర్ ఆర్మీ, అగ్నివీర్‌ల నుంచి రిటైర్‌మెంట్లు పెరగనున్న దరిమిలా ఏటా లక్షకుపైగా పోస్టులు సైన్యంలో ఖాళీ అవుతాయని తాజాగా అంచనా వేస్తున్నారు. దీంతో అదేస్థాయిలో కొత్తగా అగ్నివీర్‌లను భర్తీ చేసుకునేందుకు సైన్యం సిద్ధమవుతోందని ఓ జాతీయ పత్రిక కథనం ప్రచురించింది.

హాంకాంగ్‌లో ఘోర అగ్ని ప్రమాదం

- 36 మంది దుర్మరణం.. 279 మంది ఆచూకీ గల్లంతు

న్యూఢిల్లీ, నవంబరు 26: హాంకాంగ్‌లో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. తాయ్‌పో జిల్లాలోని ఓ అపార్ట్‌మెంట్ల సముదాయంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. కడపటి వార్తలందేసరికి ఈ ప్రమాదంలో 36 మంది దుర్మరణంపాలయ్యారు. మరో 15 మంది గాయపడ్డారు. 279 మంది ఆచూకీ గల్లంతైంది. 700 మందిని ఘటనాస్థలి నుంచి సురక్షితంగా తాత్కాలిక వసతి గృహాలకు తరలించారు. ప్రమాదానికి గురైన అపార్ట్‌మెంట్ల సముదాయం చాలా పెద్దది. అక్కడ మొత్తం ఎనిమిది అపార్ట్‌మెంట్లు దగ్గర దగ్గరగా ఉన్నాయి. మొత్తంగా 2వేల ఫ్లాట్లలో 4,800 మంది నివసిస్తున్నారు. బుధవారం ఒక్కసారిగా చెలరేగిన మంటలు ఏడు అపార్ట్‌మెంట్లకు వ్యాపించాయి. ప్రమాదంలో తొమ్మిది మంది ఘటనాస్థలిలోనే మృతిచెందగా, నలుగురు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆ అపార్ట్‌మెంట్ల చుట్టూ అమర్చిన వెదురు నిర్మాణాలు అంటుకోవడం వల్లే ఇంత ఘోరం జరిగినట్టు సమాచారం. కాగా.. మంటలు ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బందిలో ఒకరు.. పొగ, వేడి కారణంగా మరణించారు.

హెచ్‌ఆర్88బీ888నంబరుకు 1.17 కోట్లు

- వేలంపాటలో సొంతం చేసుకున్న హరియాణా వ్యక్తి
- దేశంలో అత్యధిక ధర పలికిన వాహన నంబరు ఇదే

న్యూఢిల్లీ, నవంబరు 26: ఓ యాభై లక్షల రూపాయలు మనవి కావు అనుకుంటే ఓ చక్కని విలాసవంతమైన కారు సొంతం చేసుకొని రయ్ అంటూ రోడ్ల మీద దూసుకెళ్లొచ్చు! మరి.. ఆ వ్యక్తి ఏం చేశాడో తెలుసా? కారు కోసం కాదు.. దాని నంబరు కోసమే ఏకంగా రూ.1.17 కోట్లు వెచ్చించాడు! హెచ్‌ఆర్88బీ8888 అనే సూపర్ ఫ్యాన్సీ నంబరు కోసం అతడు ఇంత ధర పెట్టాడు. దేశంలో ఇప్పటివరకు వాహనాల నంబర్ల వేలంపాటలో ఓ వాహన నంబరుకు పలికిన అత్యధిక ధర ఇదే! హరియాణాలో ఆ రాష్ట్ర రవాణా శాఖ అధికారులు ప్రతివారం నిర్వహించే వాహన నంబర్ల వేలం పాటలో భాగంగా శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి సోమవారం ఉదయం తొమ్మిదింటి దాకా వేలంపాట నిర్వహించారు. హెచ్‌ఆర్88బీ8888 నంబరుకు ప్రాథమిక ధరను రూ.50వేలుగా ఖరారు చేయగా అనూహ్యంగా రూ.1.17కోట్లు పలికింది. గతవారం ఆ రాష్ట్రంలోనే నిర్వహించిన వేలం పాటలో హెచ్‌ఆర్22డబ్ల్యూ2222 అనే నంబరు రూ.37.91 లక్షలు పలికింది.

గవర్నర్ అహంకారాన్ని అణచివేస్తాం: స్టాలిన్

చెన్నై, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల దాడుల్లో ప్రజల ప్రాణాలను కాపాడలేని బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వాన్ని అదేపనిగా ప్రశంసిస్తూ, శాంతికి నిలయమైన తమిళనాడు రాష్ట్రాన్ని ఉగ్రవాద రాష్ట్రంగా పేర్కొంటున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి అహంకారాన్ని అణచివేస్తామని సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడులో శాంతి భద్రతల సమస్యలు అధికంగా ఉన్నాయని, రాష్ట్రం ఉగ్రవాద ధోరణితో ఉందని గవర్నర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. "కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో అమాయకులైన పర్యాటకులు మృతి చెందిన విషయం గవర్నర్‌కు గుర్తు రావటం లేదా? ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుడులో ఎంతో మంది చనిపోయారన్న విషయం తెలియదా? మణిపూర్ ఇంకా మండుతూనే ఉందన్న విషయం ఎరుకలేదా?" అని ప్రశ్నించారు. శాంతికి నిలయంగా ఉన్న తమిళనాడును ఉగ్రవాదం పాతుకుపోయిన రాష్ట్రంగా అభివర్ణించడం ఆయన అహంకారానికి నిదర్శనమని స్టాలిన్ పేర్కొన్నారు. బీజేపీకి ఓటువేయని ప్రతి ఒక్కరూ ఉగ్రవాదులేనన్న ధోరణితో గవర్నర్ మాటలు ఉన్నాయని, ఇది ఆయన వహిస్తున్న రాజ్యాంగ బాధ్యతలకు పూర్తిగా విరుద్ధమైనవని ధ్వజమెత్తారు.

గుండెపోటు బాధితులకు ఉచితంగా 50 వేల విలువైన ఇంజెక్షన్

- యూపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

లఖ్‌నవూ, నవంబరు 26: గుండెపోటు బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఓ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు.. రూ. 40-50 వేల విలువైన టెనెక్టెప్లేస్/స్ట్రెప్టోకినేస్ అనే ఇంజెక్షన్‌ను ఇకపై రాష్ట్రంలోని అన్ని జిల్లా ఆస్పత్రులు, వైద్య కళాశాలలతో పాటు ప్రధాన కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో(సీహెచ్‌సీ) ఉచితంగా అందించనున్నారు. గుండెపోటు వచ్చిన తక్షణమే రక్తం గడ్డ కట్టడాన్ని నివారించడంలో ఈ ఇంజెక్షన్ కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణంగా గుండెపోటు వచ్చిన వారిని కార్డియాలజీ కేంద్రాలకు తరలించే క్రమంలో జరిగే జాప్యం ప్రాణాంతకంగా మారుతోంది. ఈ ఆలస్యాన్ని నివారించడానికి, రోగి అత్యవసర విభాగాల్లో చేరిన వెంటనే ఈ ఇంజెక్షన్‌ను అందించాలని ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఈ సౌకర్యాన్ని కొన్ని అగ్రశ్రేణి వైద్య సంస్థలలో 'హబ్-అండ్-స్పోక్' విధానంలో ప్రభుత్వం అమలు చేస్తోంది.

తిరిగెళ్లిపోతామని నిరూపించుకోనక్కర్లే..

- విదేశీ విద్యార్థులకు భారీ ఊరటనివ్వనున్న అమెరికా

న్యూఢిల్లీ, నవంబరు 26: ఉన్నత విద్య అభ్యసించేందుకు అమెరికా వెళ్లాలనుకునే విద్యార్థులకు భారీ ఊరట కల్పించే దిశగా ఆ దేశం అడుగులు వేస్తోంది. విద్యార్థి వీసా(ఎఫ్-1) నిబంధనల్లో అత్యంత కీలకమైన 'ఇంటెంట్ టు లీవ్' రూల్‌ను ఎత్తి వేసేందుకు సిద్ధమవుతోంది. ఇంటెంట్ టు లీవ్ అంటే... చదువు కోసం అమెరికా వెళ్లే విద్యార్థులు. ఆ చదువు పూర్తయిన వెంటనే తమ స్వదేశానికి తిరిగి వెళ్లిపోతామని వీసా అధికారులకు నిరూపించుకోవాలి. ఇందుకోసం విద్యార్థులు స్వదేశంలో తమ ఆర్థిక స్థితి మెరుగ్గా ఉందని చూపించాలి. ఈ నిబంధన వల్లే చాలా మంది వీసా ఇంటర్వ్యూల్లో తిరస్కరణకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో డిగ్నిటీ యాక్ట్-2025 పేరిట రూపొందించిన ఓ బిల్లును అమెరికా చట్టసభ్యులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదిత చట్టంలో ఇంటెంట్ టు లీవ్ నిబంధన రద్దు అంశం కూడా ఉంది. ఈ బిల్లుకు అమెరికా కాంగ్రెస్ ఉభయసభల ఆమోదం లభించి అధ్యక్షుడు సంతకం చేస్తే.. చదువు పూర్తవ్వగానే స్వదేశానికి తిరిగివెళ్లిపోతామని అమెరికా వెళ్లే విద్యార్థులు నిరూపించుకోవాల్సిన అవసరం ఉండదు. అయితే, విద్యార్థి వీసా గడువు ఉన్నంత వరకే విద్యార్థులు అమెరికాలో ఉండేందుకు అవకాశం ఉంటుంది. అందులో ఎలాంటి మార్పు ఉండదు.

భోపాల్ వీఐటీలో విద్యార్థుల నిరసన హింసాత్మకం

భోపాల్, నవంబరు 26: మధ్యప్రదేశ్‌లోని వీఐటీ యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. ఆహారం సరిగా లేకపోవడం, కలుషిత తాగునీరు సరఫరా చేయడం వల్లనే పలువురు కామెర్ల బారిన పడ్డారని ఆరోపిస్తూ వారు మంగళవారం రాత్రి ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలో సహనం కోల్పోయిన విద్యార్థులు బస్సులు, కార్లకు నిప్పు పెట్టారు. ఒక అంబులెన్సును, వర్సిటీలోని ఆర్‌వో ప్లాంటు సహా పలు వస్తువులను ధ్వంసం చేశారు. విద్యార్థుల నిరసన హింసాత్మకంగా మారడంతో అధికారులు ఈ నెల 30వ తేదీ వరకూ వర్సిటీకి సెలవులు ప్రకటించారు. కలుషిత నీరు తాగి చాలామంది కామెర్ల బారినపడ్డారని, ఇదేమని ప్రశ్నిస్తే హాస్టల్ వార్డెన్లు, భద్రతా సిబ్బంది తమపై దాడి చేశారని, దాదాపు నాలుగు వేల మంది విద్యార్థులు నిరసనకు దిగారు.

రాజ్యాంగ బాధ్యతలే పునాది

బాధ్యతల నుంచే హక్కులు వస్తాయన్న మహాత్మాగాంధీ మాటలు గుర్తుంచుకోవాలి

- పౌరులంతా కచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, నవంబరు 26: దేశంలో బలమైన ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ బాధ్యతలే బలమైన పునాది అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రజలంతా రాజ్యాంగ బాధ్యతలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవం నేపథ్యంలో దేశ ప్రజలకు ప్రధాని ఒక లేఖ రాశారు. ఒక బలహీన, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబానికి చెందిన తాను 24 ఏళ్లుగా ప్రభుత్వాధినేతగా ఉండగలగడం మన రాజ్యాంగం శక్తికి నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఓటు హక్కును వినియోగించుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. బాధ్యతల నిర్వహణ నుంచే హక్కులు వస్తాయన్న మహాత్మా గాంధీ మాటలను మోదీ గుర్తు చేశారు. బాధ్యతలను నెరవేర్చడం దేశ సామాజిక, ఆర్థిక పురోగతికి అవసరమన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన బాబూ రాజేంద్ర ప్రసాద్, అంబేడ్కర్‌లతోపాటు స్వాతంత్ర్య పోరాటంలో ముందుండి నిలిచారంటూ మహాత్మా గాంధీ, బిర్సా ముండా, వల్లభ్‌భాయ్ పటేల్‌ల కృషిని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తు తరాల జీవితాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. వికసిత భారత్ దిశగా దూసుకెళ్తున్న మన దేశంలో ప్రతి పౌరుడు తన బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. కొత్తగా 18 ఏళ్లు నిండి ఓటు హక్కు వచ్చిన వారి కోసం ఏటా నవంబర్ 26న పాఠశాలలు, కాలేజీలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రాజ్యాంగం మన దేశానికి ప్రత్యేక గుర్తింపు అని, మనకు గర్వకారణమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. వలసవాద మనస్తత్వాన్ని విడిచిపెట్టి జాతీయ వాద భావన వైపు మళ్లేందుకు దారిచూపే మార్గనిర్దేశకం రాజ్యాంగమని చెప్పారు. పాత పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ దేశం కూడా గొప్పగా మారలేదని.. వికసిత భారత్ లక్ష్యం దిశగా పౌరులంతా కలసి నడవాలని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. కాగా, ఈ కార్యక్రమంలో తెలుగు, మళయాలం, మరాఠీ, నేపాలీ, పంజాబీ, బోడో, కశ్మీరీ, ఒడియా, అస్సామీ భాషల్లో రాజ్యాంగ డిజిటల్ ప్రతులను రాష్ట్రపతి విడుదల చేశారు. మరోవైపు సుప్రీంకోర్టులో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవంలో జస్టిస్ సూర్యకాంత్‌తోపాటు భూటాన్, కెన్యా, మారిషస్, శ్రీలంక దేశాల సుప్రీంకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు పాల్గొన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్యాన్ని, న్యాయవ్యవస్థను ప్రశంసించారు.

భారత రాజ్యాంగాన్ని బలహీనం చేసేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ సూత్రాలను ఉద్దేశపూర్వకంగా ఒక ప్రణాళిక ప్రచారం దెబ్బతీస్తున్నారని మండిపడింది. ప్రస్తుతం బీజేపీ రాజ్యాంగంపై చూపుతున్న ప్రేమ కేవలం రాజకీయ ప్రయోజనాల

రాజ్యాంగ సూత్రాలను మోదీ, షా దెబ్బతీస్తున్నారు: కాంగ్రెస్

కోసం ఆడుతున్న నాటకం మాత్రమేనని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అది పేదలను, బలహీన వర్గాలను రక్షించే కవచమని.. దానిపై బీజేపీ దాడిని ఎట్టిపరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పోస్టుపెట్టారు. ఇక ప్రధాని మోదీ ఎన్నడూ పాటించని రాజ్యాంగ బాధ్యతలను ప్రజలకు ఉపదేశించడం ఏమిటని జైరామ్ రమేశ్ ఎద్దేవా చేశారు.

మత విద్వేషానికి పేరుపొందిన మీరా మాకు చెప్పేది?

- మోదీ రామ మందిర ధ్వజారోహణను పాక్ తప్పుబట్టడంపై భారత విదేశాంగ శాఖ

అయోధ్య రామమందిర ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొనడాన్ని తప్పుబడుతూ పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. మత విద్వేషానికి పేరుపొందిన పాకిస్థాన్ ఈ విషయంలో మాట్లాడటం ఏమిటని నిలదీసింది. అయినా భారత అంతర్గత అంశాల్లో జోక్యం చేసుకోవడం ఏమిటని మండిపడింది. ప్రధాని మోదీ అయోధ్య రామమందిరం ధ్వజారోహరణ చేయడాన్ని ప్రస్తావిస్తూ పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం.. భారత్‌లో మతపరమైన మైనారిటీలు ప్రమాదంలో పడుతున్నారని.. ముస్లిం వారసత్వ ప్రాంతాలకు హిందూ ఉగ్రవాదుల ముప్పు పెరుగుతోందని పేర్కొంది. దీనిపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తీవ్రంగా మండిపడ్డారు. "మైనారిటీలపై వ్యవస్థాగత వివక్షకు పేరుపడిన దేశం పాకిస్థాన్. ముందు మీ దేశంలో మానవ హక్కుల అణచివేతపై, అంతర్గత సమస్యలపై దృష్టిపెట్టుకోవాలి" అని పాకిస్థాన్‌కు సూచించారు.

'ఉరి' హైడ్రో ప్లాంట్లపై దాడికి పాక్ యత్నం!!

- 'సిందూర్' వేళ భగ్నం చేసిన సీఐఎస్‌ఎఫ్
- 250 మందిని కాపాడిన సిబ్బంది
- 19 మంది జవాన్లకు 'డీజీ డిస్క్' ప్రదానం

న్యూఢిల్లీ, నవంబరు 26: 'ఆపరేషన్ సిందూర్' సమయంలో 'ఉరి'లోని జలవిద్యుత్ కేంద్రంపై దాడికి పాకిస్థాన్ ప్రయత్నించిన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 19 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఆ యత్నాన్ని భగ్నం చేసి 250 మంది ప్రాణాలను కాపాడారు. వారి అసాధారణ సాహసాన్ని గుర్తించిన సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ రంజన్ మంగళవారం ఢిల్లీలో వారికి 'డీజీ డిస్క్'ను ప్రదానం చేశారు (అంకితభావం, అసాధారణ సాహసం, అద్భుత నైపుణ్యం ప్రదర్శించిన సీఐఎస్ఎఫ్ సిబ్బందికి ఈ అవార్డు అందజేస్తారు). దీంతో పాక్ దుశ్చర్య గురించి బయటి ప్రపంచానికి తెలిసింది. నేషనల్ హైడ్రో-ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) ఆధ్వర్యంలో నడిచే ఉరి హైడ్రో ప్లాంట్లపై పాక్ ఈ ఏడాది మే 6-7 తేదీల్లో తీవ్ర స్థాయిలో షెల్లింగ్‌కు పాల్పడింది. దీంతో పై 19 మంది సిబ్బందీ ఇంటింటికీ తిరిగి మహిళలు, పిల్లలు సహా పౌరులను, ఎన్‌హెచ్‌పీసీ ఉద్యోగులను, వారి కుటుంబాలను ఖాళీచేయించి సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు సీఐఎస్ఎఫ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఓపక్క శత్రువులు నిర్విరామంగా భారీస్థాయిలో కాల్పులు జరుపుతున్నా, డ్రోన్లను ప్రయోగిస్తున్నా లెక్కచేయకుండా.. కమాండెంట్ రవి యాదవ్ సారథ్యంలోని సీఐఎస్ఎఫ్ బృందం ధైర్యంగా ఎదుర్కొంది. డ్రోన్లను నిర్వీర్యం చేసింది. విద్యుత్కేంద్రాలను, అక్కడి టౌన్‌షిప్‌ను, చివరకు ఆయుధ నిల్వల కేంద్రాలనూ కాపాడింది. పౌరులను, ఉద్యోగులను ఖాళీచేయించడమే గాక.. ఆయుధాలను సైతం సురక్షితంగా వేరేచోటకు తరలించింది. సీఐఎస్ఎఫ్ సిబ్బంది అప్రమత్తత, సన్నద్ధత కారణంగా జాతీయ సంపదను రక్షించుకోగలిగామని సదరు ప్రకటనలో పేర్కొంది.



ఇమ్రాన్‌ఖాన్ మృతి?

(మొదటిపేజీ తరువాయి)


జైలు బయట ఇమ్రాన్‌ఖాన్ సోదరి ఆందోళన

బలూచిస్తాన్, అఫ్గానిస్తాన్‌కు చెందిన అనేక సోషల్ మీడియా ఖాతాలు పేర్కొన్నాయి. దీనికి ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్, ఐఎస్ఐ కారణమంటూ ఆరోపించాయి. ఈ నేపథ్యంలోనే గత వారం ఇమ్రాన్‌ను చూసేందుకు ఆయన ముగ్గురు చెల్లెలు జైలుకెళ్లగా.. పోలీసులు నిరాకరించి తమపై అమానుషంగా దాడి చేశారంటూ వారు ఆందోళనకు దిగారు. 'ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు జైలుకెళ్లగా పోలీసులు నిరాకరించారు. శాంతియుతంగా నిరసన తెలిపే ప్రయత్నం చేయగా.. వారు పక్కా ప్లాన్‌తో కరెంట్ తీసేసి మాపై దాడి చేశారు. 71 ఏళ్ల వయసున్న నన్ను జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్లి రోడ్డుపై పడేశారు. దీనిపై దర్యాప్తు జరపాలి' అని నోరీన్ నియాజీ పంజాబ్ పోలీస్ చీఫ్‌కు సోమవారం లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే ఆందోళనలు తీవ్రమై తాజాగా జైలును ముట్టడించే వరకు చేరుకున్నాయి. అయితే ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితి, ఆయన ఎక్కడున్నారనే దానిపై ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ ఏడాది జూన్ చివరలో కోర్టుకు హాజరైనప్పుడు 73 ఏళ్ల ఇమ్రాన్ చివరిసారి బహిరంగంగా కనిపించారు. ఇమ్రాన్ ఖాన్‌ను జైల్లోనే చిత్రహింసలు పెట్టి చంపేశారని బలూచిస్తాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఐఎస్ఐ, ఆసిమ్ మునీరే ఈ కుట్రకు పాల్పడ్డారని ఆరోపించింది. కొన్ని వార్తా సంస్థలు (పేర్లు ప్రస్తావించకుండా) ఈ విషయాన్ని పేర్కొన్నట్లుగా సోషల్ మీడియాలో పోస్టు చేసింది.

మార్కుల ఆధారంగా రెన్యువల్

- ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాలకు నూతన మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ 2024-25 విద్యా సంవత్సరానికి షెడ్యూల్ కులాల విద్యార్థులకు అత్యున్నత స్థాయి ఉపకార వేతన పథకానికి సంబంధించిన తాజా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ నిబంధనలను ఎస్సీ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని విస్తృతం చేయడంతో పాటు విద్యాసంస్థల బాధ్యతను మరింత బలపరిచేలా రూపొందించారు. దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో చేరే షెడ్యూల్ కులాల విద్యార్థులకు అత్యుత్తమ స్థాయి విద్య అందించేలా దీనికి రూపకల్పన చేశారు. ఈ పథకం కింద విద్యార్థుల పూర్తి ట్యూషన్ ఫీజు, తిరిగి చెల్లించని ఇతర రుసుములను నేరుగా వారి ఖాతాల్లోకి బదిలీ చేస్తారు. ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులకు ఈ మొత్తాన్ని సంవత్సరానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు పరిమితం చేశారు. అదనంగా, నివాసం, పుస్తకాలు, ల్యాప్‌టాప్‌లు వంటి అవసరాల కోసం మొదటి సంవత్సరంలో రూ.80 వేలు, తర్వాత ప్రతి సంవత్సరం రూ.41 వేలు చొప్పున అందజేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లను పొందుతున్న విద్యార్థులకు ఈ పథకం వర్తించదు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండి.. ఐఐటీ, ఐఐఎమ్, ఎయిమ్స్, ఎన్ఐటీ, నేషనల్ లా యూనివర్సిటీలు, ఎన్ఐఎఫ్‌టీ, ఎన్ఐడీ, ఐహెచ్ఎమ్ వంటి గుర్తింపు పొందిన సంస్థల్లో ప్రవేశం సాధించిన ఎస్సీ విద్యార్థులు మాత్రమే ఈ పథకానికి అర్హులు. కోర్సు పూర్తయ్యే వరకు ఏటా వారి మార్కుల ఆధారంగా రెన్యువల్ చేస్తారు. అయితే, ఇప్పటికే ఈ పథకంలో లబ్ధి పొందుతున్న విద్యార్థులు కోర్సు పూర్తయ్యే వరకు సహాయం పొందుతారు.

2 కోట్ల ఆధార్ నంబర్ల రద్దు!

న్యూఢిల్లీ, నవంబరు 25: మరణించిన వ్యక్తుల తాలూకు రెండు కోట్లకుపైగా ఆధార్ నంబర్లను రద్దు (డీయాక్టివేట్) చేసినట్లుగా 'భారతీయ విశిష్ట గుర్తింపు సాధికార సంస్థ' (యూఐడీఏఐ) బుధవారం తెలిపింది. జాతీయ సమాచార ప్రక్షాళన ప్రక్రియలో భాగంగా గత ఏడాది జనవరిలో ఈ ప్రక్రియ మొదలైందని గుర్తు చేసింది. ఆధార్ వివరాల సమగ్రతను కాపాడటం, దుర్వినియోగాన్ని అరికట్టటం లక్ష్యంగా దీనిని చేపట్టినట్లు పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వశాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి తీసుకున్న సమాచారంతోసరిపోల్చి ఆధార్ నంబర్ల డీయాక్టివేషన్ జరుపుతున్నట్లు వెల్లడించింది. మరణించిన వ్యక్తి కుటుంబసభ్యులు కూడా.. 'మై ఆధార్' వెబ్‌సైట్‌లో మరణ ధ్రువీకరణపత్రంతో మృతుడి ఆధార్‌ను డీయాక్టివేట్ చేయటానికి దరఖాస్తు చేయవచ్చని యూఐడీఏఐ సూచించింది.

అరుదైన ఖనిజాలకు

7,280 కోట్ల ఊతం

(మొదటిపేజీ తరువాయి)



లభించింది. దేశంలో వార్షికంగా 6,000 మెట్రిక్ టన్నుల (ఎంటీపీఏ) సామర్థ్యాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో ఉన్నట్టు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు తెలిపారు. ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనం, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాలు, రక్షణ రంగంలో అరుదైన భూ అయాస్కాంతాలను వినియోగిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా గ్లోబల్ పోటీ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా మొత్తం సామర్థ్యాన్ని ఐదుగురు తయారీదారులకు కేటాయించనున్నారు. ప్రతి తయారీదారుకు 1,200 ఎంటీపీఏ సామర్థ్యం వరకు కేటాయిస్తారు. ఈ పథకం మొత్తం కాలపరిమితి ఏడేళ్లు. కేటాయించిన తేదీ నుంచి ఇది అమల్లో ఉంటుంది. మొదటి రెండేళ్లు ఇంటిగ్రేటెడ్ రేర్ ఎర్త్ పర్మనెంట్ మ్యాగ్నెట్స్ (ఆర్ఈపీఎం) తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి ఉంటుంది. తర్వాతి ఐదేళ్లు ఆర్ఈపీఎం అమ్మకాలపై ప్రోత్సాహకాల పంపిణీ ఉంటుంది. అరుదైన భూ అయాస్కాంత మెటీరియల్స్ ఎగుమతుల నిబంధనలను చైనా కఠినతరం చేస్తున్న నేపథ్యంలో భారత పరిశ్రమలకు సరఫరా పరంగా సవాళ్లు ఎదురుకానున్నాయి. ప్రస్తుతం భారత్ ఆర్ఈపీఎం అవసరాలన్నీ దిగుమతుల ద్వారా తీరుతున్నాయి. 2030 నాటికి డిమాండ్ రెండింతలు పెరిగే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయంగా పటిష్ఠవంతమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం ముందడుగు వేసింది. ఆర్ఈపీఎంలు బలమైన మాగ్నెట్లు. వీటిని ప్రపంచవ్యాప్తంగా విరివిగా వినియోగిస్తున్నారు. వీటిని ఎలక్ట్రిక్ మోటార్లు, విండ్ టర్బైన్లు, డ్రోన్లు, శాటిలైట్లు, వైద్య పరికరాల్లో వాడుతున్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పనతోపాటు పెట్టుబడుల ఆకర్షణకు అవకాశం ఉంటుంది.

9,858 కోట్లతో పుణె మెట్రో విస్తరణకు ఆమోదం

రూ.9,858 కోట్లతో పుణె మెట్రో రైల్ నెట్‌వర్క్ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలిపినట్టు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టు ఐదేళ్లలో పూర్తికానుంది. ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం, మహారాష్ట్ర ప్రభుత్వం, బహుళ ఫండింగ్ ఏజెన్సీలు సంయుక్తంగా సమకూర్చనున్నాయి. కాగా రూ.2,781 కోట్ల విలువైన రెండు రైలు ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. వీటిలో గుజరాత్‌లోని ద్వారకా-కనాలస్ రైల్ లైన్ డబ్లింగ్‌తోపాటు ముంబైలోని బద్లాపూర్, కర్జాత్ మధ్య మూడు, నాలుగో లైన్ల నిర్మాణం ఉన్నాయి.

యుద్ధ విమానాలకు ఇక దేశీ ఇంజన్లు!

- ఐదో తరం ఫైటర్ జెట్ ఆమ్కాకు అవసరమైన ఇంజన్ టెక్నాలజీని 100 శాతం బదిలీ చేసేందుకు సిద్ధమైన ఫ్రెంచ్ సంస్థ శాఫ్రాన్



న్యూఢిల్లీ, నవంబరు 26: భారత దేశం అభివృద్ధి చేస్తున్న ఐదో తరం యుద్ధవిమానం ఆమ్కా (అడ్వాన్స్‌డ్ మల్టీ రోల్ ఎయిర్ క్రాఫ్ట్)కు అవసరమైన 120-140 కిలో న్యూటన్ ఇంజన్ టెక్నాలజీని 100% బదిలీ చేయడానికి ఫ్రెంచ్ ఏరోస్పేస్ దిగ్గజం 'శాఫ్రాన్' అంగీకరించింది. డీఆర్‌డీవోతో కలిసి తాము ఒక సరికొత్త ఇంజిన్‌ను భారత్‌లోనే తయారుచేయబోతున్నామని.. శాఫ్రాన్ సీఈవో ఒలివియర్ ఆండ్రీస్ తెలిపారు. అత్యంత కీలకమైన హాట్ సెక్షన్ సహా.. ఇది పూర్తిస్థాయి టెక్నాలజీ బదిలీ అని, భారత్‌కు మరెవ్వరూ ఇలాంటి ఆఫర్ ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. హాట్ సెక్షన్ అంటే.. విమానం ఇంజన్‌కు హృదయం లాంటిది. డీఆర్‌డీవోకు చెందిన గ్యాస్ టర్బైన్ రిసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (జీటీఆర్ఈ)తో కలిసి ఆ సంస్థ కొత్త ఇంజన్‌ను అభివృద్ధి చేయనుంది. ఇందుకోసం దాదాపు రూ.62,450 కోట్లతో ఒక జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి భారత ప్రభుత్వం త్వరలోనే ఒక ప్రకటన చేయనుంది. కాగా.. ఆమ్కా ఎం2కేలకే కాక.. భవిష్యత్తులో తయారుచేసే ట్విన్ ఇంజన్ స్టెల్త్ యుద్ధవిమానాలకు సైతం ఉపయోగపడేలా ఈ ఇంజన్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఆమ్కా అభివృద్ధి, ఉత్పత్తిలో భాగం కావడానికి.. టాటా గ్రూప్, ఎల్ అండ్ టీ, అదానీ డిఫెన్స్ ఇప్పటికే ఆసక్తి చూపుతున్నాయి. ప్రస్తుతం మన దేశం వద్ద ఉన్న అన్ని యుద్ధవిమానాలకూ విదేశీ ఇంజన్లనే వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. యుద్ధవిమానాల తయారీ, నిర్వహణలో గణనీయమైన ఖర్చు ఇంజన్లకే అవుతుంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బదులు దేశీయంగా అభివృద్ధి చేసుకోగలిగితే ఆ ఖర్చు బాగా తగ్గుతుంది. ఈ నేపథ్యంలోనే.. భారతదేశం 'ప్రాజెక్ట్ కావేరీ' పేరిట సొంతంగా యుద్ధవిమాన ఇంజన్ తయారీకి ప్రయత్నించింది. ఆ ఇంజన్‌ను తేజస్ కోసం డిజైన్ చేశారు. కానీ తేజస్‌కు కావాల్సింది 90 కిలోన్యూటన్ థ్రస్ట్ కాగా.. కావేరీ ఇచ్చింది 70 కిలోన్యూటన్ కంటే తక్కువ థ్రస్ట్ (మిగ్‌కు దాదాపు సమానం). యుద్ధవిమాన ఇంజన్లలో అత్యంత కీలకమైన హాట్ సెక్షన్‌లో గాలి ఉష్ణోగ్రత 1600 డిగ్రీల నుంచి 1900 డిగ్రీల సెల్సియస్ దాకా ఉంటుంది. ఆ వేడిని తట్టుకునే టెక్నాలజీలు మనవద్ద లేకపోవడంతో కావేరీ ఇంజన్లు తగినంత థ్రస్ట్ ఇవ్వలేకపోయాయి. అందుకే తేజస్ తయారీకి జీఈ ఇంజన్లను వాడుతున్నారు (కావేరీ ఇంజన్లను మానవరహిత విమానాలకు వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్టు సమాచారం). ఇప్పుడు శాఫ్రాన్ సంస్థ ఈ హాట్ సెక్షన్‌కు సంబంధించిన టెక్నాలజీల

ఎయిర్ టు గ్రౌండ్ ఆయుధాల తయారీకి బెల్‌తో జాయింట్ వెంచర్

విమానం నుంచి నేలపై ఉన్న లక్ష్యాలను ఛేదించే 'ఎయిర్ టు గ్రౌండ్' ఆయుధాల తయారీకి తాము భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్)తో జాయింట్ వెంచర్ చేపట్టనున్నట్టు శాఫ్రాన్ సీఈవో ఆండ్రీస్ బుధవారం ప్రకటించారు. తమ వాణిజ్య విమాన కార్యక్రమానికి భారత్ ప్రధాన ప్రాంతంగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. కొవిడ్ వంటి విపత్తులు, జియోపాలిటిక్స్ వల్ల సరఫరా చైన్లలో అంతరాయాల వంటి సమస్యల నుంచి, మాన్యుఫ్యాక్చరింగ్ రిస్క్ నుంచి తప్పించుకోవడానికే భారత్‌ను తమ ప్రధాన హబ్‌గా మార్చుకోవాలని ఆ సంస్థ భావిస్తోంది. ఈ క్రమంలోనే ఆ సంస్థ.. ఎయిర్‌బస్ 320, బోయింగ్ 737 మ్యాక్స్ వంటి విమానాల్లో వాడే లీప్ ఇంజన్ల నిర్వహణ, మరమ్మతుల కోసం ఒక ప్లాంట్‌ను ప్రారంభించింది. భారత్‌లో ఇండిగో, ఎయిరిండియా, ఆకాశ వంటి విమానయాన సంస్థలు చాలావరకూ లీప్ ఇంజన్లున్న విమానాలనే వినియోగిస్తాయి. గతంలో ఆయా విమానాలకు మరమ్మతులు వస్తే విదేశాలకు పంపాల్సి వచ్చేది.

న్నింటినీ పూర్తిగా ఇస్తానంటోంది. కేవలం టెక్నాలజీ బదిలీయే కాక.. జీటీఆర్ఈతో కలిసి 100 శాతం భారత్‌లోనే ఉత్పత్తి చేయనున్నట్టు ఆండ్రీస్ వెల్లడించారు.

రికవరీ బంగారాన్ని నొక్కేసి.. రివాల్వర్‌ను తాకట్టు పెట్టి!

- ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అంబర్‌పేట ఎస్సై దొంగాట..
- ఏపీలో గ్రూప్-2 ఉద్యోగం రావడంతో వెలుగులోకి బాగోతం

హైదరాబాద్ సిటీ/అంబర్‌పేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అతనో తెలివైన వ్యక్తి.. పక్క రాష్ట్రమైనా ఇక్కడ నాన్ లోకల్ కోటాలో పోటీ పడి మరీ ఎస్సై ఉద్యోగం సంపాదించాడు. అయితే తన ప్రతిభను డిపార్ట్‌మెంట్ ఉన్నతికి వినియోగించాల్సింది పోయి నేరాల బాట పట్టాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో అప్పుల పాలై అక్రమాలకు పాల్పడ్డాడు. దొంగల నుంచి రికవరీ చేసిన బంగారాన్ని నొక్కేసి కుదువబెట్టాడు. అలాగే తన సర్వీస్ రివాల్వర్‌ను సైతం డబ్బుల కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద తాకట్టు పెట్టాడు. అయితే ఇటీవల ఏపీలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో ఏఎస్‌వో ఉద్యోగం సంపాదించాడు. ఇక్కడ రిలీవ్ అయి సొంత రాష్ట్రంలో గ్రూప్-2 ఉద్యోగంలో చేరాలని రిలీవ్ కోసం ప్రయత్నించగా.. సదరు ఎస్సై బాగోతం వెలుగులోకి వచ్చింది. విషయం ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో ఎస్సైని సస్పెండ్ చేశారు. అయితే స్టేషన్‌లో ఇంత జరుగుతున్నా ఎస్‌హెచ్‌వో, డీఐ (డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్)ల నియంత్రణ లేకపోవడంతో ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఏపీలోని రాయచోటికి చెందిన భానుప్రకాశ్‌రెడ్డి తెలంగాణలో 2020 బ్యాచ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. గతేడాది అంబర్‌పేట పీఎస్‌కు డీఎస్సై (డిటెక్టివ్ ఎస్సై)గా వచ్చాడు. అయితే గత కొద్ది రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. లక్షల్లో డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలయ్యాడు. దీంతో ఓ దొంగతనం కేసులో రికవరీ అయిన 5 తులాల బంగారాన్ని తీసుకెళ్లి కుదవబెట్టి డబ్బులు తెచ్చుకున్నాడు. అయితే ఏపీలో ఇటీవల నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలో ఉద్యోగం సాధించాడు. దాంతో ఇక్కడ రిలీవ్ కావాలని ఎస్‌హెచ్‌వో వద్దకు వెళ్లి తన వస్తువులన్నీ అప్పగించాడు. రివాల్వర్ ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ అడగగా.. తన డెస్క్‌లో దాచిపెట్టిన రివాల్వర్ కనిపించడం లేదని తూటాలు మాత్రమే ఉన్నాయని.. సీసీ టీవీ కెమెరాలు చెక్ చేయాలని కోరాడు. దీంతో అధికారులు పరిశీలించగా.. ఇటీవల ఓ కేసులో రికవరీ చేసిన 5 తులాల బంగారాన్ని అతడే తీసుకెళ్లినట్లు గుర్తించారు. దానిపై ఎస్సైని ప్రశ్నించగా.. సొంత అవసరాలకు కుదవబెట్టుకున్నానని చెప్పాడు. దీంతో స్టేషన్ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా డబ్బులు అవసరమై రివాల్వర్‌ను కూడా తాకట్టు పెట్టినట్లుగా ఒప్పుకున్నట్లు తెలిసింది. ఆ రివాల్వర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని ధ్రువీకరించని అధికారులు.. ఆ ఎస్సైని సస్పెండ్ చేశారు.


ఎస్సై భానుప్రకాశ్ రెడ్డి

ఆర్ అండ్ బీ శాఖకు ఎన్‌ఎస్‌సీఐ జాతీయ భద్రతా అవార్డు

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాల అమలు విషయంలో విశేష ప్రతిభ చూపిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌సీఐ) ప్రకటించిన జాతీయ భద్రతా అవార్డుకు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ ఎంపికైంది. వరంగల్ జిల్లా రంగంపేటలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల్లో భద్రతా ప్రమాణాలు, పర్యవేక్షణ, కార్మిక భద్రతా చర్యలు సమర్థంగా అమలు చేసినందుకు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రాజెక్టులు వేగంగా పూర్తవడంతోపాటు నాణ్యత, భద్రత, స్థిరత్వం ఖచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత పదేళ్లలో ఆర్ అండ్ బీ పరిధిలో కోటి చదరపు అడుగుల నిర్మాణాలు జరిగితే, తమ ప్రజా ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కోటి చదరపు అడుగుల నిర్మాణాలను పూర్తి చేశామని చెప్పారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన అధికారులు, సిబ్బందిని అభినందిస్తున్నట్టు ఆయన తెలిపారు. గురువారం ఢిల్లీలో ఆర్ అండ్ బీ శాఖ తరఫున సీఈ రాజేశ్వర్ రెడ్డి నేతృత్వంలోని బృందం అవార్డు అందుకోనుంది.

బాలుడిపై లైంగిక దాడికి యత్నం

- అధ్యాపకుడిపై పోక్సో కేసు నమోదు
- నిజామాబాద్ జిల్లాలో ఘటన

ఆర్మూర్ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మునిసిపల్ పరిధిలో ఓ ప్రైవేటు కళాశాల అధ్యాపకుడిపై బుధవారం పోక్సో కేసు నమోదైంది. ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలుడిపై లైంగిక దాడికి ప్రయత్నించిన అదే కళాశాల అధ్యాపకుడిపై ఈ పోక్సో కేసు పెట్టారు. గత సోమవారం ఆ అధ్యాపకుడు ఇంట్లో పనుందని బాలుడిని ఇంటికి పిలిపించుకొని లైంగిక దాడికి యత్నించగా విద్యార్థి భయాందోళనకు గురై కుటుంబసభ్యులకు తెలిపాడు. దీంతో మంగళవారం కుటుంబసభ్యులు కళాశాల ఎదుట ఆందోళన చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాజ్యాంగం ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్
- రాజ్యాంగాన్ని మార్చేందుకు మతతత్వ శక్తుల కుట్రలు: లింగం యాదవ్



హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం మన ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాది అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. రాజ్యాంగం లౌకిక, సమానత్వ భావనలను సూచించే ప్రాథమిక పత్రంలా పని చేస్తుందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ బుధవారం రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం కేవలం చట్టాల సమాహారం కాకుండా.. స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరుల కలలు, త్యాగాలు, సంకల్పాలను ప్రతిబింబించే మహత్తర గ్రంథమన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సహా రాజ్యాంగ నిపుణులను స్మరించడం, వారికి గౌరవం తెలపడం ప్రతి భారతీయుడి కర్తవ్యమన్నారు. ప్రజాస్వామ్యంలో పౌర బాధ్యత ఓటు వేయడం మాత్రమే కాకుండా రాజ్యాంగ విలువలను గౌరవించి ఆచరణలో పెట్టాలన్నారు. కాగా రాజ్యాంగాన్ని మార్చే కుట్రలకు మతతత్వ శక్తులు పాల్పడుతున్నాయని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి లింగం యాదవ్ అన్నారు. ప్రజాస్వామం కోసం మేధావులు, విద్యావంతులు మేల్కోవాలని కోరారు. బుధవారం గాంధీభవన్‌లో లింగం యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, సేవ్ కాన్‌స్టిట్యూషన్-సేవ్ డెమోక్రసీ పేరిట రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో రాజ్యాంగ వ్యవస్థలపై దాడి జరుగుతోందన్నారు.


లొంగిపోయిన మావోయిస్టులకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

41 మంది మావోయిస్టుల లొంగుబాటు

- వారిపై రూ.కోటి 19 లక్షల రివార్డు

చర్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ ఎస్పీ జితేందర్ యాదవ్ ఎదుట బుధవారం 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరందరిపై సుమారు రూ.కోటి 19 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. లొంగిపోయిన మావోయిస్టుల్లో 39 మంది సౌత్ సబ్‌జోనల్ బ్యూరో సభ్యులని వారిలో మరో ఇద్దరు దండకారణ్య స్పెషల్‌జోన్ కమిటీ, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు ఉన్నారన్నారు. లొంగిపోయిన వారికి వారిపై ఉన్న రివార్డులను అందజేస్తామన్నారు. మావోయిస్టులు లొంగిపోవాలని, ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి 528 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని, 560 మంది లొంగిపోయారని, 144 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని ఎస్పీ వెల్లడించారు.

రోకలితో బాది.. కత్తితో గొంతుకోసి..!

- కుటుంబ కలహాలతో భర్తను చంపిన భార్య
- జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో ఘటన
- కామారెడ్డి జిల్లాలో దిండుతో అదిమి భర్త హత్య


మల్లయ్య(ఫైల్)

మల్లాపూర్/ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ భార్య తన భర్తను కంట్లో కారం చల్లి, రోకలితో బాది, కత్తితో గొంతుకోసి దారుణంగా హత్య చేసింది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన పల్లికొండ మల్లయ్య (55) కొంతకాలంగా తాగుడుకు బానిసై రోజూ భార్య రాజుతో గొడవ పడుతుండేవాడు. మల్లయ్య కొడుకు దుబాయ్‌లో ఉండగా కోడలు అత్తమామలతో కలిసి ఉంటోంది. బుధవారం ఉదయం మల్లయ్య కోడలు వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా మల్లయ్య మద్యం తాగి వచ్చి భార్యతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో పంట అమ్మగా వచ్చిన డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో భార్య రాజు తన భర్త మల్లయ్య కంట్లో కారం పొడి చల్లి, రోకలితో కొట్టగా కింద పడిపోయాడు. అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేసింది. తర్వాత కత్తితో సహా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. మరో ఘటనలో, కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మునిసిపల్ పరిధిలోని బాలాజీనగర్ తండాకు చెందిన రత్నావర్ తుకారాం (36)ను భార్య మీన హత్య చేసింది. తుకారాంకు మీనాతో 16 సంవత్సరాల క్రితం వివాహం కాగా, వీరికి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ఇటీవల ఇద్దరి మధ్య అనుమానాలు పెరిగి తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భర్త అడ్డు తొలగించుకోవాలనుకున్న మీనా మంగళవారం అర్ధరాత్రి తుకారాం ముఖంపై దిండుతో శ్వాస ఆడకుండా అదిమి హత్య చేసింది. ఈ మేరకు మృతుడి సోదరుడు హర్ష ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు.

సురభి మెడికల్ కళాశాలలో ర్యాగింగ్

- మొక్కు ఉందన్నా జూనియర్ గడ్డం తీయించిన సీనియర్లు

సిద్దిపేట అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభి మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ జూనియర్ విద్యార్థిని నలుగురు సీనియర్లు ర్యాగింగ్ చేశారు. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న బాధితుడు సాయికృష్ణ కథనం ప్రకారం.. అతను దేవుడి మొక్కులో భాగంగా గడ్డం పెంచుకుంటున్నాడు. సీనియర్లు అతడిని గడ్డం ఎందుకు పెంచుకుంటున్నావని ప్రశ్నించారు. మొక్కు అని చెప్పగా, అదేం లేదంటూ ర్యాగింగ్ చేస్తూ బలవంతంగా గడ్డం తీయించారు. దీనిపై సాయికృష్ణ ర్యాగింగ్ నిరోధక కమిటీకి ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలిసి సీనియర్లు అతడిని మరోసారి మందలించారు. దీంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడి తల్లి తెలిపారు. బాధితుడి నుంచి వివరాలు సేకరించి, విచారణ చేపట్టామని సీఐ తెలిపారు. ఈ విషయమై కళాశాల ర్యాగింగ్ నిరోధక కమిటీని వివరణ కోరగా ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై కమిటీ ప్రోటోకాల్ ప్రకారం చర్యలు తీసుకున్నామని, కొన్ని రోజుల సస్పెన్షన్ వేటు కూడా వేసినట్లు తెలిపారు.

స్మార్ట్ డిస్కమ్!



(మొదటి పేజీ తరువాయి)

కూడా భవిష్యత్తులో వేరు చేయనున్నారు. దాంతో కచ్చితమైన కరెంట్ లెక్కలు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న రెండు డిస్కమ్‌లు కూడా పంపిణీ, సరఫరా నష్టాలను వ్యవసాయ కనెక్షన్ల ఖాతాలో వేస్తున్నాయన్న అపవాదు ఉంది. చాలా ఏళ్ల కిందటే వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను తొలగించారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు 7 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయగా... తెలంగాణ వచ్చాక 24 గంటల పాటు నిరంతరాయ కరెంట్ అందిస్తున్నారు. కాగా, వ్యవసాయ పంపుసెట్లతో పాటు వివిధ ప్రభుత్వ పథకాల కనెక్షన్లకు విద్యుత్ అందించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేయదలిచిన కొత్త డిస్కమ్ విద్యుత్ వినియోగం పరంగా రాష్ట్రంలో రెండో స్థానంలో, కనెక్షన్ల పరంగా చిన్నదిగా ఉండనుంది. వ్యవసాయ విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎల్‌టీ లైన్లు అన్నీ ఈ డిస్కమ్‌కు బదలాయించనున్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ కనెక్షన్లు, వ్యవసాయ పంపుసెట్ల విద్యుత్ వినియోగం 1,38,459 మిలియన్ యూనిట్లుగా లెక్కించారు. దీన్ని బట్టి వినియోగంలో కొత్త డిస్కమ్ వాటా 41 శాతం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దక్షిణ డిస్కమ్ (టీజీఎస్పీడీసీఎల్-హైదరాబాద్) 45 శాతం వినియోగంతో అతిపెద్ద డిస్కమ్‌గా, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) 14 శాతం వినియోగంతో అతిచిన్న డిస్కమ్‌గా ఉంటాయి. కొత్త డిస్కమ్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపడంతో త్వరలోనే లైసెన్స్ కోసం తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ)కి దరఖాస్తు చేసే అవకాశం ఉంది.

కనెక్షన్లన్నీ బదిలీ

ప్రస్తుతం రెండు డిస్కమ్‌ల పరిధిలో ఉన్న వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ, వాటర్ బోర్డు కనెక్షన్లన్నీ కొత్త డిస్కమ్‌కు బదిలీ కానున్నాయి.

బకాయిలు.. రుణాలు.. నష్టాలు..

ప్రభుత్వం నుంచి ఆయా కనెక్షన్లకు చెందిన రూ.35,982 కోట్లు రావాల్సి ఉండగా ఆ బకాయిలన్నీ కొత్త డిస్కమ్‌కు బదిలీ కానున్నాయి. రూ.9,032 కోట్ల రుణాలను కూడా కొత్త డిస్కమ్‌కు ఇవ్వనున్నారు. జెన్‌కో, సింగరేణి వంటి విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు పాత డిస్కమ్‌లు రూ.26,950 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆ చెల్లింపుల బాధ్యతను కొత్త డిస్కమ్‌పై వేయనున్నారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏలు)ను కూడా బదలాయించనున్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి రెండు డిస్కమ్‌ల నష్టాలు రూ.59,671 కోట్లుగా, జూలై 31 నాటికి అప్పులు రూ.62,897 కోట్లుగా ఉన్నాయి. వ్యవసాయ పంపుసెట్లకు సబ్సిడీని నేరుగా కొత్త డిస్కమ్ ఖాతాలో జమ చేయనున్నారు.

ఇద్దరు సీఈలు, 2 వేల మంది సిబ్బంది

కొత్త డిస్కమ్‌కు పాలకమండలితో పాటు సీఎండీ, ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు (సీఈలు) ఉంటారు. అలాగే ప్రతీ పాత జిల్లాకు ఒకరు చొప్పున 10మంది ఎస్ఈలు, 38 సర్కిళ్లకు ఒక్కో డీఈ, 90 మంది ఏడీఈలు, 520 మంది సబ్ ఇంజనీర్లు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ ఎం) ఉద్యోగులతో పాటు ఆర్టిజన్లు 1,000 మంది, పాలన సిబ్బంది 340 మంది కలుపుకొని 2 వేల మందితో కొత్త డిస్కమ్ ఏర్పాటు కానుంది. వీరిని పాత డిస్కమ్‌ల నుంచే సర్దుబాటు చేయనున్నారు.

కనెక్షన్ల వివరాలు

కేటగిరీ	దక్షిణ డిస్కమ్	ఉత్తర డిస్కమ్	కొత్త డిస్కమ్
వ్యవసాయ పంపుసెట్లు	15,20,128	13,69,793	28,89,921
ఎత్తిపోతల పథకాలు	169	260	429
వాటర్ బోర్డు	58	2	60
మిషన్ భగీరథ	134	142	276
మొత్తం	15,20,489	13,70,197	28,90,686

ఉద్యోగాల పేరుతో మోసం


- కన్సల్టెన్సీల ద్వారా రూ. కోట్లల్లో వసూలు
- నిర్వాహకులు పరార్.. పోలీసులకు బాధితుల ఫిర్యాదు

హైటెక్‌సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మించి పలువురు యువతీయువకుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి ముఖం చాటేసిన ఓ సంస్థ నిర్వాహకులపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని మెటల్ చార్మినార్ సమీపంలో ఏడాది క్రితం ఎన్ఎస్ఎన్ ఇన్ఫో టెక్ సంస్థను స్వామినాయుడు అనే వ్యక్తి ప్రారంభించారు. డైరెక్టర్‌గా స్వామి నాయుడు ఉండగా మేనేజర్‌గా పెంటపాటి శ్రీనివాసరావు, హెచ్‌ఆర్‌గా అరుణ అనే మహిళను నియమించారు. వీరు కన్సల్టెన్సీల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగులకు గేలం వేశారు. ఒక్కొక్కరి నుంచి రూ. 2 నుంచి 3 లక్షల వరకు వసూలు చేశారు. తెలంగాణ పోలీసు సైబర్ సెక్యూరిటీ మోనిట రింగ్‌లో తమకు వర్క్ ఆర్డర్ వచ్చిందని నమ్మించారు. శిక్షణ అనంతరం ఉద్యోగాలు ఇస్తామని కన్సల్టెన్సీల ద్వారా డబ్బులు వసూలు చేసినట్టు బాధితులు తెలిపారు. ఆ డబ్బంతా మేనేజర్ పెంటపాటి శ్రీనివాసరావు ద్వారా సంస్థ యాజమాన్యానికి ఆన్‌లైన్, నగదు రూపంలో వెళ్లినట్టు అదే సంస్థలో శిక్షణ విభాగంలో ఉద్యోగంలో చేరిన ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సుమారు 20 మంది బాధితులతో కలిసి ప్రభాకర్‌రెడ్డి, శివకుమార్ అనే మరో వ్యక్తి బుధవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు మొత్తం 400 మంది వరకు ఉన్నారని, అందరి నుంచి కలిపి కోట్లాది రూపాయలు వసూలు చేసి స్వామి నాయుడు, శ్రీనివాసరావు, హెచ్‌ఆర్ యర్రంశెట్టి అరుణ పరారయినట్లు తెలిపారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ.. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు.

ఆయిల్‌పామ్ చరిత్రలో అత్యధిక ఓఈఆర్

- 20.01 ఓఈఆర్ ఆధారంగా ఆయిల్‌పామ్ గెలల ధర నిర్ణయం
- టన్నుకు రూ.500 పెరిగే చాన్స్

అశ్వారావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈసారి 20.01 ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేట్ (ఓఈఆర్) ఆధారంగా 2025-26 పామాయిల్ గెలల ధరను నిర్ణయించనున్నారు. ఈ రికవరీ శాతం దేశ ఆయిల్‌పామ్ చరిత్రలో అత్యధికంగా ఉంది. పామాయిల్ గెలల ధరల నిర్ణయానికి బుధవారం హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ ఏపీసీ సురేంద్ర మోహన్, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్‌బాషా, ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర పామాయిల్ రైతుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాదు, ఆయిల్‌పాం ప్రైవేటు కంపెనీలు, ఆయిల్ ఫెడ్, ఉద్యాన శాఖ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయిల్‌ఫెడ్ కర్మాగారాల్లో వచ్చిన రికవరీ శాతం మేరకు ధర నిర్ణయంపై చర్చించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేట కర్మాగారంలో ఈ ఏడాది అత్యధికంగా 20.01 ఓఈఆర్ రాగా అశ్వారావుపేట, అప్పారావుపేట కర్మాగారాల సరాసరి ఆయిల్ రికవరీ 19.84 శాతం వచ్చింది. అప్పారావుపేట కర్మాగారంలో వచ్చిన అత్యధిక ఓఈఆర్ ఆధారంగా గెలల ధర నిర్ణయానికి కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా రాంచంద్రప్రసాద్, బండి భాస్కర్, పలువురు నాయకులు మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల సహకారంతో ఈ ఘనత సాధించగలిగామన్నారు. గతేడాది 19.42 రికవరీ శాతం ఉండగా ఆ మేరకు టన్నుకు రూ.20,200 ధర పలికింది. ఈ ఏడాది ఓఈఆర్ 20.01 సాధించిన నేపథ్యంలో ఆ ధర మరో రూ.500 పెరిగే అవకాశాలున్నాయి.


ఏపీసీ సురేంద్ర మోహన్‌కు లేఖ అందిస్తున్న ఆలపాటి రాంచంద్రప్రసాద్, తదితరులు

చంద్రబాబుపై 'ఫైబర్' కేసు క్లోజ్

అక్రమాలు జరగలేదని సీఐడీ నిర్ధారణ.. ఆర్థిక నష్టాల్లేవని తేల్చిన సంస్థ

- ఏకీభవించిన నాటి, నేటి ఎండీలు
- కేసు మూసివేతకు కోర్టులో అంగీకారం
- నాడు కక్ష సాధింపులో భాగంగా జగన్ కేసులు

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్‌లో అక్రమాలు జరిగాయంటూ జగన్ హయాంలో నాటి ప్రతిపక్షనేత చంద్రబాబు సహా 16 మందిపై పెట్టిన సీఐడీ కేసు ముగిసిపోయింది. ఫైబర్‌నెట్‌లో అక్రమాలేవీ చోటు చేసుకోలేదని, సంస్థకు ఎలాంటి ఆర్థిక నష్టం జరగలేదని సీఐడీ నివేదిక ఇచ్చింది. ఈ నివేదికతో తాము పూర్తిగా ఏకీభవిస్తున్నామని ఫైబర్‌నెట్ పూర్వ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. మధుసూదన రెడ్డి, ప్రస్తుత మేనేజింగ్ డైరెక్టర్ గీతాంజలి శర్మ విజయవాడలోని ఏసీబీ కోర్టుకు లిఖిత పూర్వకంగా తెలియజేశారు. వీరు బుధవారం ఏసీబీ కోర్టుకు హాజరయ్యారు. కేసును మూసేస్తున్నట్లు రాతపూర్వకంగానూ, మౌఖికంగానూ వెల్లడించారు.

రాజకీయ కక్షతోనే చంద్రబాబుపై కేసు...

2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే.. జగన్ కక్ష సాధింపు రాజకీయాలు మొదలుపెట్టారు. పోలవరం నుంచి ఫైబర్ నెట్ వరకు 2014-19 మధ్య కాలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలుపై రకరకాల దర్యాప్తులకు ఆదేశించారు. ఫైబర్‌నెట్‌పై జగన్ సొంత పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా చర్యలు తీసుకోవడం గమనార్హం. టెర్రాసాఫ్ట్ సంస్థకు ఆయాచితంగా రూ.321 కోట్ల లబ్ధిని చేకూర్చారంటూ సీఐడీకి 2021 సెప్టెంబరు 11వ తేదీన నాటి ఫైబర్‌నెట్ ఎండీ ఎం.మధుసూదన రెడ్డి ఫిర్యాదు చేశారు. ప్రాథమికంగా కేసు పెట్టే నాటికి అందులో చంద్రబాబు పేరు లేదు. ఈ కేసు పెట్టిన రెండేళ్ల తర్వాత.. 2023 అక్టోబరు 11వ తేదీన చంద్రబాబు పేరునూ చేర్చారు. ఈ కేసులో చంద్రబాబును దోషిగా తేల్చాలని సీఐడీ గట్టి ప్రయత్నాలే చేసింది. అయితే.. భారత్ నెట్ పథకం కింద కేంద్రం నుంచి విడుదలైన రూ.3840 కోట్లలో రూ.321 కోట్లు టెర్రాసాఫ్ట్‌కు బదలాయించినట్లుగా సీఐడీ నిర్ధారించలేకపోయింది. సార్వత్రిక ఎన్నికలు ముగిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఫైబర్‌నెట్ కేసులో అక్రమాలు జరగలేదని, ఆర్థిక అక్రమాలు లేవంటూ సీఐడీ ధ్రువీకరించింది. రాజకీయ కక్షతో కావాలనే చంద్రబాబును జగన్ ఇరికించారని చెప్పకనే చెప్పింది. అప్పుడు చంద్రబాబుపై ఫిర్యాదు చేసిన మధుసూదన రెడ్డే.. ఇప్పుడు కేసును క్లోజ్ చేసేందుకు అభ్యంతరం లేదని చెప్పారు. అక్రమాలు జరగలేదన్న సీఐడీ నివేదికతో పూర్తిగా ఏకీభవించారు.

శరవేగంగా పత్తి కొనుగోళ్లు

- 2.97 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ పూర్తి

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు వేగం పుంజుకున్నాయి. వారం వ్యవధిలోనే జిన్నింగ్ మిల్లుల సంఖ్య 246 నుంచి 326కి పెరిగింది. గతేడాది నవంబరు 26 నాటికి 302 మిల్లులు ప్రారంభం కాగా, ఈసారి వాటి సంఖ్య 326కి చేరడం విశేషం. బుధవారం వరకు సీసీఐ ద్వారా రూ. 2,355.24 కోట్ల విలువైన 2,97,129 మెట్రిక్ టన్నుల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కొనుగోళ్ల ద్వారా 1,66,484 మంది రైతులు లబ్ధి పొందారని పేర్కొన్నారు. మరోవైపు, బుధవారం నుంచి మరో 14 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మిగిలిన జిన్నింగ్ మిల్లుల్లో కూడా కొనుగోళ్లను ప్రారంభించాలని మంత్రి తుమ్మల సీసీఐ అధికారులను ఆదేశించారు.

'కమలా పసంద్' వ్యాపారి కోడలు ఆత్మహత్య

న్యూఢిల్లీ, నవంబరు 26: కమలా పసంద్, రాజ్‌శ్రీ పాన్‌మసాలా బ్రాండ్ల సృష్టికర్త, ప్రముఖ వ్యాపారవేత్త కమల్ కిశోర్ చౌరాసియా ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. ఆయన కోడలు దీప్తి చౌరాసియా (40) మంగళవారం సాయంత్రం ఢిల్లీలోని ఆయన నివాసంలో ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె తన గదిలో చున్నీతో ఉరివేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అక్కడ దొరికిన ఓ సూసైడ్ నోట్‌లో తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, బంధాల్లో ప్రేమ, నమ్మకం లేకపోతే జీవితానికి అర్థమేంటని ఆమె పేర్కొన్నట్లు గుర్తించారు. కమల్ కిశోర్ కుమారుడు అర్పిత్ చౌరాసియాకు, దీప్తికి 2010లో వివాహం జరిగింది. కుటుంబ కలహాలతోనే దీప్తి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'గాలి' రాజకీయం

భయానకమైన కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఢిల్లీని రక్షించాలంటూ ఇండియాగేట్ దగ్గర సోమవారం నిరసన నిర్వహించి, అరెస్టయిన వారిని ఢిల్లీకోర్టు మూడురోజుల పోలీసు కస్టడీకి అప్పగించింది. ఈ కాలుష్య వ్యతిరేక ప్రదర్శనలో హిడ్మా ఫోటో ప్రదర్శన, పోలీసులపై దాడి ఇత్యాది పలు చర్యలకు వీరంతా పాల్పడినందున, వారి పుట్టుపూర్వోత్తరాలతో సహా సర్వమూ తవ్వితీయాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించుకున్నారు. భారత న్యాయ సంహితలో కొత్తగా చేరిన 197వ సెక్షన్ సైతం ప్రయోగించడం ద్వారా హిడ్మా అనుకూల నినాదాలు చేయడమంటే దేశభద్రత, సమగ్రత, సమైక్యతలకు విఘాతం కలిగించడమేనని పోలీసులు చాటిచెప్పదల్చారు. ఢిల్లీ కాలుష్య తీవ్రతను ఎత్తిపడుతున్న, ప్రభుత్వాల వైఫల్యాన్ని ప్రశ్నిస్తున్న నినాదాలు, చిత్రాలు అనేకం ఆ ప్రదర్శనలో ఉన్నప్పటికీ, హిడ్మా రేఖాచిత్రం మాత్రమే పాలకులనూ పోలీసులనూ కదిలించింది. బిర్సాముండా నుంచి హిడ్మా వరకూ అడవులు, పర్యావరణ పరిరక్షణకోసం నిరంతరంగా పోరాటం సాగుతూనే ఉందనీ, పర్యావరణ అనుకూల అభివృద్ధి విధానాలు కావాలనీ నిరసనకారులు నినదించారు. కాస్తంత కట్టు తప్పినప్పటికీ, కాలుష్యాన్ని నియంత్రించలేని పాలకుల అసమర్థతను ఈ ప్రదర్శన గట్టిగానే ప్రశ్నించింది.

మాకు ఊపిరాడడం లేదు, మమ్మల్ని బతకనివ్వండి, గొంతులో విషం పోయకండి వంటి నినాదాలతో ఒక ప్రధాన ప్రజా సమస్యనూ, పరిష్కారంలో పాలకుల వైఫల్యాన్ని గుర్తుచేస్తున్న ఈ ప్రదర్శనను పోలీసులు తీవ్రంగా తీసుకోవడం విచిత్రం. నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడానికి ఎవరు కారకులన్న ప్రశ్నకు అటు పోలీసులూ, ఇటు ప్రదర్శనకారుల దగ్గర కావాల్సినన్ని జవాబులున్నాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలను అటుంచితే, ప్రజాగ్రహాన్ని శాంతిభద్రతల సమస్యగా పోలీసులు మార్చివేసిన మాట వాస్తవం. పోలీసులు ఎంత రాక్షసంగా వ్యవహరించారో ఆ దృశ్యాలు తెలియచెబుతాయి. ప్రదర్శనను విచ్ఛిన్నం చేయడంతో సరిపెట్టకుండా, అరెస్టులు, నిర్బంధాలు, కఠిన చట్టాలతో దానిని కొనసాగించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. స్వచ్ఛమైన గాలిని కోరుతున్నవారిని సైతం దేశద్రోహులుగా చిత్రీకరిస్తారా అనీ, జీవించే హక్కును కాపాడుకోవడమూ నేరమేనా? అనీ విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.

నిత్యం కాలుష్యాన్ని దిగమింగుతున్న ఢిల్లీ వాసుల పక్షాన ఈ యువత వీధుల్లోకి వచ్చింది. దీనిప్రభావమే కాబోలు, ప్రధానమంత్రి కార్యాలయం రంగంలోకి దిగి, విద్యుత్ వాహనాల వినియోగం స్థాయి, సౌకర్యాలు ఇత్యాది కాలుష్యనియంత్రణ చర్యలను సమీక్షించి, సకలవ్యవస్థలనూ హెచ్చరించింది. ఎక్యూఐ నాలుగు వందలు దాటిపోయిన స్థితిలో, ఊపిరాడని ఢిల్లీవాసులను నేరుగా ప్రధాని కార్యాలయమే రక్షించబూనుకుంది కనుక, పరిస్థితులు మెరుగుపడవచ్చు. ఇప్పటికే, గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్)ను సవరించి, స్థాయిని పెంచి, తదనుగుణమైన చర్యలు అమలవుతున్నాయి. స్కూళ్ళకు విడతలవారీ సెలవులు, ఉద్యోగుల వర్క్‌ఫ్రమ్ హోమ్ వంటివి మొదలైనాయి. దశాబ్దాలుగా ఉన్న సమస్యే కనుక, ఇప్పటికే ఏర్పడిన నిర్దిష్టమైన విధానాలను తూచ తప్పకుండా అమలు చేస్తే సరిపోతుంది. కాలుష్యం వేగంగా హెచ్చుతున్న స్థితిలోనే ఢిల్లీ ప్రభుత్వం, కేంద్రం కలిసికట్టుగా సుప్రీంకోర్టులో పోరాడి దీపావళి టపాసుల విక్రయం, వినియోగంమీద సానుకూల తీర్పు సాధించిన విషయం తెలిసిందే. ఆమ్‌ఆద్మీపార్టీ ఏలుబడిలో, సుప్రీంకోర్టు చొరవతో దీపావళి టపాసులపై వచ్చిన పూర్తిస్థాయి నిషేధాన్ని డబుల్ ఇంజన్ సర్కార్ తన రాజకీయప్రయోజనాలకోసం వమ్ముచేసింది. గ్రీన్‌క్రాకర్స్, అవీ కొద్దిగంటలు కాల్చడానికి మాత్రమే సుప్రీంకోర్టు అనుమతించినా, నియంత్రణలేమీ లేక ఢిల్లీ కాలుష్యమయమైపోయింది. ప్రధాని వెనుక ఎయిర్‌ప్యూరిఫైర్‌లు అమర్చివున్న చిత్రాలు అప్పట్లో మాధ్యమాల్లో చక్కెర్లు కొట్టాయి. ఆమ్‌ఆద్మీపార్టీ అధికారంలో ఉన్నంతకాలం కాలుష్యాన్ని సైతం రాజకీయంగా వాడుకున్న బీజేపీ నుంచి ఢిల్లీ ప్రజలు శాశ్వత పరిష్కారాలు ఆశిస్తున్నారు. ఢిల్లీలోనే కాదు, ఇరుగుపొరుగు రాష్ట్రాల్లోనూ అదే పార్టీ అధికారంలో ఉన్నందున, నేరం నాది కాదంటూ వేరొకరి మీదకు నెట్టేయడం కష్టం. ప్రపంచంలో అత్యంత కాలుష్యమయమైన రాజధానికి కాస్తంత ఆక్సిజన్ అందించడం పాలకుల విధి.

రేపటి భారత్‌కు ఒక భావయోధుని బాట

ఇరవయో శతాబ్ది నవంబర్ 19, 2025న ముగిసింది. సోషలిస్టు భావజాలానికి చిరిగిపోయిన జెండా చిహ్నం లాంటి సచ్చిదానంద్ సిన్హా ఆ రోజున కన్నుమూశారు. ఆయన మరణం ఇరవయో శతాబ్దికి ముగింపు అని నేను సునిశ్చితంగా విశ్వసిస్తున్నాను. అవును, ఒక శకం ముగిసింది. పట్టభద్రుడు కూడా కాని సచ్చిదా జీ మేధా దిగ్గజంగా ప్రభవించారు. మానవుడు నిర్మించిన, నిర్మిస్తోన్న సమస్త చరిత్రను సాధికారంగా వివరించగల వివేకశీలి, అంతఃప్రేరణతో ఒక సమున్నత లక్ష్య సాధనకు అంకితమైన ఆలోచనాశీలి సచ్చిదా జీ. తాను విశ్వసించిన భావజాలానికి విశేష గౌరవాన్ని సమకూర్చి, ప్రజామోదాన్ని సాధించిన సోషలిస్టు ఆలోచనా యోధుడు సచ్చిదానంద్ సిన్హా. ఆయన నిష్క్రమణతో సోషలిస్టు భావజాల సంప్రదాయం కాలంలోకి జారిపోయింది. నాకు తెలిసిన సోషలిస్టు భావజాల ప్రాభవం అంతరించింది.




■ యోగేంద్ర యాదవ్

సచ్చిదానంద్ సిన్హా లాంటి ఆలోచనా యోధుడి మరణాన్ని మేధా ప్రపంచం పట్టించుకోకపోవడం ఈ కాలం లక్షణమేమో?! విద్యా ప్రపంచంలో ఇప్పుడు ప్రభావశీలురుగా ఉన్నవారెవరూ బహుశా, సచ్చిదా జీ గురించి విని ఉండకపోవచ్చు. ఇక మీడియా ప్రతినిధులు కూడా అందుకు భిన్నమైనవారు కాదు. పట్నా నుంచి వెలువడే హిందీ దినపత్రిక 'ప్రభాత్ ఖబర్', న్యూఢిల్లీ నుంచి వెలువడే 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో మాత్రమే ఆయన మరణ వార్త వచ్చింది. సమాజం బాగు కోసం శ్రమించిన కొంతమంది ఆలోచనాపరులను విస్మృతులను చేసిన కారణాలు సచ్చిదా జీ విషయంలో వర్తించవు. చాలా మంది క్రియాశీలురు అయిన ఆలోచనాపరుల వలే కాకుండా సచ్చిదా జీ విస్తృతంగా రచనా వ్యాసంగం చేశారు. ఆరు దశాబ్దాల ప్రజా జీవితంలో ఆయన రెండు డజన్లకు పైగా పుస్తకాలు, వందలాది వ్యాసాలు రాశారు. చాలా మంది సోషలిస్టుల వలే సచ్చిదా జీ కూడా ఆంగ్ల భాషను వ్యతిరేకించలేదు. తన రచనా వ్యాసంగం తొలి కాలంలో చాలా పుస్తకాలు, వ్యాసాలు ఇంగ్లీష్‌లోనే రాశారు. 'సోషలిజం అండ్ పవర్', 'ది ఇంటర్నల్ కాలనీ', 'ది బిటర్ హార్వెస్ట్', 'ది క్యాస్ట్ సిస్టమ్' 'కేయాస్ అండ్ క్రియేషన్' మొదలైన ఆయన ఆంగ్ల రచనలు భారతీయ సోషలిస్టు భావ జగత్తులో సుప్రసిద్ధమైనవి. ఆయన ప్రతి పుస్తకమూ సంబంధిత అంశాన్ని లోతుగా పరిశోధించి, స్థిరపడిన నమ్మకాలను నిశితంగా ప్రశ్నించింది. కొత్త ఆలోచనలను ప్రేరేపించింది. ఎనిమిది సంపుటాల 'సచ్చిదానంద్ సిన్హా రచనావళి' పేరిట ఆయన రచనలు ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్నాయి. ఆయన మౌలిక చింతకుడు. అసంపూర్ణంగా మిగిలిపోయిన మార్క్స్ 'పెట్టుబడి' గ్రంథం నాల్గవ భాగం గురించి 1950ల్లోనే సచ్చిదా జీ చాలా నిశితంగా, విపులంగా రాశారు. సమాజ భావి పునర్నిర్మాణానికి ఒక ప్రణాళికను ఆయన వెలయించారు. సౌందర్య శాస్త్రంలో కొత్త భావాలను ప్రతిపాదించారు. ఆయన వలే విస్తృతంగా వివిధ అంశాలపై రాసిన వ్యక్తి మరెవరైనా విద్యా ప్రపంచంలో ప్రముఖుడుగా వెలుగొందేవారు. అయితే సచ్చిదా జీకి అటువంటి ప్రఖ్యాతి లభించలేదు.

ఆ అనామకత్వానికి పాక్షిక కారణం ఆయన అసాధారణ జీవనయానమే. బిహార్‌లో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలో సచ్చిదా జీ జన్మించారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో ఆయన రాజకీయ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ క్రియాశీలత ఆయన్ను సోషలిస్టు ఉద్యమంలోకి తీసుకువెళ్లింది. ఫలితంగా ఆయన తన కళాశాల విద్యాభ్యాసానికి స్వస్తి చెప్పవలసి వచ్చింది. బీఎస్సీ మొదటి సంవత్సరంలోనే ఆయన తన చదువును నిలిపివేశారు. ఇప్పుడు జార్ఖండ్ రాష్ట్రంగా ఉన్న ప్రాంతాలలోని గని కార్మికుల మధ్య పనిచేయాలని సోషలిస్టు పార్టీ సచ్చిదా జీని ఆదేశించింది. అక్కడ ఆయన కార్యదక్షతను గమనించిన పార్టీ నాయకత్వం ముంబైలో రైల్వే, ఓడరేవు కార్మికులను సంఘటితం చేసే బాధ్యతను అప్పగించింది (బిహార్ రాష్ట్ర ప్రభుత్వంలో సొంత తాతయ్య మంత్రిగా ఉండగా సచ్చిదానంద్ సిన్హా ముంబైలో రైల్వే కార్మికుడుగా ఉన్నారు). ప్రథమ సార్వత్రిక ఎన్నికల (1952)లో ముంబైలో డాక్టర్ అంబేడ్కర్ తరఫున ఎన్నికల ప్రచారంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. ముంబైలో ఆయన రాజకీయ విద్యాభ్యాసం పరిపూర్ణమయింది. పార్టీ కార్యాలయంలోని గ్రంథాలయాన్ని అందుకు ఆయన పూర్తిగా వినియోగించుకున్నారు. సాయంకాలం అధ్యయన శిబిరాలలో పాల్గొనేవారు. ఫ్రెంచ్, జర్మన్ భాషలను కూడా నేర్చుకున్నారు. సచ్చిదా జీ తొలి వ్యాసాలలోని మేధా నైశిత్యాన్ని గమనించిన రామ్‌మనోహర్ లోహియా తన మ్యాగజైన్ 'మ్యాన్ కైండ్' సంపాదక వర్గంలో చేరాలని సచ్చిదా జీని ఆహ్వానించారు.

> రాజకీయ నిబద్ధతలపై రాజీపడని సోషలిస్టు భావజాల దిగ్గజం సచ్చిదానంద్ సిన్హా. (1928–2025). వర్తమాన భారతదేశంలో రాజకీయ వివేచనా శూన్యతను తొలగించి, సమ్మిళిత, వినూత్న ఆలోచనలను పెంపొందించదలుచుకున్నవారు ఆయన రచనలను అధ్యయనం చేయాలి.

మేధావి అయిన సచ్చిదా జీ రాజకీయ కార్యకర్తగానే ఉండిపోయారు. పార్టీ పదవులకు సైతం ఆరాటపడలేదు. భావాలనే తన రాజకీయాలకు ప్రధాన ఆలంబనగా చేసుకున్నారు. ఢిల్లీలో రెండు దశాబ్దాలు గడిపిన అనంతరం స్వస్థలమైన ముజాఫర్‌నగర్ జిల్లాలోని మనికా గ్రామానికి తిరిగివచ్చి తన జీవితంలో చివరి నాలుగు దశాబ్దాలు అక్కడే ఉండిపోయారు. పదవులు, అవార్డులు, ఫెలోషిప్‌లకు ఆయన ఆరాటపడలేదు. చాలా కొద్ది మంది సోషలిస్టు కార్యకర్తలు, హిందీ రచయితలకు మినహా సచ్చిదాజీ మేధా ప్రపంచానికి బయటి మనిషిగానే ఉండిపోయారు. విశ్వవిద్యాలయాలలో కమ్యూనిస్టులకు ఉన్నట్టుగా సోషలిస్టులకు పలుకుబడి లేదు ఈ కారణంగానే ఆయన మేధా కృషి గుర్తింపునకు నోచుకోలేకపోయింది. తనకు రావలసిన పేరు ప్రఖ్యాతులు రానందుకు సచ్చిదా జీకి ఎటువంటి పట్టింపూ లేదు. అయితే ఆలోచనల ప్రపంచానికి ఆయన భావాల ఉపయుక్తత అపారంగా ఉన్నది. ఈ సత్యాన్ని గుర్తించడమే సచ్చిదా జీకి సముచిత నివాళి అవుతుంది.



సామాజిక ఒంటరితనం (భావసారూప్యత ఉన్న వ్యక్తుల నుంచి కూడా వేరుగా ఉండవలసిరావడం) కంటే కూడా మేధోపరమైన ఒంటరితనమే (ఆలోచనాశీలుర ప్రపంచపు ఆచారాలు, ఆనవాయితీలు అనుసరించేందుకు అచంచలమైన విముఖత చూపడంతో ఎదురైన ప్రతికూలతలు) సచ్చిదా జీ ఉపేక్షితుడై విస్మృతుడు అయ్యేందుకు దారితీసింది. నిర్దిష్ట, ప్రత్యేక ఆసక్తులు, నైపుణ్యాల ఆధారిత విద్యా ప్రపంచ క్రమశిక్షణ సరిహద్దులకు కట్టుబడి ఉండేందుకు ఆయన నిరాకరించారు. మానవీయ, సామాజిక శాస్త్రాలలోనే కాదు, భాషా సాహిత్యాలు, లలిత కళలలో కూడా ఆయనకు అపారమైన ఆసక్తి ఉన్నది. పలు విషయాలను ప్రగాఢంగా అధ్యయనం చేశారు. రాజకీయ ప్రాథమ్యాల ప్రాతిపదికన వివిధ విషయాలను లోతుగా పరిశోధించారు. ఆయన మేధో కృషి పుస్తకాలు, వ్యాసాల రచనకే పరిమితం కాదు. రాజకీయ కార్యకర్తల శిక్షణకు కరపత్రాలు, చిన్న పుస్తకాలు రాశారు. పార్టీ దైనందిన కార్యకలాపాలకు సంబంధించిన పత్రికా ప్రకటనలు కూడా ఆయనే రాసేవారు. బాలల కోసం పాటలు కూడా రాసిన సాహిత్యకుడు సచ్చిదానంద్ సిన్హా. ఆయన రచనలు సమగ్రమైన అవగాహనతో ఉంటాయి. నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించే అంతఃప్రేరణతో ఉంటాయి. ఆయన వచనం సరళంగా, సుబోధకంగా ఉంటుంది. ప్రత్యేక పరిభాష, ఊత పదాలను ఆయన ఉపయోగించరు. సందేశం సూటిగా, స్పష్టంగా ఉంటుంది. రాజకీయ కార్యకర్తలు, వివేచనాశీలురు అయిన పౌరులే సచ్చిదాజీ రచనల ప్రధాన పాఠకులు. ఆలోచన–ఆచరణ మధ్య వారధి నిర్మించేందుకు ఆయన రచనలు స్ఫూర్తినిస్తాయి.

సచ్చిదా జీ తన సొంత మేధా అజెండాను నిర్దేశించుకుని దానికి నిబద్ధమయ్యారు. అయితేనేం తన సమకాలికులను అమితంగా ప్రభావితం చేసిన మేధా చర్చల ప్రధాన అంశాలను ఆయన ముందుగానే సూచించారు. 'అంతర్గత వలసవాదం' (ఇంటర్నల్ కలోనియలిజం)పై ఆయన సిద్ధాంతం 1960లలో లాటిన్ అమెరికాలో ప్రభవించిన 'పరాధీన' (డిపెండెన్సీ) ఆలోచనా విధానాన్ని (సంపన్న, పేద దేశాల మధ్య అంతరాన్ని తగ్గించడంలో రెండవ ప్రపంచ యుద్ధానంతరం అనుసరించిన అభివృద్ధి నమూనాల వైఫల్యానికి ప్రతిస్పందనగా ఇది మొదలయింది) ప్రతిపాదించింది. 1990ల్లో సంకీర్ణ ప్రభుత్వాలు అధికారానికి రాకపూర్వమే అధికార పీఠాల స్వరూపంగా రాజకీయ పార్టీల సంకీర్ణాలను ఆయన సమర్థించారు. కులం, రిజర్వేషన్లు విద్యా జగత్తులో అధ్యయన, పరిశోధనాంశాలుగా ప్రాధాన్యం పొందకముందే సచ్చిదా జీ ఆ విషయాలపై తన దృష్టిని కేంద్రీకరించారు. అభివృద్ధికి పరిమితులు ఉన్నాయని, పర్యావరణ విధ్వంసానికి అది దారితీస్తుందనే సత్యాలను ప్రపంచం గ్రహించకముందే ఆయన వాటి గురించి విస్పష్టంగా మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాహిత మేధావులు ప్రభావశీలంగా చర్చిస్తున్న వివిధ అశాలపై తాను ప్రతిస్పందించవలసిన అవసరముందని ఆయన భావించలేదు. వర్తమాన భారతదేశానికి అవసరమైన వినూత్న రాజకీయ చింతనాపరులకు సచ్చిదా జీ నిస్సందేహంగా ఒక ఆదర్శప్రాయుడు.

'సాదా జీవన్, ఉచ్ఛ విచార్' (నిరాడంబర జీవనం, ఉన్నత ఆలోచనలు) అన్న నీతివాక్యం గురించి పాఠశాల విద్యాభ్యాసంలో మేము నేర్చుకున్నాము. ఆ సమున్నత ఆదర్శానికి ప్రతినిధులుగా జీవించిన సచ్చిదానంద్ సిన్హా జీ, కిషన్ పట్నాయక్ జీ, అశోక్ శెక్సారియా జీ లను కలుసుకోవడం నా జీవిత మహద్భాగ్యంగా భావిస్తున్నాను. సచ్చిదా జీ ఒక సాధువుగా జీవించారు. భౌతిక సౌఖ్యాల పట్ల పూర్తి ఉదాసీనత చూపారు. రాజకీయ అధికారాన్ని కోరుకోలేదు. ప్రజాదరణ పొందాలనే దృష్టి లేదు. గుర్తింపు కోసం ప్రాకులాడలేదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఒక సమున్నత ఆశయ సాధనకు కట్టుబడి తనను తాను పట్టించుకోని నిస్వార్థజీవి సచ్చిదా జీ. తనను తాను ప్రముఖుడుగా భావించుకోని మహోన్నతుడు ఆయన. తన ఆలోచనలను వ్యతిరేకిస్తున్న వారి భావాలనూ ఆయన గౌరవించారు. రాజకీయ నిబద్ధతలపై రాజీపడలేదు. మేధా చిత్తశుద్ధిని వీడలేదు. వర్తమాన భారతదేశంలో రాజకీయ వివేచనా శూన్యతను తొలగించి, సమ్మిళిత, వినూత్న ఆలోచనలను పెంపొందించదలుచుకున్నవారు తొలుత సచ్చిదానంద్ సిన్హా రచనలను అధ్యయనం చేయాలి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)



దుబాయి ఏయిర్ షోలో తేజస్ విమానం విఫలమై భారత ఏయిర్‌ఫోర్స్ పైలట్ మరణించిన ఘటనపై తన దేశంలో కొందరు చేస్తున్న వ్యాఖ్యలను తప్పుబడుతూ, పాకిస్థాన్ వైమానికదళ అధికారి అర్పించిన నివాళి ఇది.

ఆకాశయోధులకు వెక్కిరింతల నివాళా!

ఇండియన్ ఏయిర్‌ఫోర్స్‌కు చెందిన తేజస్ యుద్ధవిమానం దుబాయి ఏయిర్ షోలో కుప్పకూలటం పత్రికల పతాక శీర్షికలకు అతీతమైన విషాదం. విమానాలు ఆవిరిజాడలతో ఆకాశంలో రాసే కవిత్వం ఈ వైమానిక విన్యాసాలు. ఈ విన్యాసాల్లో నైపుణ్యమే ప్రార్థన, ధైర్యమే నివేదన. ఇవి కెమెరాల కోసం జరిగే ప్రదర్శనలు కావు; మానవ కౌశలానికి అత్యున్నత తార్కాణాలు. ఈ వీరులు భూమ్యాకర్షణశక్తికీ తమ అదృష్టానికీ మధ్య ఒక ప్రమాదకరమైన అంగీకారంతో విమానాలు నడుపుతారు. తమ దేశ జెండా తరఫున ప్రాణాలు ఒడ్డేందుకు సిద్ధపడతారు.

భారత వైమానికదళానికీ, సముద్రమంత విషాదంలో తల్లడిల్లుతున్న ఆ కుటుంబానికీ నేను నా సంతాపాన్ని తెలియజేస్తున్నాను. ఈ బాధ ఎలాంటిదో రెక్కల మీద ఎగిరే తోటి యోధులకే పూర్తిగా అర్థమవుతుంది. ఇక్కడ నేలకొరిగింది ఒక పైలట్ కాదు. ఊహకందని ఎత్తుల్లో పహారా కాసే ఆకాశ సంరక్షకుడు. ఈ రాత్రి ఎక్కడో ఒక యూనిఫామ్ ఖాళీగా వేలాడుతుంది. ఎవరో ఒక పిల్లాడు 'నాన్న ఎప్పుడు వస్తాడు?' అని అడుగుతాడు. మొత్తం ఆకాశమే మరింత ఖాళీ అయినట్టు కనిపిస్తుంది.

ఈ దుర్ఘటనకు మించి, ఈ విషాదానికి మించి, నన్ను బాధపెడుతున్నది సరిహద్దుకు ఇటువైపు మా దేశం నుంచి పొంగుతున్న వెక్కిరింతల విషం. దేశ సరిహద్దు అయినా సరే, గగన వీరుల సహోదరత్వాన్ని విడదీయకూడదు. ఇలాంటి ప్రవర్తన దివాలాకోరుతనమే తప్ప దేశభక్తి అనిపించుకోదు. మనం అవతలివారి సిద్ధాంతాలనూ, వ్యూహాలనూ, విధానాలనూ ఎంతయినా ప్రశ్నించవచ్చు, తప్పులేదు. కానీ, మర్యాదకు విలువ ఉండే ప్రపంచంలో బతికే ఎవ్వరూ కూడా, ఆకాశపుటంచుల్లో విధులు నిర్వహించే యోధుడి సాహసాన్ని వెక్కిరించకూడదు. ఆ యోధుడు చప్పట్ల కోసం కాదు, దేశంపై ప్రేమతో ఎగిరాడు, మన దేశ యోధుల్లాగానే. అందుకు మనం ఇవ్వాల్సింది మర్యాద. కుళ్లిపోయిన దేశాభిమానాన్ని ముసుగు వేసుకుని వెక్కిరించటం కాదు.

> గగనతలంలో యుద్ధవిమానం హఠాత్తుగా నిశ్శబ్దంలోకి జారుకున్నప్పుడు– ఇక అక్కడ దేశ పౌరసత్వాలు లేవు, జాతీయ గీతాలు లేవు, జెండాలు లేవు. అక్కడ మిగిలేదల్లా అందరికీ సమానమైన విషాదమే! మేఘాల్లో కలిసిపోయిన వారి ఫొటోలను తడిమి రోదించే కుటుంబాలే!

ఇలాంటి విషాద నీరవంలోకే మన యోధులెందరో మాయమవటాన్ని నేను చూశాను. ఫ్లైట్ లెఫ్టినెంట్ ఆలందార్, స్క్వాడ్రన్ లీడర్ హసంత్ ఇలాంటివారే. వీరంతా దేవతలు ఊపిరిబిగబట్టి చూసేంత ఎత్తుల్లో విహరించారు, ఆకాశం ఎంతో తెగింపును కోరుతుందనీ, బదులుగా ఎలాంటి భద్రతనూ హామీ ఇవ్వదనీ వారు అర్థం చేసుకున్నారు.

గగనతలంలో యుద్ధవిమానం హఠాత్తుగా నిశ్శబ్దంలోకి జారుకున్నప్పుడు– ఇక అక్కడ దేశ పౌరసత్వాలు లేవు, జాతీయ గీతాలు లేవు, జెండాలు లేవు. అక్కడ మిగిలేదల్లా అందరికీ సమానమైన విషాదమే! మేఘాల్లో కలిసిపోయిన వారి ఫొటోలను తడిమి రోదించే కుటుంబాలే!

నిజమైన ప్రొఫెషనల్, తోటి ప్రొఫెషనల్‌ను ఎన్ని అడ్డుగోడల అవతలనుంచైనా గుర్తుపడతాడు. నిజమైన యోధుడు తోటి యోధుడి ధైర్యానికి– అది వేరే రంగు యూనిఫామ్ తొడుక్కున్నా, వేరే రంగు జెండా కింద ఎగిరినా, వేరే భాష మాట్లాడినా– సెల్యూట్ కొడతాడు.

అంతకంటే ఏ మాత్రం తక్కువ స్థాయిలో వ్యవహరించినా అది వారికి కాదు, మనకే అప్రతిష్ఠ. మన వెక్కిరింత మన రెక్కలకే మరకలాగా అంటుకుంటుంది, నేలకొరిగిన మన యోధుల గౌరవాన్నే మంటగలుపుతుంది, మన వీరాలాపాలనే డొల్లచప్పుళ్లుగా మారుస్తుంది.

ధైర్యానికి పాస్‌పోర్టులు ఉండవు. బలిదానానికి సరిహద్దు విభజనలు తెలియవు. దేశ ప్రతిష్ఠ కోసం తన యుద్ధ విమానాన్ని గగనతల అవధుల్లోకి దూకించే పైలట్ మన మర్యాదకు పాత్రుడు– అతను కాషాయ, తెలుపు, పచ్చ జెండా తరఫున ఎగిరినా; లేక పచ్చ, తెలుపుజెండా తరఫున ఎగిరినా!

నిష్క్రమించిన ఆ వైమానిక యోధుడు ఇక విమానాలు విఫలం కాని, ఏ కల్లోలాలూ లేని ఆకాశాలకు చేరుకోవాలని ఆశిస్తున్నాను. అతని కుటుంబం తమ వియోగాన్ని మానవుని సాహసికాంశకు ఉత్కృష్ట తార్కాణంగా అర్థం చేసుకుంటారనీ భావిస్తున్నాను.

ఇక మనం– రక్తంతో గీసిన సరిహద్దులకు ఇరువైపులా ఉన్న మనం– మర్యాద ఇవ్వాల్సిన దానికి మర్యాద ఇచ్చే పెద్దరికాన్నీ, బాధపడాల్సిన వాటికి బాధపడే పరిణతినీ సాధిస్తామని తలుస్తాను. వేర్వేరు దేశాలకు పౌరులుగా మారే కంటే ముందే మనమంతా ఆకాశదేశానికి పౌరులం. ఏదో రోజు నశించిపోయే మనమంతా, శాశ్వతమైనది ఏదో అందుకునే ప్రయత్నంలో పైకి ఎగిరేవాళ్లమే, భూమ్యాకర్షణ వెనక్కు లాక్కునేలోగా.

ఆకాశం సరిహద్దులకు అతీతంగా దుఃఖిస్తుంది!
మనమూ అదే మర్యాదను పాటిద్దాం!

• ఏయిర్ కమొడోర్ పెర్వేజ్ అక్తర్‌ఖాన్

జనరల్ సీట్లలోనూ బీసీలు పోటీచేయాలి

దశాబ్దాలుగా మన రాజకీయ పార్టీలు బీసీలు రిజర్వేషన్ పరిధిలోనే ఉండి ఎదగాలని, ఓపెన్ కేటగిరిలో పోటీ చేయరాదని బీసీ ప్రజల మనసుల్లో నాటాయి. దీని ప్రకారం బీసీలు కేవలం రిజర్వు స్థానాలకే పరిమితమై, జనరల్ (ఓపెన్) స్థానాల్లో పోటీ చేయడం 'అసాధ్యం' అని నమ్మేలా చేశాయి. ఇది అగ్రకుల ఆధిపత్యాన్ని కాపాడే ఒక రాజకీయ వ్యూహంలో భాగం.

రిజర్వేషన్ విధానం బీసీలకు (ఒక్క బీసీలకే కాదు.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలకు సైతం) సామాజిక న్యాయం కల్పించే సాధనం. అయినా, రాజకీయ పార్టీలు రిజర్వేషన్ విధానాన్ని 'ఆధారం'గా మలిచాయి. "జనరల్ సీట్లలో మీకు గెలుపు ఛాన్స్ లేదు, మీరు రిజర్వు సీట్లలోనే సురక్షితం" అనే సందేశాన్ని పదే పదే ప్రచారం చేశాయి. ఫలితంగా బీసీల్లో జనరల్ సీట్ అంటేనే అగ్రకులాలకే అనే ఆలోచన లోతుగా పాతుకుపోయింది. జనరల్ సీట్లలో బీసీలను దూరంగా ఉంచే రాజకీయ వ్యూహాలు... డబ్బు, మద్యం, కండబలం, బంధు ప్రభావం అన్న అస్త్రాలతో జనరల్ స్థానాల్లో అగ్రకుల అభ్యర్థులనే నిలబెట్టారు, నిలబెడుతున్నారు. బీసీలు జనరల్ సీట్లలో పోటీ చేయాలనుకున్నా, పార్టీ టికెట్ ఇవ్వడం లేదు... ఇచ్చినా మద్దతు ఇవ్వడంలేదు. ఓసీలు రిజర్వు సీట్లలో పోటీచేయలేరు కాబట్టి, మీరు కూడా జనరల్ సీట్లకు రాకూడదు అనే లాజిక్‌తో బీసీలను మానసికంగా బంధిస్తున్నారు. బీసీలు పార్టీ కోసం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగపడతారు తప్ప, ఖర్చు పెట్టే సామర్థ్యం లేదని టిక్కెట్ ఇచ్చేటప్పుడే నిర్ణయించేస్తారు.



తెలంగాణలో బీసీలు జనాభాలో 50–56 శాతం ఉన్నా, జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులు తక్కువే. ఇది రాజకీయ పార్టీలు బీసీలను 'ఓటు బ్యాంకుగా' మాత్రమే చూస్తున్నాయనడానికి స్పష్టమైన నిదర్శనం. కర్ణాటకలో లింగాయత్, వొక్కలిగలు... తమిళనాడులో థెవర్, వన్నియర్, గౌండర్ వంటి బీసీ వర్గాలు, బీహార్‌లో యాదవులు, కుర్మీలు జనరల్ సీట్లలోనే రాజకీయ ఆధిపత్యం సాధించారు. ఈ రాష్ట్రాల్లో బీసీలు రిజర్వేషన్‌ను 'కనీస హామీ'గా మాత్రమే తీసుకుని, జనరల్ సీట్లలో పోటీచేసి గెలిచారు. ఇది చట్టసభల్లోనే కాదు, తెలంగాణలో నేటి నుంచి జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా ఎందుకు అమలు చేయకూడదో బీసీలు ఆలోచించాలి.

రిజర్వ్ సీట్లు హక్కు, కానీ పరిమితి కాదు. రాజకీయ పార్టీలు ఏర్పరిచిన మానసిక బంధనం నుంచి బీసీలు బయటపడాలి. ఓపెన్ క్యాటగిరీలో అగ్రకుల రిజర్వేషన్ మాత్రం సాగుతోంది. బీసీలు కేవలం రిజర్వ్ సీట్లకు మాత్రమే పోటీ చేస్తే, రాజకీయ శక్తి పునర్వ్యవస్థీకరణ ఎప్పటికీ జరగదు. ఆధిపత్య కుల వర్గాలు స్థిరంగా ఉంటాయి. రిజర్వేషన్లు మన హక్కు. కానీ, జనరల్ సీట్లకు పోటీ చేయడం మనకు గౌరవం.

జనరల్ సీట్లలో బీసీలు పోటీ చేసేలా పార్టీలపై ఒత్తిడి తేవాలి. బీసీలలో ఆర్థికంగా బలపడిన కొత్త తరం రాజకీయంగా ముందుకు రావాలి. బీసీ సామాజిక వర్గాల మధ్య ఐక్యత పెంచుకోవాలి, ఉపకుల విభజనను అధిగమించాలి. జనాభా ఎక్కువ వున్న కులాలు... అతి తక్కువ జనాభా గల వారికి అవకాశాలు కల్పించడం కోసం రిజర్వుడ్ సీట్లలో పోటీ చేయకుండా జనరల్ సీట్లకు పోటీ చేయాలి. రిజర్వేషన్‌ను 'సీలింగ్' కాకుండా చూడాలి. అలా అయితేనే బీసీలు తమ సంఖ్యా బలాన్ని అధికార బలంగా మార్చుకోగలరు. జనరల్ సీట్లలో బీసీలు పోటీ చేయడం అంటే కేవలం ఎక్కువ సీట్లు గెలవడం మాత్రమే కాదు, అగ్రకుల ఆధిపత్య రాజకీయ వ్యవస్థనే ప్రశ్నించడం. కాబట్టి ఇప్పుడు బీసీ యువత మేలుకోవాల్సిన సమయం. రిజర్వు సీటు మాత్రమే కాదు– మొత్తం రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యం బీసీల హక్కు. అని ఇప్పుడు పోరాడాలి.

◆ పి. నాగరాజు

దుర్వినియోగమవుతున్న 'ఉచితాలు'!

రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చేందుకు ప్రజలకు ఉచిత పథకాలను ప్రకటిస్తున్నాయి. అయితే ఉచితాలలో కొన్ని నిజంగా మానవవనరుల అభివృద్ధికి, ఆరోగ్యానికి ఉపయోగపడుతుంటే, చాలా వరకు దుర్వినియోగం అవుతున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్ పథకం ప్రకటించాక జిల్లాల్లో స్థానికంగా ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్న మహిళలు తమ పిల్లలు హైదరాబాద్‌లో చదువుకుంటున్నారని ఇక్కడికి మకాం మారుస్తున్నారు. ఫ్రీ బస్ వల్ల నిత్యం హైదరాబాద్ నుంచి సమీప జిల్లాలకు వెళ్లి ఉద్యోగం చేసుకుంటున్నారు. ఇంకా రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాలను దర్శించడానికి ఉచిత బస్సు పథకం ఉపయోగించుకుంటున్నారు. ఉచిత విద్యుత్ సరఫరా కారణంగా మా గ్రామంలో విద్యుత్ బిల్లు కట్టేవారు ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. ఇక 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ పుణ్యమాని కట్టెల పొయ్యి మాని దాదాపు అన్ని కుటుంబాలు గ్యాస్ పొయ్యికి అలవాటుపడ్డాయి. కానీ ఇటీవల ఉచిత కరెంటు పథకం వల్ల, డబ్బులెందుకు వృథా చెయ్యాలని ఏకంగా ఇండక్షన్ ఎలక్ట్రిక్ స్టవ్‌లు గ్రామాల్లో బహుళ ఉపయోగంలోకి వచ్చాయి. ఎలాగూ రైతులకు వ్యవసాయానికి ఉచిత కరెంట్ ఇస్తూనే ఉన్నారు.

గత ప్రభుత్వాలు, ఇప్పటి ప్రభుత్వం కూడా ఇబ్బడి ముబ్బడిగా తెల్ల రేషన్ కార్డులు ఇవ్వటం వల్ల దాదాపు చాలా మంది రేషన్ బియ్యానికి అర్హులయ్యారు. అయితే గతంలో దొడ్డు బియ్యం ఇవ్వటం వల్ల వాటిని తినకుండా గొర్రెలకు, బర్రెలకు పెట్టడమో... లేదా ఇడ్లీ, దోశ వంటి వాటికి వాడుకోవడమో చేసేవారు. చాలా మంది దొడ్డు బియ్యాన్ని అమ్మేసుకునేవారు. ఈ బియ్యాన్ని గ్రామంలో ఒక శాతం ప్రజలు కూడా తినేవారు కాదంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు సన్నబియ్యం ఇవ్వటంతో కొందరైనా తింటున్నారు. ఇక మరొక ఉచితం వృద్ధుల పెన్షన్. ఇది నిరుపేదలకు, పోషణ లేని వారికిస్తే ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ ఆస్తిపాస్తులున్న వ్యవసాయ కుటుంబాల వారు కూడా దీనిని పొందుతున్నారు. ఈ డబ్బులను బెల్టు షాపులకు ధారాదత్తం చేస్తూ వ్యసనాల బారిన పడుతున్నారు.

ఎన్నికల్లో విజయం సాధించటానికి ఈ ఉచితాలను ప్రకటించటం, కొన్నిటిని అమలు చేసి, మరికొన్ని ఆలస్యమైతే ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొడుతున్నాయి. ఒకసారి ప్రభుత్వం ఒక ఉచిత పథకాన్ని అమలు చేసాక, అధికారంలోకి వచ్చిన మరో ప్రభుత్వం కూడా ఆ పథకాన్ని తొలగించే సాహసం చేయలేక ఆర్థిక భారం మోస్తున్నాయి. రాజకీయాల్లో రెండు రకాల నాయకులుంటారు ఒక రకం రాజనీతిజ్ఞులు, మరొక రకం ఫక్తు రాజకీయ నాయకులు. ఈ రెండో రకం భావి తరాల గురించి, వారి అభివృద్ధి గురించి పట్టించుకోరు. ఎలాగైనా అధికారంలోకి రావటం, సంపాదించుకోవటమే వారి ఎజెండా. రానురానూ రాజనీతిజ్ఞులు కరువవుతున్నారు.



ఈనాడూ ప్రజలు కూడా ఉచితం తమ జన్మహక్కులాగా భావిస్తున్నారు. ఈ ఉచితాల డబ్బంతా కూడా ప్రభుత్వం టాక్స్ పేయర్స్ నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నదే. ఈ ఉచితాల వల్ల ప్రభుత్వం అధిక అప్పులు చేయటం, బడ్జెట్ లోటు పూడ్చలేనంతగా దిగజారడం, టాక్సులు పెంచటం చేస్తాయి... ఇదంతా రాష్ట్ర ప్రజలే భరించాలి; బడ్జెట్‌లో ప్రాధాన్యత క్రమాలు మారుతాయి. ఉదాహరణకు కొత్త రోడ్ల నిర్మాణాలు, ఉన్నవాటికి మరమతులు మందగిస్తాయి. తద్వారా ప్రజలు ఇబ్బందులు పడతారు. అలాగే విద్యుత్ కేంద్రాల నిర్మాణం, పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రుల అభివృద్ధి వంటి కార్యక్రమాలు కుంటుపడతాయి. ఉచితాలకు అలవాటుపడ్డ ప్రజలు పనులు చేయటానికి ముందుకు రారు. గ్రామాల్లో ఇప్పటికే లేబర్ దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉచితాల వల్ల కొన్ని ఉపయోగాలు కూడా ఉన్నాయి. విద్యార్థులకు ఇచ్చే మధ్యాహ్న భోజనం వల్ల పాఠశాలల్లో హాజరు శాతం పెరుగుతుంది. కాలేజీ విద్యార్థులకిచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్ల మానవ వనరులు పెరుగుతాయి. ఆరోగ్య సంరక్షణకు పెట్టే ఖర్చు వల్ల ప్రజలకు మేలు జరుగుతుంది. అయితే ఉచిత పథకాలను సంస్కరించాల్సిన అవసరం ఉంది. కేవలం అర్హులకు మాత్రమే ఇవి అందాలి, అనర్హులను ఏరిపారేయాలి. ఉచితాలను వృథా చేసేవారికి కూడా ముకుతాడు వేయాలి.

■ డా. కొండి సుధాకర్‌రెడ్డి
రిటైర్డ్ లెక్చరర్

కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్

హనుమకొండ, కలెక్టరేట్ 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నికల సహాయక కేంద్రాన్ని (హెల్ప్‌లైన్) ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. ఈ సహాయక కేంద్రం 24 గంటల పాటు పని చేస్తుందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన సందేహాలు, ఫిర్యాదుల కోసం ఫోన్ నెంబర్ 79819 75495లో సంప్రదించాలని సూచించారు.

మద్యంతర సిరి



- డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం
- పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌తో మద్యం వ్యాపారుల్లో జోష్
- ఓట్ల వేటలో మద్యం పంపిణీ షరామామూలే
- డిసెంబరు 17 వరకు ఎన్నికలు ఉండటంతో మద్యానికి ఫుల్ డిమాండ్
- ఈ నెల 28 నుంచే కొత్త మద్యం షాపులకు లిక్కర్ కేటాయింపులు
- ఉమ్మడి జిల్లాలో 294 మద్యం షాపుల యజమానులు ఫుల్‌ఖుషీ

లిక్కర్ షాపులకు ఎన్నికల కిక్కు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కొత్త మద్యం షాపులకు పంచాయతీ ఎన్నికలు కిక్కు ఇవ్వనున్నాయి. 2025-27 సంవత్సరానికి ఇటీవలే మద్యం షాపులకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. గత అక్టోబరు 27న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 294షాపులకు లక్కీ డ్రా ద్వారా లిక్కర్ ఓనర్లను ఎంపిక చేశారు. డిసెంబరు 1వ తేదీ నుంచి కొత్త షాపులను ప్రారంభించేందుకు మద్యం షాపు యాజమానులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. దీంతో లిక్కర్ షాపుల యాజమానులకు షాపుల ప్రారంభంలోనే లాభాల కిక్కు తగలనుందనే టాక్ వినబడుతుంది. ఏడాది కాలంలో మేడారం మహజాతరతో పాటు పరిషత్తు, మునిసిపాలిటీ ఎన్నికలు కూడా నిర్వహించే అవకాశం ఉండటంతో ఈసారి మద్యం దుకాణాలు దక్కించుకున్న వారి మహ అదృష్ట వంతులనే టాక్ వినబడుతుంది.

1న కొత్త మద్యం షాపులు

మద్యం షాపులకు లోకల్ బాడీ ఎన్నికలు కలిసి రానున్నాయి. వరంగల్ అర్బన్‌లో 67మద్యం షాపులు ఉండగా, వరంగల్‌రూరల్ జిల్లాలో 57 షాపులు, మహబూబాబాద్ జిల్లాలో 61 షాపులు, జనగామ జిల్లాలో 50, భూపాలపల్లి, ములుగు జిల్లాలో 59షాపులు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 294మద్యం షాపులు ఉండగా, 10,493 దరఖాస్తులు వచ్చాయి. వీటికి సంబంధించి అక్టోబరు 27వ తేదీన లక్కీ డ్రా ద్వారా మద్యం షాపు యాజమానులను ఎంపిక చేశారు. వీరికి ఈ నెల 28వ తేదీ నుంచి మద్యం కేటాయింపులు చేయనున్నారు. డిసెంబరు 1 నుంచి కొత్త మద్యం షాపుల్లో అమ్మకాలు చేయనున్నారు. రెండేళ్ల పాటు మద్యం అమ్ముకోవటానికి ప్రభుత్వం లైసెన్స్‌లు జారీ చేసింది. ఇప్పటికే ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, ఇన్‌స్టాల్‌మెంట్ పేమెంట్‌లు షాపు ఓనర్లు పూర్తి చేస్తున్నారు. బ్యాంకు గ్యారంటీలతో పాటు షాపు నిర్వహణకు అనువైన ప్రాంతంలో గదులను వెతికే పనిలో పడిపోయారు.

ఎన్నికల కిక్కు

కొత్త మద్యం షాపులకు ప్రారంభంలోనే పంచాయతీ ఎన్నికల రూపంలో కలిసి వస్తోంది. పాత షాపులకు నవంబరు 30వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికి, కొత్త షాపులు ఈ నెల 28వ తేదీ నుంచే మద్యం కేటాయింపులు చేస్తున్నారు. డిసెంబరు 1 నుంచి అమ్ముకునేలా ఎక్సైజ్‌శాఖ అనుమతులను ఇస్తోంది. కాగా, ఇప్పటికే ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించింది. నవంబరు 27వ తేదీ నుంచి డిసెంబరు 17వ తేదీ వరకు మూడు విడతల్లో ఎన్నికలు జరుగనున్నాయి. తొలి విడత పంచాయతీ ఎన్నికలకు గురువారం నోటీఫికేషన్ విడుదల

(మిగతా 7లో..)

పల్లె రెఢీ

మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు నేటి నుంచే నామినేషన్లు



- భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో సందడి
- 69 సర్పంచ్‌లు.. 658 వార్డు సభ్యుల పదవులు..
- 24 క్లస్టర్లలో 24 నామినేషన్ కేంద్రాలు
- ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరణ
- దాఖలుకు ఎల్లుండి వరకు గడువు

హనుమకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల ప్రక్రియ గురువారం నుంచి మొదలవుతోంది. హనుమకొండ జిల్లాలో మొదటి విడతగా మూడు మండలాల్లోని 69గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, 658 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల నిర్వహణకు నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి మొదలు కానున్నది. నామినేషన్ల స్వీకరణకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాట్లపై ఎన్నికల అధికారులతో సమీక్షించారు. మొదటి విడత ఎన్నికల నిర్వహణకు 24 క్లస్టర్లలో 24 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్లస్టర్లకు ఎన్నికల సామగ్రిని తరలించారు. ఎన్నికల నోటీసు, ఓటర్ల జాబితా, నామినేషన్ పత్రాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబందించిన పత్రాలను క్లస్టర్లకు పంపించారు. నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రిజర్వేషన్ల

(మిగతా 8లో..)

ఎన్నికల్లో.. ఎన్ని కలలో...

- పంచాయతీ పోరుపై పల్లెల్లో జోరుగా మంతనాలు
- సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలపై దృష్టి
- గాడ్ ఫాదర్లను ప్రసన్నం చేసుకుంటున్న ఆశావహులు
- పార్టీల గుర్తులు లేకుండా ఎన్నికలు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న అన్ని పార్టీలు

7

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లాలో మొదటి విడత ఎన్నికల నిర్వహణకు నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. మొదటి విడత ఎన్నికలలో భాగంగా జిల్లాలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లోని 24క్లస్టర్లలో 24నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలకు గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

మొదటి విడత నామినేషన్ పత్రాల స్వీకరణకు నామినేషన్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను సిద్ధం చేసి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ పత్రాలు, ఎన్నికల సామాగ్రి సంబంధిత మండలాలకు పంపినట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించామని తెలిపారు. రిజర్వేషన్ల వివరాలను టీపోల్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎంసీఎంసీ మీడియా సెల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్ఎస్‌టీ టీంలను బృందాలుగా ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, హనుమకొండ, పరకాల ఆర్‌డీఓలు రాథోడ్ రమేష్, డాక్టర్ కే.నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్‌తోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ సస్పెన్షన్

అవినీతి ఆరోపణలపై సీపీ కొరడా

వరంగల్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పలు వివాదాల్లో తలదూర్చి, అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో మామునూరు మాజీ ఇన్‌స్పెక్టర్ ఒంటేరు రమేశ్, కానిస్టేబుల్ రఘుపై పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈస్ట్‌జోన్ పరిధిలోని మామునూర్ పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఇన్‌స్పెక్టర్ ఒంటేరు రమేశ్, కానిస్టేబుల్ రఘు అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. వీటిపై సీపీ విచారణకు ఆదేశించారు. అయితే విచారణ సాగుతున్న క్రమంలో ఇటీవల జరిగిన బదిలీల్లో రమేశ్ మామునూర్ నుంచి వీఆర్‌కు బదిలీ అయ్యారు. అధికారుల విచారణలో ఇన్‌స్పెక్టర్ రమేశ్, కానిస్టేబుల్ అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ బుధవారం సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్ మోసం ఎల్లకాలం నడవదు

- రాష్ట్రానికి పట్టిన విషపురుగు రేవంత్‌రెడ్డి
- బీసీల రిజర్వేషన్లలో తడిగుడ్డతో గొంతు కోశారు
- దాడులకు, అరెస్టులకు భయపడొద్దు
- పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి
- పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు



దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హనుమకొండ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న ద్రోహం, మోసం ఎల్లకాలం నడవదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ భాస్కర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. నవంబరు 26 భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని , రాష్ట్రానికి పట్టిన విషపురుగు , అవినీతి అనకొండ సీఎం రేవంత్‌రెడ్డి అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల తగ్గింపుపై బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం తడిగుడ్డతో గొంతు కోసిందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. 16 ఏళ్ల క్రితం కేసీఆర్ కరీంనగర్ నుంచి సిద్ధిపేటకు వెళ్లేందుకు వస్తుండగా వరంగల్‌లో పోలీసులు అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించారని ఇప్పటికీ ఆ సంఘటనలు తన మదిలో మెదలుతున్నాయని గుర్తు చేశారు. కేసీఆర్ పోరాట స్ఫూర్తిని, విద్యార్థుల త్యాగాలను, ఉద్యోగులు చూపినబాటలో తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు చూపిన మార్గంలో, న్యాయవాదులు, సబ్బండ వర్గాల ప్రజలు పోరాట పటిమను గుర్తు చేసుకొని దీక్షా దివస్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కొక్కరు కేసీఆర్ లాగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కోసం మరో రెండేళ్ల ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిందేనని కార్యకర్తలకు సూచించారు. కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేసేందుకు ప్రజలు

(మిగతా 6లో..)

టెక్స్‌టైల్ పార్కుతో మహర్దశ

- కేసీఆర్ దార్శనికతతో వరంగల్‌కు పూర్వవైభవం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- టెక్స్‌టైల్స్ పార్కులోని కైటెక్స్ కంపెనీ సందర్శన

7



కైటెక్స్ కంపెనీలో ఉత్పత్తులను పరిశీలిస్తున్న కేటీఆర్

మార్మోగిన నాగేంద్రుని నామస్మరణ

కనుల పండువగా శ్రీవల్లి దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణోత్సవం

- ఊకల్ ఆలయంలో సంప్రదాయబద్ధంగా సాగిన వేడుక
- మాజీ మంత్రి కేటీఆర్ సహా పలువురు ప్రముఖుల హాజరు
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

6





ఉత్సవమూర్తుల మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకులు, కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

మరణంలోనూ వీడని స్నేహం





వెంకట్‌రెడ్డి, యాకూబ్ అలీ (ఫైల్)

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం
- రోడ్డుపైన ధాన్యం ఆరబోయడం వల్లే ఘటన
- మోపెడ్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం
- ఇద్దరి మృతితో ఉడుతగూడెం, ఒంటిమామిడిపల్లిలో విషాదం



రోడ్డుకు ఒకవైపు ఆరబోసిన ధాన్యం

ఐనవోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ముప్పై ఏళ్లుగా మంచి స్నేహితులు. ఒకరిని వదిలి మరొకరు ఉండలేరు. ఎవరికి ఏ పని ఉన్నా కలిసే వెళ్తారు. చివరకు మరణంలో సైతం ఒకరిని విడిచి ఒకరు ఉండలేక పోయారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురం-ఒంటిమామిడిపల్లి గ్రామాల మధ్య బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉడుతగూడెంకు చెందిన ఆకారపు వెంకట్‌రెడ్డి(65), ఒంటిమామిడిపల్లికి చెందిన

(మిగతా 6లో..)

దర్జాగా రోడ్డు కబ్జా

- వడ్డెపల్లి టీచర్స్‌కాలనీ-2లో అక్రమంగా ఇంటి నిర్మాణం
- కాలనీ కమిటీ ఫిర్యాదులు పట్టని జీడబ్ల్యూఎంసీ అధికారులు
- ప్రశ్నిస్తే పట్టాదార్లమని బెదిరిస్తున్నారంటున్న స్థానికులు
- నిద్ర నటిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు
- కమిషనర్ స్పందించి కూల్చివేయాలని విన్నపం

6



టీచర్స్‌కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మాణం

ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియచేయునది ఏమనగా నా క్లయింట్స్ అయిన శ్రీ అనుమాల సుదర్శన్, తండ్రి: [illegible] కొమ్మాలు, శ్రీమతి అనుమాల [illegible], భర్త: [illegible] కొమ్మాలు, శ్రీమతి [illegible] [illegible] వడ్డేపల్లి, హనుమకొండ గార్ల సూచన మేరకు ఈ ప్రకటన జారీ చేయనైనది. [illegible] 1)817/A, ఎ.4.26గుం 2)863/B ఎ.5.00గుం, 3)868 & 869 ఎ.5.35గుం, 4) 856-ఎ.4.00.గుం, 5) 631 ఎ.2.09గుంటలు మరియు 6)423 ఎ.0.18.గుంటలు, [illegible] దావా నెంబర్ : OS 40/2024 [illegible]

సం/- పాములపర్తి సదాశివరావు టి.మాధవరావు, భోగి దిలీప్, ఇనాయతుల్లా సలాహుద్దీన్ షమ్స్
Advocates

నేడు రైల్వే స్టాఫ్ గ్రీవెన్స్ క్యాంపు

బాలసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో రైల్వే కమ్యూనిటీ హాల్‌లో గురువారం రైల్వే స్టాఫ్ గ్రీవెన్స్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ ఎం.గిరిజ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు, చీఫ్ ఓఎస్‌లు పాల్గొంటున్నట్లు ఆమె తెలిపారు. రైల్వే ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల నుంచి ఉమిద్ కార్డ్స్, ఐడీ కార్డ్స్, ఎస్ఆర్ ప్రమోషన్లలో లోపాలను, జీత భత్యాల లోపాలను అన్నింటిపై సవివరంగా వినతి పత్రాలు తీసుకొని సమస్యలను పరిష్కరించనున్నట్లు ఆమె తెలిపారు. రైల్వే ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు క్యాంపును సద్వినియోగ పర్చుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

బాలికను చితకబాదిన టీచర్

పాఠశాల ప్రిన్సిపాల్‌ను నిలదీసిన విద్యార్థి సంఘాలు

రాంనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేయూ సీ రోడ్డులోని డబ్బాల సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ హైస్కూల్‌లో నాల్గో తరగతి చదువుతున్న బాలికను ఇంగ్లీష్ టీచర్ చితకబాదగా చిన్నారి ఒంటిపై వాతలు వచ్చాయి. దీంతో విద్యార్థి సంఘాలు, బాధిత బాలిక తల్లితండ్రులు పాఠశాలకు చేరుకొని మహిళా ప్రిన్సిపాల్‌ను నిలదీయగా తప్పు ఒప్పుకొని క్షమాపణలు కోరడంతో తల్లితండ్రులు శాంతించారు. విద్యార్థి సంఘాలను సైతం తల్లితండ్రులు సముదాయించడంతో శాంతించి ఇంకోకసారి ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల ఆందోళన తెలుసుకున్న హనుమకొండ బ్లూకోల్ట్స్ టీం పాఠశాలకు చేరుకొని అల్లరి జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్య


రామ్‌కిరణ్(ఫైల్)

కాజీపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కాజీపేటలో చోటు చేసుకుంది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం లింగాపూర్‌కు చెందిన గుర్రం శ్రీనివాస్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు గుర్రం రామ్‌కిరణ్(24) కాజీపేట రైల్వేస్టేషన్‌లో అప్రెంటీస్ చేస్తూ స్థానిక బాపూజీనగర్‌లో స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. కాగా, కొంతకాలంగా రామ్‌కిరణ్ మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భోజనం చేసి నిద్రపోయాడు. ఉదయం చూసే సరికి రూంలో ఉరి వేసుకొని మృతి చెంది ఉన్నాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మరణంలోనూ వీడని స్నేహం

(5వ పేజీ తరువాయి)

మహ్మద్ యాకూబ్‌అలీ అలియాస్ చిన్న యాకుబ్ (65) మృతి చెందారు. ఇద్దరూ బుధవారం సాయంత్రం ధర్మసాగర్ మండలం రాంపూర్‌లోని రేకుల ఇండస్ట్రీకి ఐరన్ రేకుల(షీట్లు) కోసం మోపెడ్‌పై వెళ్లి ఖరీదు చేసి రాత్రి 7.30 గంటలకు ఇళ్లకు తిరుగు ప్రయాణం అయ్యారు. వెంకటాపూర్-ఐనవోలు రోడ్డుపై కిలోమీటర్ల కొద్దీ రోడ్డుకు ఒకవైపు రైతులు ధాన్యం, మక్కలను ఎండబోశారు. ఈ క్రమంలో పౌల్ట్రీఫాం సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తుతెలియని వాహనం లైట్ల వెలుతురులో రాంగ్ రూట్‌లో వచ్చి మోపెడ్‌ను వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరు రోడ్డుపై ఎగిరిపడి తలలు ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందారు. ఢీకొట్టిన వాహనం ఆపకుండా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న జఫర్‌గడ్ ఎస్సై రామారావు హుటాహుటిన వచ్చి స్థానికుల సహాయంతో మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు.

కాగా, వెంకట్‌రెడ్డి భార్య లక్ష్మి గతంలో మృతి చెందింది. ఒక కుమారుడు ఒక కుతూరు ఉన్నారు. ఇద్దరి వివాహాలు జరిగాయి. స్వగ్రామంలో ఒంటరిగా ఉంటూ వ్యవసాయంతోపాటు వర్ధన్నపేటలో ఉన్న తమ ఫంక్షన్ హాల్‌ను చూసుకుంటాడు. వయస్సు మీద పడటంతో స్కూటీపై ప్రయాణం చేయవద్దని కుటుంబసభ్యులు వారించగా ఒక మోపెడ్ తీసుకొని పనులు చక్కపెట్టుకుంటున్నాడు. ఇక యాకూబ్‌అలీకి భార్య యాకూబ్‌బీ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అందరి వివాహాలు జరిగాయి. కుమారులు ప్రైవేటు వ్యాపారం చేసుకుంటున్నారు. కుమారులకు చేదోడు వాదోడుగా యాకూబ్‌అలీ సహాయ పడుతాడు. మృతులు ఇద్దరూ నిత్యం కలిసి ఉంటూ అకాల మరణం చెందడంతో రెండు గ్రామాల్లో వీరి స్నేహాన్ని గుర్తుచేసుకుంటూ విచారం వ్యక్తం చేశారు.

ప్రయాణికులకు ప్రాణ సంకటం..

ఐనవోలు-వెంకటాపురం రోడ్డుపై సుమారు 6 కిలోమీటర్లు రోడ్డుకు ఒకవైపు ధాన్యం, మొక్కజొన్నలు ఎండబోసి వన్‌వేగా మార్చారు. దాంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటూ ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల వెలుతురులో రాళ్లు, సంచులు తగిలి పడిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ రోడ్డు ఐనవోలు, జఫర్‌గడ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉంటుంది. పోలీసులు పలుమార్లు హెచ్చరించినా రోడ్డుపై ధాన్యం పోస్తున్నారని విమర్శిస్తున్నారు. ఐనవోలు దేవస్థానానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఇదే రోడ్డుపై వచ్చివెళ్తుంటారు.

దర్జాగా రోడ్డు కబ్జా

టీచర్స్‌కాలనీ-2లో అక్రమంగా ఇంటి నిర్మాణం
కాలనీ కమిటీ వినతులు పట్టని జీడబ్ల్యూఎంసీ అధికారులు
స్థానికులు ప్రశ్నిస్తే పట్టాదార్లమని బెదిరింపులు


టీచర్స్‌కాలనీ ఫేజ్-2లో రోడ్డును ఆక్రమించి నిర్మాణం

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వడ్డెపల్లి సమీపంలోని టీచర్స్‌కాలనీ-2లో ఎప్పుడో 40 ఏళ్ల క్రితం విక్రయించిన భూమిలో తమకు ఇంకా భూమి మిగిలి ఉందని ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి ఇందిరమ్మ ఇంటిని నిర్మించడం వివాదంగా మారింది. యేళ్ల క్రితం తాము లక్షలు వెచ్చించి స్థలం కొనుగోలు చేసి పక్కా ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటే, భూములకు వారసులం అని ఓ వ్యక్తి ప్రత్యక్షమై ఆరు మాసాల క్రితం రోడ్డును ఆక్రమించి మరీ ఇంటి నిర్మాణం చేపట్టారని స్థానికులు చెబుతున్నారు. టీచర్స్‌కాలనీ ఫేజ్-2లోని రోడ్డు నెంబర్ 5లో జరుగుతున్న అక్రమ నిర్మాణంపై జీడబ్ల్యూఎంసీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని మండిపడుతున్నారు. దీనిపై కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌ను రెండు మార్లు కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు.

ప్రస్తుతం 60వ డివిజన్ పరిధిలో వున్న టీచర్స్‌కాలనీ ఫేజ్-2లో 1986లో 'కుడా' మాస్టర్ ప్లాన్ ప్రకారం పాత సర్వే నెంబర్ 597, 599లో లే ఔట్, నాన్ లేఔట్ ప్లాట్లను పలువురు కొనుగోలు చేశారు. జీపీఏ ద్వారా బొల్లపెల్లి వంశస్తుల నుంచి కొనుగోలు చేశారు. ఏడీపీ (ఏరియా డెవలప్‌మెంట్ ప్లాట్స్) ప్రకారం కాలనీలో 33 ఫీట్ల రోడ్లను వదిలేసి కట్టడాలు జరుపుకున్నారు. ఈ క్రమంలో నాలుగు మాసాల క్రితం ఓ వ్యక్తి రోడ్డు నెంబర్-5లో గతంలో తాము రోడ్లకు ఇంత స్థలం వదిలి వేయలేదని పక్కనే ఉన్న ఖాళీ స్థలం అంతా తమదేనని రంగంలోకి దిగాడు. 33 ఫీట్ల రోడ్డులో సుమారు 8 ఫీట్లు ముందుకు వచ్చి సెట్‌బ్యాక్ కాకుండా నూతనంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నాడు. కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు వెళ్లి ఇదేమిటని ప్రశ్నిస్తే మేము లోకల్.. మీకు ఇక్కడ ఉండే అర్హత లేదని బెదిరింపులకు పాల్పడినట్టు తెలిపారు. ఈ భూములు మొత్తం తమవేనని అడ్డుపడితే ఇండ్లు మొత్తం కూలుస్తామని దాడికి పాల్పడే ప్రయత్నం చేసినట్టు తెలిపారు.

అధికారులు గప్‌చుప్

రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న ఇంటిపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు రెండు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు తూతూమంత్రంగా రిపోర్టు ఇచ్చినట్టు తెలిసింది. కబ్జాకు పాల్పడిన వ్యక్తులు అధికారులను రకరకాలుగా మేనేజ్ చేస్తున్నట్టు ఆరోపిస్తున్నారు. కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ స్పందించి అక్రమ కట్టడాన్ని నేలమట్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి మాట్లాడుతూ.. వెంచర్ చేసిన సమయంలో రోడ్డును 33 ఫీట్లుగా నిర్ణయించి హద్దులు ఏర్పాటు చేశారని, భూముల ధరలకు రెక్కలు రావడంతో ప్రస్తుతం రోడ్లు కబ్జా అవుతున్నాయని తెలిపారు. అలాగే స్థానికుడు రవిప్రసాద్ మాట్లాడుతూ 33 ఫీట్ల రోడ్డును 8 ఫీట్లు ఆక్రమించి ఇందిరమ్మ ఇల్లు నిర్మించడం వల్ల స్వచ్ఛ ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్లు వచ్చి వెళ్లడం ఇబ్బందిగా మారిందని తెలిపారు. అధికారులు స్పందించి పరిష్కార మార్గం చూపించాలని కోరారు.

మోసం.. రేవంత్‌రెడ్డి నైజం

విద్య, ఉద్యోగాలు, కాంట్రాక్టుల్లో 42 శాతం ఏమైంది
కడియం శ్రీహరి ఇజ్జత్ లేకుండా మాట్లాడుతున్నారు
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


జనగామలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జనగామ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలను మోసం చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఏ వర్గాన్ని వదల్లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీసీలు, రైతులు, మహిళలు, మైనారిటీలు, దళితులు ఇలా అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ జనగామ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'దీక్షా దివస్' సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్లు ఇదిగో, అదిగో అంటూ మోసం చేశారన్నారు. మండిపడ్డారు. రాజకీయాల్లో రిజర్వేషన్లు కోర్టు పరిధిలో ఉంటే విద్య, ఉద్యోగాలు, కాంట్రాక్టుల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. నీకు, నీ పార్టీకి కమిట్‌మెంట్ ఉంటే బీసీలకు విద్య, ఉద్యోగాలు, కాంట్రాక్టుల్లో ఇస్తానన్న 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని సవాల్ విసిరారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ రానున్న సర్పంచి, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, మునిసిపల్ ఎన్నికల్లో బీసీలంతా చావుదెబ్బ కొట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పుడున్న కొత్తతరం పిల్లలకు కేసీఆర్ పోరాటం తెలియదని, వారికి కేసీఆర్ పోరాటాన్ని తెలియజేయాలన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్‌లో గెలిచి పార్టీ మారి కమిట్‌మెంట్, క్యారెక్టర్ అంటూ సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీలోకి పోవడం, రాజీనామా చేయకుండా పదవి గబ్బిలంలా పట్టుకొని వేలాడడం క్యారెక్టరా అని నిలదీశారు. దమ్ము, నిజాయితీ ఉంటే రాజీనామా చేసి ఘన్‌పూర్‌కు రావాలని సవాల్ విసిరారు. ఈ వయస్సులో ఇజ్జత్, మానం లేకుండా ఎమ్మెల్యే పదవి కోసం పాకులాడుతున్నారని ధ్వజమెత్తారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు, అధికారులను అడ్డం పెట్టుకొని గెలిచిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. ఎన్నికల్లో ఓడిపోతే సీఎం సీటు పోతుందనే భయంతో రూ. కోట్లు పెట్టి గెలిచారని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలు తప్పులు చేస్తే ఉరికించి కొడ్తామని హెచ్చరించారు. ఊసరవెల్లికి మారు పేరుగా కడియం శ్రీహరి నిలిచారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 2023లో ఘన్‌పూర్ ప్రజలు గెలిపిస్తే మోసం చేసి పార్టీ మారాడని మండిపడ్డారు. సర్పంచి ఎన్నికల్లో కడియంను చిత్తు చిత్తుగా ఓడించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఎంజీఎం డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా మధుకర్ యాదవ్



వరంగల్ మెడికల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా డాక్టర్ ఎ.మధుకర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జనగామ ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ మధుకర్ యాదవ్ సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన పదోన్నతుల్లో భాగంగా డిప్యూటీ సివిల్ సర్జన్‌గా ఎంజీఎంలో బాధ్యతలు బుధవారం స్వీకరించారు. జనగామకు చెందిన ప్రముఖ న్యాయవాది కుమారుడైన మధుకర్ యాదవ్ గతంలో కోమళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య అధికారిగా విధులు నిర్వర్తించారు.

మల్లన్న కొబ్బరికాయల టెండర్ ఖరారు

● రూ.22.02 లక్షలకు వేలం

ఐనవోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం జాతర-2026 సంవత్సరానికి గాను కొబ్బరికాయల టెండర్ ఖరారైంది. గత కొన్నేళ్లుగా ఆన్‌లైన్ ద్వారా టెండర్ నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం అదే పద్ధతిలో రెండుసార్లు నిర్వహించగా ఎవరూ వేయలేదు. దీంతో ఎండోమెంట్ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ డి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఈవో కార్యాలయంలో బహిరంగ వేలంను నిర్వహించారు. వేలంలో పలువురు పాల్గొనగా, స్థానిక మాజీ సర్పంచ్ పల్లకొండ సురేష్ రూ.22,02,500లకు దక్కించుకున్నారు.

గత సంవత్సరం రూ.20,25,000లకు ఖరారు కాగా, ఈసారి అదనంగా సుమారు రూ.1.70 లక్షల ఆదాయం అదనంగా సమకూరినట్లు ఈవో కందుల సుధాకర్, చైర్మన్ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్‌లు తెలిపారు. శేషవస్త్రాలు సేకరించే హక్కు లైసెన్స్ టెండర్‌తోపాటు తలనీలాలు పోగు చేసుకునే హక్కు లైసెన్స్ టెండర్లలో వేలందారులు పాల్గొనక పోవడంతో డిసెంబరు 2న తిరిగి వేలం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం

వైభవంగా ఊకల్ నాగేంద్రుడి కల్యాణోత్సవం
పాల్గొన్న మాజీ మంత్రి కేటీఆర్, ప్రముఖులు


ఉత్సవమూర్తులకు తలంబ్రాలు సమర్పిస్తున్న కేటీఆర్

గీసుగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఊకల్ నాగేంద్రస్వామి ఆయలంలో మార్గశిర శుద్ధ సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర, వల్లీదేవి, దేవాసేనాదేవి కల్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా బుధవారం నిర్వహించారు. కల్యాణానికి ముందు ఉత్సవమూర్తులకు ఎదుర్కోళ్లు, ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను మయూర వాహనంలో కల్యాణ వేదికకు డప్పువాయిద్యాలతో భక్తులు తోడ్కొని వచ్చారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని జ్యోతిష్యరత్న సముద్రాల సుదర్శనాచార్యులు కన్నుల పండువగా జరిపించారు. కాగా ఎమ్మెల్యే రేవూరి సతీమణి సునంద ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలను సమర్పించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే పల్లె రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపనేని నరేందర్, మాజీ జెడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, ఏసీపీ వెంకటేష్, సీఐ విశ్వే శ్వర్‌లు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు.

గాయకుడు కరుణాకర్ ఆలపించిన భక్తి గేయాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ తిమ్మాపురం రాజేశ్వర్‌రావు, కొత్తగట్టు రాజు, మాచినపెల్లి మోతయ్య తదితరులు పాల్గొన్నారు. శాయంపేటహవేలిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొండపాక రాజగోపాలాచార్యులు, సంతోష్, కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్

మూడు రోజుల పాటు నిర్వహణ
మార్గదర్శకాలు వెల్లడించిన డీఈవో రంగయ్యనాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య నాయుడు

కరీమాబాద్, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉర్సు బైపాస్ రోడ్డులోగల తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ పాఠశాలలో ఈ నెల 27, 28, 29 తేదీలలో మూడు రోజుల పాటు జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ అవార్డ్స్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రంగయ్యనాయుడు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం అదే పాఠశాలలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీ ఈఆర్‌టీ న్యూఢిల్లీ మార్గదర్శకాలు, ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ డైరెక్టర్ సూచనలు, కలెక్టర్ అనుమతి మేరకు జిల్లాస్థాయి రాజ్య స్తరీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025-26, జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ మనాక్ అవార్డ్స్, ప్రాజెక్టుల ప్రదర్శన 2024-25ల సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన వివిధ పాఠశాలల యాజమాన్యాలు ఇందులో పాల్గొంటాయని అన్నారు.

మొత్తం ఏడు అంశాలలో జూనియర్, సీనియర్ విభాగాల్లో ఇప్పటికే సుమారు 450 ఎగ్జిబిట్లు నమోదయ్యాయని, వీటికి అదనంగా 164 మంది విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్ల ప్రదర్శన ఉంటుందన్నారు. ఎగ్జిబిట్లు, ప్రదర్శనలకు మూల్యాంకనం చేయడానికి వివిధ కళాశాలలు, యూనివర్సిటీల లెక్చరర్లు, ప్రొఫెసర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని, వారే ఉత్తమ ఎగ్జిబిట్లను ఎంపికచేస్తారని తెలిపారు. ఎగ్జిబిట్లను ప్రదర్శించే విద్యార్థులు, వారి గైడ్ టీచర్లు 27వ తేదీ ఉదయం 9 గంటల లోపు చేరుకొని రిజిస్ట్రేషన్ కమిటీకి రిపోర్ట్ చేసిన తర్వాత వెంటనే వారికి కేటాయించిన స్థలంలో ఎగ్జిబిట్‌ను ప్రదర్శించడానికి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రదర్శనలను తిలకించేందుకు వస్తున్న వారు వాహనాలను ఉర్సు రంగలీలా మైదానంలో పార్కింగ్ చేసుకోవాల్సిందిగా సూచిం చారు.

మొదటి రోజు 27న ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వరంగల్, ఖిలావరంగల్, గీసుగొండ మండలాల పాఠశాలలు, ప్రజలు వీక్షించవచ్చునని, రెండో రోజు 28న ఖానాపూర్, నెక్కొండ, చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి, నర్సంపేట మండలాలను అనుమతిస్తారు. మూడో రోజు 29న సంగెం, వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండలాల ప్రజలు, పాఠశాలల విద్యార్థులు సందర్శించవచ్చునని తెలిపారు.

ఈ కార్యక్రమానికి కలెక్టర్ సత్యశారద చైర్మన్‌గా, జిల్లా విద్యాశాఖాధికారి రంగయ్యనాయుడు మెంబర్ కన్వీనర్‌గా, జిల్లా సైన్స్ అధికారి సట్ల శ్రీనివాస్ కో-కన్వీనర్‌గా, గెజిటెట్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సహా 18 రకాల కమిటీలను ఏర్పాటు చేశారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి, కో-కన్వీనర్ సట్ల శ్రీనివాస్‌ను 9848878455 నంబరులో సంప్రదించవచ్చు.

ఒక్క పూట విధులు ఏల!?

● డీఈవో ఉత్తర్వులతో పీటీఐల ఆందోళన

● సగం వేతనంలో కోత పడుతుందని ఆవేదన

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో 25 ఏళ్లగా పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు(పీటీఐలు)గా పనిచేస్తున్న వారు.. అధికారులు తమ పొట్ట కొడుతున్నట్లు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని విధంగా వరంగల్ డీఈవో రంగయ్యనాయుడు జారీ చేసిన ఉత్తర్వులతో పీటీఐలు ఆందోళనలో పడ్డారు. పీటీఐలను ఒక్క పూటకే పరిమితం చేస్తూ డీఈవో జారీ చేసిన ఉత్తర్వులు విద్యాశాఖలో చర్చనీయాంశమయ్యాయి. డీఈవో నిర్ణయంతో జిల్లాలోని 68 మంది పీటీఐల వేతనంలో సగానికి కోతపడనుంది. పీటీఐలను ఒక్క పూట మాత్రమే పాఠశాలకు హాజరు కావాలని పేరులేని ఉపాధ్యాయ సంఘం వినతి మేరకు ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు డీఈవో పేర్కొనడం విద్యాశాఖలో హాట్ టాపిక్‌గా మారింది. ఎఫ్ఆర్ఎస్ అమలవుతున్న నేపథ్యంలో పీటీఐలు ఒక్క పూట మాత్రమే హాజరు కావాల్సి వస్తుందని, దీంతో సగం వేతనం కోల్పోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలావుండగా, జిల్లాలోని నల్లబెల్లి మండలంలో పనిచేస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి భార్య పీటీఐగా అదే మండలంలో పనిచేస్తున్నారు. ఆయన ఓ ఉపాధ్యాయ సంఘంలో పనిచేస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్ అమలవుతుండటంతో గతంలో మాదిరిగా సమయపాలన పాటించడం కష్టంగా మారడంతో ఆయన భార్య కోసమే ఉపాధ్యాయ సంఘం నేతలు డీఈవోను తప్పుదారి పట్టించారని పీటీఐలు ఆరోపిస్తున్నారు. ఒక్కరి కోసం 68 మంది జీవితాలతో చెలగాటమాడటం సరైందికాదని వారు విమర్శిస్తున్నారు. వాస్తవానికి విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పీటీఐల సేవలను రెండు పూటలా వినియోగించుకోవాలని స్పష్టంగా ఉంది. అయితే వాటిని పట్టించుకోకుండా డీఈవో ఉత్తర్వులు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది.

హత్య కేసులో వ్యక్తికి ఏడేళ్ల జైలు, జరిమానా

వరంగల్ లీగల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అత్తపై దాడిచేసి హత్యకు కారణమైన వ్యక్తికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా సెషన్స్ జడ్జి బీవీ నిర్మల గీతాంబ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ సుజ్జిత్ నగర్‌కు చెందిన వెంకటమ్మకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో సునితను వంగ సంపత్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ అనంతరం అత్త వెంకటమ్మకు చెందిన ఖాళీ స్థలంలో అల్లుడు సంపత్ రెండు రూములు నిర్మించి ఒక రూములో తాను, మరో రూంలో అత్త నివాసం ఉంటున్నారు.

ఈ క్రమంలో అత్త వెంకటమ్మ తన అల్లుడు సంపత్ సరిగా చూసుకోవడం లేదని అనారోగ్యంతో ఉన్నా తనను పట్టించుకోవడం లేదని ప్రతీ రోజు గొడవ పడుతుండేది. ఇదిలా ఉండగా 2023 ఆగస్టు 23న మద్యం సేవించి ఇంటికి వచ్చిన నిందితుడు సంపత్ అత్తపై సుత్తెతో తలపై కొట్టి పారిపోగా వెంకటమ్మను చికిత్స కోసం ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. నిందితుడి వంగ సంపత్‌పై పోలీసులు హత్యానేరం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు పీసీ దాడి శ్రీనివాస్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారిగా ఎన్. కరుణాకర్‌రావు వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

కాంగ్రెస్ మోసం ఎల్లకాలం నడవదు

(5వ పేజీ తరువాయి)

ఎదురు చూస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలన చేతగాక బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించేందుకు కుట్రలు చేస్తున్నాడని వారి కుట్రలకు భయపడాల్సిన పనిలేదన్నారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అమలు చేయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ప్రజలే గుణపాఠం చెబుతారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నాయకుల జోలికి వస్తే ప్రభుత్వ అరాచకాలపై కేసీఆర్ పోరాట స్ఫూర్తితో కదం తొక్కుతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, నన్నపనేని నరేందర్, రెడ్యా నాయక్, మాజీ ఎంపీ మాలోతు కవిత , వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, జోరిక రమేష్, పోలెపల్లి రాంమూర్తి, మేడిపల్లి శోభన్‌బాబు,సోదా కిరణ్, పస్తం అనిల్, తక్కళ్లపెల్లి వినిల్‌రావు, స్టేట్ సరోగసి బోర్డు మాజీ సభ్యురాలు హరిరమాదేవి, మేకల బాబురావు, బుద్దె వెంకన్న, నయీమొద్దీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో.. ఎన్ని కలలో..

- పంచాయతీ పోరుపై పల్లెల్లో జోరుగా మంతనాలు
- సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలపై దృష్టి
- పార్టీల గుర్తులు లేకుండా ఎన్నికలు
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న అన్ని పార్టీలు



హనుమకొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు కావడం, ఎన్నికల షెడ్యూల్ కూడా జారీ కావడంతో పల్లెల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ కాగానే ఈనెల 27 నుంచి మొదటి విడత ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల దాఖలు కూడా మొదలవుతుంది. దీంతో పల్లెల్లో మంతనాలు జోరందుకున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రంగంలోకి దిగుతున్నారు. ముఖ్యంగా సర్పంచ్ పీఠంపై కన్నేసిన వారంతా జిల్లా, రాష్ట్ర నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో పడ్డారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగకున్నా గ్రామ స్థాయిలో తమ పార్టీ పునాదులను పటిష్ఠం చేసుకోవడానికి అభ్యర్థులను రాజకీయ పార్టీలు బలపరుస్తాయి.

మంతనాల జోరు

రిజర్వేషన్ల అనుకూలత, గెలుపు అవకాశాలపై లెక్కలు వేసుకొని అప్పుడే ఆశావహులు ఎమ్మెల్యేలతో మంతనాలు జరుపుతున్నారు. ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ల వివరాలు తెలుసుకొని ఆ మేరకు ఆ పంచాయతీల్లో పోటీ చేసి గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులను గుర్తించే పనిలో పడ్డారు. మండలాల వారీగా ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో తాజా రాజకీయ పరిస్థితులు, పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మండల స్థాయి నాయకుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకుల్లో గెలుపు ధీమా అధికంగా ఉంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వు అయిన గ్రామ పంచాయతీల్లో కొంచెం ఆర్థిక పరపతి ఉన్నవారు పోటీకి సన్నద్ధమవుతున్నారు. సర్పంచ్ పదవులకు పోటీ ఎక్కువ ఉన్న చోట అసంతృప్తి చోటు చేసుకోకుండా పార్టీ నాయకులు ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో ఒకరిని సర్పంచ్, మరొకరిని ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలోకి దింపాలని యోచిస్తున్నారు. పల్లెల్లో పట్టు సాధించేందుకు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీలు వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. పార్టీ గుర్తులు లేకపోయినా తమ కార్యకర్తలను గెలిపించుకోవాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నాయి.

బీజేపీ ఆరాటం

మరో వైపు బీజేపీ కూడా పంచాయతీ ఎన్నికల్లో ఖాతాలను తెరవాలని చూస్తోంది. వీలైనంత మేరకు తమ పార్టీ నాయకులు సర్పంచులుగా గెలిచేలా వ్యూహరచనలు చేస్తోంది. వాస్తవానికి గత పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ మద్దతు దారుల్లో ఎక్కువ మంది సర్పంచ్‌లుగా గెలవలేక పోయారు. ఫలితంగా గ్రామ స్థాయిలో ఆ పార్టీ పునాదులు అంత బలంగా లేవు. ఈ దృష్ట్యా పల్లెల్లో పార్టీని విస్తరించేందుకు, పునాదులను పటిష్ఠపరుచుకునేందుకు పంచాయతీ ఎన్నికలను ఒక అవకాశంగా వాడుకోవాలని చూస్తోంది.

కాంగ్రెస్ వ్యూహాలు

అధికార కాంగ్రెస్ పార్టీ గెలుపు ధీమాతో కొద్ది నెలల నుంచే పావులు కదుపుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను గంప గుత్తగా తన ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నించినప్పటికీ కోర్టు తీర్పులతో ఆ వ్యూహం బెడిసికొట్టింది. అయినా కూడా జనరల్ స్థానాల్లో వీలయినంత ఎక్కువ మంది బీసీలకు పార్టీ పక్షాన మద్దతు ఇవ్వడం ద్వారా వారి గెలుపు కోసం కృషి చేయాలని యోచిస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కావడంతో వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో భాగంగా ఎన్నికల షెడ్యూల్ జారీ కావడానికి ముందే ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి చేసింది. దీంతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యుల మద్దతును కూడగట్టుకునేందుకు కూడా కోడ్ అమలుకు కొన్ని గంటల ముందే వడ్డీ లేని రుణాలను విడుదల చేసింది. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు, గృహజ్యోతి వంటి సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లడం ద్వారా గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునే పనిలో ఉంది.

బీఆర్ఎస్‌కు సవాల్

మరో వైపు బీఆర్ఎస్ పార్టీ కూడా తన వంతు ప్రయత్నాలను మొదలు పెట్టింది. గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరపరాజయం చవి చూసిన ఆ పార్టీ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా పునరుజ్జీవనం పొందే ఆలోచనలో ఉంది. ఈ మేరకు గత పదేళ్ల పాలనలో పంచాయతీల అభివృద్ధికి చేసిన కృషిని, గ్రామాల్లో కల్పించిన మౌలిక వసతులను గుర్తు చేయడం ద్వారా పల్లె ఓటర్లను ప్రసన్నం చేసుకునే దిశగా వ్యూహాలను రచిస్తోంది. పల్లెల్లో బీఆర్ఎస్‌కు ఇప్పటికీ గట్టి పునాదులే ఉన్నాయి. క్యాడర్ ఉంది. క్రియాశీల నాయకులు ఉన్నారు. వారందరిలో ఉత్సాహం నింపడం ద్వారా పంచాయతీ ఎన్నికల్లో గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీటీసీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు నడుం బిగిస్తున్నారు. పనిలో పనిగా కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు తమకు అనుకూలంగా మారుతుందని ఆ పార్టీ నాయకులు బలంగా నమ్ముతున్నారు.

ఎన్నికల వ్యయాలపై నిఘా

వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం ఓటింగ్ సమయంలో వెబ్ కాస్టింగ్‌తో పాటు వీడియోగ్రఫీ నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు వరంగల్ కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. బుధవారం రాత్రి సర్పంచ్ అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పరిమితుల విషయంలో వివరాలను ప్రకటించారు. 5 వేల జనాభా పైబడిన గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.2.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.50వేలు, 5 వేల జనాభా లోపున్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ.1.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.30 వేల వరకు మాత్రమే ఖర్చు చేయాలన్నారు. అన్ని మండల కేంద్రాల్లో క్లస్టర్లను ఏర్పాటు చేశామని, నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు తమ క్లస్టర్ పరిధిలో సూచించిన పంచాయతీల్లో నామినేషన్ పత్రాలను సమర్పించవచ్చని వెల్లడించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు, 2024 ఎస్‌సీపీసీ సర్వే ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు కేటాయించామని స్పష్టం చేశారు.

భర్త ఫంక్షన్‌కు తీసుకుపోలేదని..

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

సంగెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భర్త ఫంక్షన్‌ను తీసుకుపోలేదని భార్య క్షణికావేశంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలోని ఎల్గూరు రంగంపేటలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఎల్గూరు రంగంపేటకు చెందిన గుగులోత్ కవిత(28), తన భర్త సుకుమార్ ఫంక్షన్‌కు వెళ్లే విషయంలో గొడవ పడ్డారు. సుకుమార్ తన ఇద్దరు పిల్లలను తీసుకుని బొల్లికుంటలో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లాడు. మనస్తాపం చెందిన కవిత ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు భూక్యా రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కూతుళ్ల పెళ్లి చేయలేక..

రాయపర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కూతుళ్ల వివాహాలు చేయలేక, కుటుంబాన్ని పోషించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కొత్తూరులో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తూరు గ్రామానికి చెందిన భీమని యాదగిరి (52) కూలీ చేసుకుని జీవిస్తున్నాడు. మొదట వివాహం చేసుకోగా ఇద్దరు పిల్లలు కాగా, భార్య అనారోగ్యంతో చనిపోయింది. దీంతో రెండో వివాహం చేసుకున్నాడు. రెండో భార్యకు సైతం ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు.

మొత్తం ఐదుగురు కాగా, ఇద్దరి వివాహాలు చేశాడు. దీంతో మిగతా వారికి వివాహాలు చేయాలన్నా, కుటుంబాన్ని పోషించలేక మనోవేదనకు గురయ్యే వాడు. ఈ నెల 25న ఉదయం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా సాయంత్రం 5 గంటల సమయంలో ఊరి చివర చెట్టుకు యాదగిరి ఉరి వేసుకుని ఉండడం కంటపడింది. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో మృతుడి తల్లి భీమని రామలచ్చమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిజీ బిజీగా కేటీఆర్ పర్యటన

ఘన స్వాగతం పలికిన గులాబీ శ్రేణులు

హనుమకొండ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. దీక్షాదివాస్ సన్నాహక సమావేశానికి హైదరాబాద్ నుంచి ఉదయం హనుమకొండకు బయలుదేరిన కేటీఆర్‌కు కరుణాపురం వద్ద ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎదుట బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి కాజీపేట జంక్షన్‌లోని బాపూజీ నగర్ చౌరస్తాకు చేరుకోగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. మధ్యాహ్నం రంగశాయిపేటకు చేరుకోవడంతో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

కేటీఆర్ అక్కడి నుంచి గీసుగొండ మండలంలోని టెక్స్‌టైల్ పార్కు సందర్శన ముగించుకుని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. సుమారు 2000 మంది బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో దీక్షాదివాస్ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అక్కడి నుంచి మడికొండలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ నాయకుడి కూతురి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించి జనగామ దీక్షాదివాస్ సన్నాహక సమావేశానికి వెళ్లారు. కేటీఆర్‌కు స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత, బీఆర్ఎస్ నాయకులు జోరిక రమేష్, పోలెపల్లి రామ్మూర్తి, పులి రజనికాంత్, బుద్దె వెంకన్న, సోదా కిరణ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉన్నారు.

భలే రుచిగా ఉన్నాయి..

బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దీక్షాదివాస్ సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో కార్యాలయం ఎదురుగా ఉన్న తెలంగాణ పిండి వంటల షాప్‌ను సందర్శించారు. ఆయనకు మహిళలు తినుబండారాలు అందజేశారు. వాటిని రుచి చూసిన కేటీఆర్.. భలే రుచిగా ఉన్నాయని కితాబు ఇచ్చారు. అనంతరం కొన్ని పిండివంటలు ఇంటికి తీసుకెళ్లారు. షాప్ నిర్వాహకులు ఉమాదేవి, ఉష, అర్చనలు పిండి వంటల గురించి కేటీఆర్‌కు వివరించారు.

కేటీఆర్ కాన్వాయ్ ఢీకొని ఒకరికి గాయాలు



కాన్వాయ్ ఢీకొని కింద పడిన ద్విచక్ర వాహనదారుడిని పైకి లేపుతున్న స్థానికులు

హనుమకొండ టౌన్ : బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలో బుధవారం కేటీఆర్ ప్రయాణించిన కాన్వాయ్‌లోని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. సుబేదారి సీఐ మేకల రంజిత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పరకాలకు చెందిన శ్రీనివాస్ రెడ్డి రాపిడో ద్విచక్ర వాహనంపై చిల్డ్రన్స్ పార్కు జంక్షన్ వైపు వస్తుండగా మూల మలుపు వద్ద కేటీఆర్ కాన్వాయ్‌లోని వాహనం ఢీకొట్టింది. దీంతో అతడి తలకు గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే పోలీసులు వచ్చి శ్రీనివాస్ రెడ్డిని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారులో కేటీఆర్ లేరు. అయితే కేటీఆర్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిందని పలువురు స్థానికులు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో కలకలం రేగింది.

టెక్స్‌టైల్ పార్కుతో మహర్దశ

- స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గీసుగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)తో వరంగల్‌కు పూర్వవైభవం తీసుకురావడానికి నాటి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషిచేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. ఒకప్పుడు అజాంజాహి మిల్‌తో వరంగల్‌కు వస్త్రపరిశ్రమ గుర్తింపు ఉండేదని, అది కనుమరుగైన తరువాత కేఎంటీపీతో టెక్స్‌టైల్ హబ్‌గా మళ్లీ పూర్వవైభవం సంతరించుకోబోతుందని హర్షం వ్యక్తంచేశారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని చింతలపల్లి వద్ద టెక్స్‌టైల్ పార్కును బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కైటెక్స్ కంపెనీలో ఆధునాతన పద్ధతిలో జరుగుతున్న టెక్స్‌టైల్ ఉత్పత్తులను పరిశీలించారు. ఉత్పత్తుల వివరాలను కంపెనీ ఎం.డి. మనోజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు.

సూరత్, షోలాపూర్, బీవండి వంటి ప్రాంతాలకు నేతన్నల వలసలను అరికట్టేందుకు టెక్స్‌టైల్‌పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. ఆనాడు దేశంలో వస్త్ర పరిశ్రమలకు ఎలాంటి పాలసీలు లేవని, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో మన దేశం కంటే ఎక్కువగా వస్త్ర ఉత్పత్తులు జరుగుతుండడంతో దేశంలో అతిపెద్ద కాకతీయ టెక్స్‌టైల్ పార్కుకు రూపకల్పన చేసినట్లు వివరించారు. సూరత్, తిరుపూర్‌లా ఫామ్ టు ఫ్యాషన్ తరహాలో కైటెక్స్, యంగ్‌వన్ వస్త్ర పరిశ్రమలు చురుకుగా ఏర్పాటు అవుతున్నాయన్నారు. స్థానిక పత్తి రైతులకు, కూలీలకు ఉపాధి లభించే విధంగా పరిశ్రమలు ఏర్పాటు జరగాలని భావించినట్లు చెప్పారు. గణేషా, కైటెక్స్, యంగ్‌వన్ కంపెనీలు ఉత్పత్తులను ప్రారంభించడంతో దాదాపు 30వేల మందికి ప్రత్యక్షంగా అంతకు డబుల్ పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదన్నారు. పార్కు ఏర్పాటైన నాలుగు సంవత్సరాల తరువాత కేంద్రం పీఎంశ్రీ కింద చేర్చిందని గుర్తు చేశారు. అయితే పార్కులో ఇంకా పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చింతలపల్లి వద్ద పార్కులోకి రావటానికి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిని కూడా నాడు తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆర్వోబీ బ్రిడ్జిని, పార్కులు డ్రైనేజీ, సీవరేజ్ సిస్టంలను పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు.



టెక్స్‌టైల్ పార్క్ సందర్శనలో కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండ..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం సేకరించిన 9300 ఎకరాల భూమి అమ్మకాలతో, ఫ్యూచర్ సిటీ పేరుతో రూ.5 లక్షల కోట్లు దండుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండగా మారారని కేటీఆర్ ఈ సందర్భంగా తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో కూలీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 21 పారిశ్రామిక వాడల్లో 9300 ఎకరాలను సేకరించి పరిశ్రమల ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషిచేసిందన్నారు. అయితే ఆభూమిని తక్కువ ధరకు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రేవంత్‌రెడ్డి కట్టబెడుతున్నారని ప్రజా ధనాన్ని కొల్లగొడుతున్నారన్నారు. స్థానిక మునిసిపాలిటీల తీర్మానం లేకుండా, అఖిల పక్షంతో మాట్లాడకుండా, శాసన సభలో చర్చించకుండా ప్రజాప్రయోజనాలకు సేకరించిన భూములను ఇష్టానుసారంగా ప్రభుత్వం ఎందుకు అమ్ముతుందని నిలదీశారు. సీఎం, అతని అన్నదమ్ములు, అనుచరులు భూములను అమ్మడం ద్వారా, ఫ్యూచర్ సిటీ పేరుతో రూ.5 లక్షల కోట్లు కొల్లగొట్టి రాహుల్‌గాంధీకి ఏటీఎం, పేటీఎంగా మార్చుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, శంకర్‌నాయక్, గండ్ర వెంకటరమణారెడ్డి, తాటికొండ రాజయ్య, జడ్పీ మాజీ చైర్మన్ గండ్ర జ్యోతి, రాకేశ్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్ మనోహర్, మాజీ జెడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి నాయకులు జయపాల్‌రెడ్డి, చల్ల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్ →





అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కేటీఆర్ బీఆర్ఎస్ నాయకులు ←



సమయం లేదు..

- ఎన్నికల బరిలోకి ఆశావహులు
- పార్టీల పేరు చెప్పుకోవడానికి ఆసక్తి చూపని అభ్యర్థులు
- స్వతంత్ర అభ్యర్థినే ప్రజలు ఆదరిస్తారని బరిలోకి..
- గ్రామానికి పదుల సంఖ్యలో పోటీకి సిద్ధమవుతున్న నాయకులు

ఎల్కతుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సర్పంచ్‌ల ఎన్నికల సందడి ప్రారంభమయ్యింది. రిజర్వేషన్ అనుకూలించిన వ్యక్తులు రంగంలోకి దిగారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో గ్రామాల్లో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మొదటి విడతలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కమలాపూర్ మండలాల్లో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ నెల 27 నుంచి నామినేషన్ల స్వీకరణ, అదే రోజు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వార్డుల వారీగా పంచాయతీ ఓటర్ల జాబితా ప్రదర్శన, 29న నామినేషన్ల చివరి తేదీ, 30న నామినేషన్ల పరిశీలన, అదేరోజు చెల్లుబాటైన అభ్యర్థుల జాబితా ప్రదర్శన, డిసెంబరు 1న అభ్యంతరాలపై అప్పీల్‌కు చివరి తేదీ, 2న అప్పీల్ పరిష్కరణకు చివరి తేదీ, 3న నామినేషన్ల ఉపసంహరణ, 3న పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా ప్రదర్శన, 11న ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నికల నిర్వహణకు కేవలం 15 రోజుల సమయం ఉండటంతో పోటీదారులు అయోమయానికి గురవుతున్నారు. ఎన్నికల బరిలో దిగడానికి ఎక్కువ సమయం లేకపోవడంతో బరిలో ఉండే ఆశావహులు ఓటర్లను వేగంగా ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ఎవరి అంచనాల్లో వారు..

రాజకీయ పార్టీ పరంగా ఎన్నికల బరిలో నిలిస్తే పడే ఓట్లను ఆయా పార్టీ పేరుతో ముందుకెళ్లే అభ్యర్థులు అంచనాలు వేసుకుంటున్నారు. తమ పార్టీకే గ్రామాల్లో ఉనికి ఉందని ఎవరికి వారే ఊహించుకుంటున్నారు. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరక్కపోవడంతో పార్టీ పేరు చెప్పుకొని పోటీలో ఉంటే ఆదరణ ఉండదని మరికొందరు భావిస్తున్నారు. వ్యక్తిగత పలుకుబడితో స్వతంత్ర అభ్యర్థిగా ప్రజల ముందుకు వెళితే ఆదరిస్తారనే భావనలో కొందరున్నారు. ప్రతీ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థులుగా 10 మందికి పైగానే బరిలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ఓటర్లు డబ్బు వైపా ? వ్యక్తిత్వం వైపా?

గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసే సర్పంచ్‌లను ఎన్నుకోవడంలో ఓటర్లు డబ్బు వైపు మొగ్గు చూపుతారా? లేదా అభ్యర్థి వ్యక్తిత్వాన్ని బట్టి ఓటు వేసి ఎన్నుకుంటారా? అనే ప్రశ్నలు సర్పంచ్ ఆశావహుల్లో అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. సర్పంచ్ బరిలో నిలిచే అభ్యర్థులు కేవలం ఆ పార్టీ పేరు చెప్పుకోవడమే తప్ప పార్టీ ఎలాంటి బీ-ఫారంలు అందించక పోవడంతో ఒకే పార్టీ నుంచి ఎక్కువ సంఖ్యలో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తూ ఆ పార్టీ అభ్యర్థి ఓట్ల కోసం ఓటర్ల వద్దకు వెళ్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గతంలో చేసిన అభివృద్ధి పనులను వెల్లడిస్తూ ఓట్లను అభ్యర్థించే పనిలో పడ్డారు. కానీ, ఓటర్లు డబ్బులు ఎక్కువగా ఇచ్చిన వ్యక్తులకు ఓట్లు వేస్తారా? గ్రామ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజలతో మమేకమయ్యే అభ్యర్థులకు పట్టం కడుతారా? అనే సందిగ్ధం నెలకొంది. డబ్బు పంచనిదే ఓట్లు పడవని నిర్ధారణకు వచ్చిన వ్యక్తులు ఎన్ని ఓట్లకు ఎంత డబ్బులు పంచాలో లెక్కలు వేసుకుంటున్నారు. ఏదేమైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బుకు ప్రాధాన్యత ఇవ్వాలా.. లేక వ్యక్తిత్వాన్ని చూసి ఓట్లు వేయాలా.. అనే ప్రశ్నలు ఓటర్లను సైతం వెంటాడుతోంది.

ఎల్కతుర్తిలో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఎల్కతుర్తి మండల పరిధిలో 20 గ్రామ పంచాయతీలకు, 103 వార్డులకు, భీమదేవరపల్లి మండల పరిధిలో 25 గ్రామ పంచాయతీలకు, 132 వార్డులకు, కమలాపూర్ మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీలకు, 137 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే అధికారులు ఓటరు జాబితాలను సిద్ధం చేసి గ్రామాల్లో ప్రదర్శించడం జరిగింది. ఎన్నికల నిర్వహణ సామగ్రి సైతం సిద్ధంగా ఉండడంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

లిక్కర్ షాపులకు

ఎన్నికల కిక్కు

(5వ పేజీ తరువాయి)

చేయనున్నారు. నామినేషన్‌ల ఘట్టం 29వ తేదీతో ముగుస్తుంది.

డిసెంబరు 1 నుంచే అసలైన ఎన్నికల సంగ్రామం మొదలు కానుంది. ఇదే తేదీ నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. ఒక్కొక్క గ్రామంలో 15రోజుల వరకు ఎన్నికల తంతు జరుగుతుంది. అన్ని ప్రధాన పార్టీలు తమ మద్దతుదారులను బరిలో దించేందుకు సిద్దమవుతున్నాయి. లోకల్‌బాడీ ఎన్నికల్లో మద్యం కీలకమనే బహిరంగ రహస్యమే. పోటీదారులు భారీ ఎత్తున మద్యాన్ని కొనుగోలు చేసి డంప్ చేయటం, ఆ తరువాత పోలింగ్ ముందు పంపిణీ చేయటం జరిగే తంతే. అన్ని ప్రధాన పార్టీలు కూడా ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవటంతో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ తీవ్రంగా ఉండటంతో పాటు లిక్కర్‌కు కూడా భారీగా డిమాండ్ పెరుగనుంది. దీంతో కొత్తగా మద్యం షాపులను దక్కించుకున్నవారికి పంచాయతీ ఎన్నికలతో భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉందనే టాక్ వినబడుతుంది.

- కలిసి వస్తున్న అదృష్టం..

కొత్త మద్యం షాపు యాజమానులకు స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మేడారం మహాజాతరకు కూడా కలిసి రానుంది. డిసెంబరు 17వ తేదీతో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది. ఈ ఎన్నికల తరువాత జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మేడారం మహాజాతర ఉంది. దీంతో పల్లెల్లో నెల రోజుల ముందు నుంచి ఊళ్లలో బద్దిపోశమ్మ, మైసమ్మ, ఎల్లమ్మలకు వేడుకలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. వీటితో పాటు ఇంటి వద్ద సమ్మక్క, సారలమ్మల పండుగ జరుపుకుంటారు. దీంతో మద్యం అమ్మకాలకు భారీగా డిమాండ్ పెరుగనుంది. మేడారం మహాజాతరతో పాటు జాతరకు ముందు మొక్కులు కూడా మద్యం వ్యాపారానికి కలిసి రానుంది.

అలాగే ఇప్పటికే వాయిదా పడిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కూడా జనవరి లేదంటే ఫిబ్రవరి, మార్చిలో నిర్వహించే అవకాశం ఉంది. ఇప్పటికే మునిసిపాలిటీల పదవీకాలం కూడా పూర్తయింది. గ్రేటర్ వరంగల్ పాలకవర్గం కూడా జూన్ నెలతో ముగుస్తుంది. దీంతో వరుసగా పరిషత్తు, మునిసిపాలిటీ ఎన్నికలు రానుండటం మద్యం షాపు యాజమానుల పంట పండినట్లేననే చర్చ జరుగుతోంది. ఈ ఏడాదంతా ఏదో రకంగా మద్యానికి గిరాకీ వస్తుండటంతో మద్యం షాపులు దక్కని వ్యాపారులు భారీగా గుడ్‌విల్ ఆఫర్ చేసి చాల చోట్ల షాపులను కొనుగోలు చేశారని తెలిసింది. ఆయా ఏరియాలను బట్టి మద్యం షాపులకు రూ.60లక్షల నుంచి రూ.1.35కోట్ల వరకు గుడ్‌విల్ ఇచ్చి వ్యాపారులు కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'

వరంగల్ మెడికల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ డిమాండ్ చేశారు. బుధవారం కేఎంసీ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యాదానాయక్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో గత ఐదు సంవత్సరాలుగా పని చేస్తున్న నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసీ ఆఫీసర్లు, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు, పీఆర్‌వోలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, స్టోర్ కీపర్లు, రికార్డ్ అసిస్టెంట్స్ ఇతర సిబ్బందికి 5 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే డిసెంబరు 10వ తేదీ నుంచి విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తామని అధికారులకు సమ్మె నోటీసు అందించారు. ఈ కార్యక్రమంలో జె.సుధాకర్, శోభ, అమన్, సంధ్య, దేవేందర్, స్రవంతి, సుదామయి, భద్ర, సుమలత, స్వర్ణలత, ప్రశాంతి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

భారత రాజ్యాంగమే ప్రపంచంలోని దేశాలకు దిక్సూచి

బహుజన న్యాయవాదుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ శివ

వడ్డేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగమే ప్రపంచ దేశాలకు దిక్సూచి అని బహుజన న్యాయవాదుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ గంధం శివ అన్నారు. బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహుజన న్యాయవాదుల ఫోరం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివతో పాటు హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది బైరపాక జయాకర్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలో హక్కులు లేని జాతులకు హక్కులు పొందడం రాజ్యాంగం ద్వారా మాత్రమే సాధ్యమైందని అన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పునాదిగా రాజ్యాంగం ఏర్పడడంలో పౌరులుగా దేశ ప్రజలంతా గర్వపడాల్సిందిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సాయిని నరేందర్, దయాన్ శ్రీనివాస్, పరమండ్ల కృష్ణస్వామి, వలీ ఉల్లా ఖాద్రి, కూనూరు రంజిత్ గౌడ్, రాజయ్య, నాగేశ్వర్‌రావు, మధూకర్, భద్రి, జన్ను పద్మ, జ్యోతి, అరుణ, కవిత, రాజేందర్, శివప్రసాద్, ప్రభంజన్, సురేందర్, విష్ణువర్ధన్, ప్రభాకర్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి జైభీం కార్యాలయంలో..

హనుమకొండ వడ్డేపల్లి చర్చి జంక్షన్‌లోని జైభీం కార్యాలయంలో జైభీం రాష్ట్ర కన్వీనర్ తాళ్లపెల్లి విజయ్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ అంబేద్కర్ అహర్నిశలు కృషి చేసి ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని దేశంలోని ప్రతీ ఒక్కరికి సమాన హక్కులు కల్పించారని అన్నారు. కార్యక్రమంలో జైభీం జిల్లా ప్రతినిధులు ఇల్లందుల భాస్కర్, తాళ్లపెల్లి ప్రసన్న, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి నల్ల రమేష్, జిల్లా మహిళా నాయకురాలు శనిగరపు అనిత, ప్రశాంత్, రాజు, దుప్పటి కోటి, ప్రదీప్, ప్రభు, రాసమల్ల రూపస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ కార్యాలయంలో..

హనుమకొండలోని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కార్యాలయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. భారత రాజ్యాంగ పీఠికను చదివి రాజ్యాంగ విలువలను కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర జాయింట్ సెక్రటరి డాక్టర్ కూరపాటి రమేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ చందా మల్లయ్య, డీఎస్‌పీ నేతలు మేకల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో..

బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీఎస్‌పీ వరంగల్ జోనల్ ఇన్‌చార్జి పైనాల కార్తీక్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు బస్కె నాగరాజు, జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్, నాయకులు మరుపట్ల నవీన్, బొట్ల భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

వరంగల్ ఎడ్యుకేషన్ : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ముందుగా డాక్టర్ బీఆర్. అంబేద్కర్ చిత్రపటానికి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్. రాజ్‌కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

'భారత రాజ్యాంగం స్ఫూర్తిదాయకం'

హనుమకొండ కలెక్టరేట్ : ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన దేశ రాజ్యాంగం స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతామని అధికారులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో..

హసన్‌పర్తి : గ్రేటర్ 65వ డివిజన్ పరిధి ఎల్లాపూర్‌లో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో 76వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి అంబేద్కర్ రచించిన రాజ్యాంగం గురించి వివరించారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోతె లింగారెడ్డి, నాయకులు నేదునూరి సాంబయ్య, రేణికుంట్ల తిరుపతి, రాజయ్య, వెంకటేశ్వర్లు, రమణాచారి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీజీ ఎన్పీడీసీఎల్‌లో..

రాంనగర్ : ప్రతీ పౌరుడికి భారత రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సీఎండీ వరుణ్‌రెడ్డి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ రాజ్యాంగం స్ఫూర్తిని నిలబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి. మోహన్‌రావు, వి. తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బోనాల కిషన్, సీఈలు టి. సదర్‌లాల్, కె. తిరుమల్‌రావు, కె. రాజు చౌహాన్, కె. వెంకటరమణ, అశోక్, అన్నపూర్ణ, సురేందర్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో..

వరంగల్ క్రైం : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ రవి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, అధికారులు, సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశ రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీలు సురేశ్‌కుమార్, శ్రీనువాస్, ట్రాఫిక్ అదనపు డీసీపీలు రాయల ప్రభాకర్‌రావు, క్రైం అదనపు డీసీపీ బాలస్వామి, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, జాన్ నర్సింహులు, డేవిడ్ రాజు, నాగయ్య, గిరికుమార్, సురేంద్ర, ఏవో సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ నాయకుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సుబేదారి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్ ఇండియా కమిటీల నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి, ఏఐకేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హంసారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్యలు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి 29 పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల దేశంలోని రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతు, ప్రజా, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రాగుల రమేశ్, నున్న అప్పారావు, ఎ.ధర్మరాజు, ఎంఎస్.రావు, జి.రాములు, టి.ఉప్పలయ్య, పుల్ల అశోక్, బొల్లారం సంపత్, బొట్ల భిక్షపతి, వేలు రజిత, గడ్డం నాగార్జున, రాఘవులు, డి.భానునాయక్, కె.లింగయ్య, మంద మల్లేశం, ఎన్.రజిత, ఎ.యాకయ్య, కారు ఉపేందర్, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడాలి'

రాంనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో 42 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టేందుకు తెలంగాణలో అన్ని పార్టీల ఎంపీలు పోరాటం చేయాలని, 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని బీసీ, ఎస్సీ ఎస్టీ జాక్ ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ చందా మల్లయ్య డిమాండ్ చేశారు. జాక్ నాయకులతో పాటు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ డిప్యూటీ తహసీల్దార్ రంజిత్ కుమార్ వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్, బీసీ జాక్- కన్వీనర్ తిరుణహరి శేషు, ఇంటలెక్చువల్ ఫోరం ఉమ్మడి జిల్లా కో- ఆర్డినేటర్ డాక్టర్ వీరస్వామి, మండల పరశురాములు, గైని రవిందర్, మేకల సుమన్, బుర్ర దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత ఉపాధి శిక్షణ

మడికొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం)లో కంప్యూటర్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ కోర్సులలో 2 నెలల ఉచిత శిక్షణకు దరఖాస్తులు కోరబడుతున్నట్లు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.జయశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు టెన్త్ మెమో, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈనెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7660022526/7660022525 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీసీ రోడ్డు నిర్మాణం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జీడబ్ల్యూఎంసీ పరిధి లోని 22, 27వ డివిజన్‌లలోని పోచమ్మమైదాన్, దేశాయిపేట, రామ్‌నాధ్‌పూరి కాలనీ, వాసవికాలనీ, అబ్బనికుంటతో పాటు పలు కాలనీల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సీసీ రోడ్లు నాణ్యతతో నిర్మిస్తేనే బిల్లుల చెల్లింపులు జరపాలని లేదంటే రద్దు చేస్తామన్నారు. అనంతరం డీమార్ట్ ప్రాంతంలోని యూజీడీ క్లీనింగ్‌ను కమిషనర్‌తో పాటు అధికారులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వా మి, ఎస్ఈ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ సతీష్, ఏఈలు మురళీ కృష్ణ, హబీబ్, టీపీబీవో నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు విక్రం, నవీన్ పాల్గొన్నారు.

ఇనుగాలకు సన్మానం

హనుమకొండ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన ఇనుగాల వెంకట్రాంరెడ్డిని కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం హనుమకొండలోని ఇనుగాల నివాసంలో ఆయనను కలిశారు. సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్ ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. పూలమాలలు వేసి, శాలువాలతో ఇనుగాల వెంకట్రాంరెడ్డిని సన్మానించారు. పశ్చిమ అధ్యక్షుడు తాళ్లపల్లి రాజు, ఉపాధ్యక్షుడు గోవిందు మహబానుతో పాటు నిట్టి బాలరాజు, జిల్లెల కృష్ణమూర్తి, సముద్రాల సోమయ్య, ప్రధాన కార్యదర్శి తాటికొండ ప్రసాద్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్ రాజు, పరకాల మండల అధ్యక్షుడు దుమల కిషోర్, నడుకుడ మండల అధ్యక్షుడు మేకల కుమారస్వామి, పరకాల బ్లాక్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు పి. రామస్వామి పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి అభినందనల వెల్లువ

వడ్డేపల్లి : జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డిని బుధవారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ శ్రేణులు మర్యాద పూర్వంగా కలిశారు. డీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ సంగాల ఈర్మియ, పీఏసీఎస్ దామెర మాజీ చైర్మన్ పొలుసాని కేశవరెడ్డి, భీమారం మాజీ సర్పంచ్ బూర సారంగపాణి, డీఆర్‌డీఏ మాజీ డైరెక్టర్ గాజుల గోవర్ధన్ తదితరులు వెంకట్రాంరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని పటిష్టపర్చాలని కోరారు.

రెజ్లింగ్‌లో హాస్టల్ విద్యార్థుల సత్తా

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ (జేఎన్ఎస్)లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌కు చెందిన పలువురు రెజ్లర్లు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తాచాటి 3 స్వర్ణ, మూడు రజత, ఒక కాంస్య పతకాలను కొల్లగొట్టారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) అండర్-17 ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌కు చెందిన ఎస్. మనోహర్ 48 కేజీల విభాగంలో స్వర్ణం, 55కేజీల విభాగంలో ఆర్. శ్రీకాంత్ స్వర్ణం, 63 కేజీల విభాగంలో కే. అఖిల్ స్వర్ణం, 65 కేజీల విభాగంలో టి. వెంకటేష్ రజతం, 55 కేజీల విభాగంలో ఆర్. దత్తు రజతం, 57 కేజీల విభాగంలో ఎ. రాహుల్ రజతం, 63 కేజీల విభాగంలో వరుణ్ కాంస్య పతకాలను సాధించారు.

జరిమానా

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పార్కింగ్ నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై పార్కింగ్ చేయడంతో వరంగల్ రిలయన్స్ స్మార్ట్ స్టోర్ నిర్వాహకులకు బుధవారం జరిమానా విధించారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న రిలయన్స్ స్మార్ట్ స్టోర్ ఎదుట నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు పార్కింగ్ చేసినట్టు ఫిర్యాదులు అందాయి. తనిఖీలో సెల్లార్‌ను స్టోర్‌గా ఉపయోగిస్తూ కనిపించింది. దీంతో నిర్వాహకులకు రూ. 50 వేల జరిమానా విధించినట్టు తెలిపారు. టీపీబీవో నవీన్‌తో పాటు డీఆర్ఎఫ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



రిలయన్స్ నిర్వాహకులకు జరిమానా విధిస్తున్న అధికారులు

'జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలి'

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వరంగల్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... విద్యారంగాన్ని కార్పొరేటైజేషన్ చేసేందుకు ఉద్దేశించిన నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించడం ద్వారానే విద్యా రంగాన్ని కాపాడుకుంటామన్నారు. అనంతరం విద్యా పరిరక్షణ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం. రవీందర్, అధ్యక్షుడిగా ఎ. గోవిందరావు, అసోసియేట్ అధ్యక్షులుగా కె. భోగేశ్వర్, ఎస్. కుమారస్వామి, ఎండి. మహబూబ్ అలీ, వి.సదానందం, పి.సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా యు. అశోక్, అసోసియేట్ ప్రధానకార్యదర్శులుగా కె. దేవదాసు, ఎం. మహేష్, సోమేశ్వర్‌రావు, స్వామి, సదానందం, చంద్రౌళి తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, యాకయ్య, గోవిందరావు, ఉప్పలయ్య, శ్రీనివాసులు, సూరయ్య, ఆనందాచారి పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



స్వామి కల్యాణం జరిపిస్తున్న పూజారులు

హనుమకొండ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో బుధవారం రుద్రేశ్వరుడి తనయుడైన సుబ్రమణ్యస్వామికి అంగరంగ వైభవంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సుబ్రమణ్య షష్టి సందర్భంగా ఆయనకు శ్రీ వల్లీ, దేవసేనలతో కల్యాణోత్సవ తంతును నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆలయ నాట్య మండపంలో గణపతి ఆరాధన, మండపారాధాన నిర్వహించి ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి నవగ్రహ ఆరాధన, దీపారాధన అనంతరం ప్రముఖ వైష్ణవ యాజ్ఞికులు శ్రీమన్నారాయణచార్య యాజ్ఞికంలో కల్యాణ క్రతువు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వైదిక కార్యక్రమాలను ఉపేంద్రశర్మ, సందీప్‌శర్మ, ప్రణవ్‌లు నిర్వహించారు.

మడికొండలో..

మడికొండ : మడికొండలోని వేణుగోపాలస్వామి ఆలయంలో పల్లపు రాజేందర్-స్వరూప దంపతుల ఆధ్వర్యంలో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. పూజారి శ్రీకాంత్ మంత్రోచ్చరణలతో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలదారులు కుర్ల మోహన్, ముంజ రమేష్, జనగాం రమష్, దండిగం సమ్మయ్య, పల్లపు అర్జున్, మాస్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వరంగల్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరెపల్లిలో ఓ ఉడ్ ఫర్నిచర్ షాపులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని వారి నుంచి రూ. 10,040, ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు కోసం నిందితులతో పాటు నగదు, సెల్‌ఫోన్‌లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్థానిక పోలీసులకు అప్పగించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

వరంగల్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులతో పాటు ఉన్న ఊరుకు కీర్తి ప్రఖ్యాతలు తీసుకరావాలని ఎస్సై పరశురాములు అన్నారు. నయీంనగర్‌లోని మోషన్ కళాశాలలో బుధవారం డ్రగ్స్, సైబర్ నేరాలు, విద్యార్థులు నడవడికపై హనుమకొండ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు బ్యాంకు లావాదేవీలపై కన్నేసి సైబర్ నేరానికి పాల్పడుతున్నారని అలాంటి మోసాలు జరిగితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల సురేశ్, సిబ్బంది సుమన్, రాజు, రమేశ్ గౌడ్, ఏఎస్సై రఘునాథ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేయూ రాష్ట్ర కోశాధికారిగా హుస్సేన్ నాయక్



వడ్డేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్(టీడబ్ల్యూజేయూ) రాష్ట్ర సర్వసభ్య సమావేశం బుధవారం హైదరాబాద్‌లోని గిరిజన విద్యుత్ భవన్‌లో జరిగింది. టీడబ్ల్యూజేయూ రాష్ట్ర కోశాధికారిగా హనుమకొండ పట్టణానికి చెందిన జర్నలిస్టు గుగులోత్ హుస్సేన్ నాయక్ ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు బాదావత్ బాలాజీ నాయక్ తెలిపారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి చందన

బాలసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి, ప్రతీ పౌరుడు దేశం పట్ల భక్తితో వ్యవహరిస్తూ, రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉండాలని రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి చందన అన్నారు. జాతీయ న్యాయ దినోత్సవం, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కాజీపేట ప్రశాంత్‌నగర్‌లో గల విజన్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాజ్యాంగంలోని హక్కులను, ప్రాముఖ్యతను ఆమె విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో భారత రాజ్యాంగ ఉపోద్ఘాతాన్ని చదివించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కమ్ ప్రిన్సిపాల్ ఎన్.నవనీతరావు, అడ్వకేట్ విజేందర్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ కార్డులను విడుదల చేయాలి

రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కాసర్ల జనార్దన్‌రెడ్డి

బాలసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల నగదు రహిత హెల్త్ కార్డులను వెంటనే విడుదల చేయాలని రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కాసర్ల జనార్దన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ హనుమకొండ జిల్లా శాఖ నూతన మీటింగ్ హాల్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం భారత రాజ్యాగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగ పీఠికను సామూహికంగా అందరు నిలబడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి పెన్షనర్ల అసోసియేషన్ హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.వీరస్వామి, రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రెటరీ వి.రాంమనోహర్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ పెన్షనర్ల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా పెన్షనర్ల సమస్యలను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.పురుషోత్తం, కె.సుధీర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఐక్య సంఘర్షణ సమితి జిల్లా కార్యదర్శిగా సుధాకర్



బాలసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ ఐక్య సంఘర్షణ సమితి హనుమకొండ జిల్లా కమిటీ కార్యదర్శిగా కాజీపేటకు చెందిన సుంచు సుధాకర్ నియామకమయ్యారు. ఈ మేరకు సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిలి బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. సమితి ఆశయాలకు, నియామకాలకు అనుగుణంగా బహుజనుల రాజ్యాధికార సాధనకు కృషి చేస్తానని అంగీకరించిన మేరకు ఆయనను జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు రాజమొగిలి తెలిపారు.

పల్లె రెడీ

(5వ పేజీ తరువాయి)

వివరాలను టీ-పోల్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

మూడు మండలాల్లో..

మొదటి విడత బీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో ఎన్నికలు జరుగుతాయి. వీటి పరిధిలో 69 పంచాయతీలు, 658 వార్డులు ఉన్నాయి. భీమదేవరపల్లి మండలంలో 24 జీపీలు, 232 వార్డులు, ఎల్కతుర్తి మండలంలో 20 జీపీలు, 180 వార్డులు, కమలాపూర్ మండలంలో 24 జీపీలు, 246 వార్డులు ఉన్నాయి. ఈ మూడు మండలాల్లో పోలింగ్ కోసం మొత్తం 658 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. గురవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగానే ఆయా గ్రామ పంచాయతీల పరిధుల్లోని తాజా ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తారు.

ఎన్నికలు జరిగే పంచాయతీలు ఇవే..

భీమదేవరపల్లి మండలం: భీమదేవరపల్లి, బొల్లోనిపల్లి, చంటయ్యపల్లి, ధర్మారం, ఎర్రబెల్లి, గాంధీనగర్, గట్లనర్సింగాపూర్, గొల్లపల్లి, కొప్పూరు, కొత్తకొండ, కొత్తపల్లి, మల్లారం, మాణిక్యాపూర్, ముల్కనూరు, ముస్తాఫపూర్, ముత్తారం, రాంనగర్, రంగయ్యపల్లి, రసూల్‌పల్లి, రత్నగిరి, సాయినగర్, వంగర, వీరభద్రనగర్, వీర్లగడ్డ తండా, విశ్వనాథకాలనీ.


ఎల్కతుర్తి మండలం : ఆరెపల్లి, బావుపేట, చింతలపల్లి, దామెర, దండెపల్లి, ఎల్కతుర్తి, గోపాల్‌పూర్, గుంటూరుపల్లి, ఇందిరానగర్, జగన్నాథపూర్, జీలుగుల, కేశవాపూర్, కోతులనడుమ, పెంచికల్‌పేట, రామక్రిష్టాపూర్, శాంతినగర్, సూరారం, తిమ్మాపూర్, వల్బాపూర్, వీరనారాయణపూర్.

కమలాపూర్ మండలం: అంబాల, భీంపల్లి, దేశరాజుపల్లి, గోపాల్‌పూర్, గూడురు, గునిపర్తి, కమలాపూర్, కానిపర్తి, కన్నూరు, కొత్తపల్లి, లక్ష్మీపూర్, మదన్నపేట, మర్రిపెల్లి, మర్రిపెల్లి గూడెం, నేరెళ్ల, పంగిడిపల్లి, శంభునిపల్లి, ఉప్పల్,ఉప్పలపల్లి, వంగపల్లి, వెంకటేశ్వరపల్లి.

పిల్లల్లో చెవి నొప్పి తగ్గేదెలా..?

ఒక్కోసారి పిల్లలు చెవిలో నొప్పంటూ ఏడుస్తూ ఉంటారు. వైద్యుని దగ్గరకు వెళ్లేలోపు చిన్న చిట్కాలతో చెవి నొప్పి నుంచి పిల్లలకు ఉపశమనం కలిగించవచ్చు.

- చెవి చుట్టూరా హీట్ ప్యాడ్‌తో అద్దడం వల్ల పిల్లలకు చెవి నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. హీట్ ప్యాడ్ అందుబాటులో లేని పక్షంలో చేతి రుమాలును వేడి చేసి ఉపయోగించవచ్చు.
- ముక్కులో లేదా గొంతులో శ్లేష్మం చేరి చిక్కబడడం వల్ల కూడా చెవి నొప్పి రావచ్చు. పిల్లలకు గోరువెచ్చని



నీరు తాగిస్తూ ఉంటే ఫలితం కనిపిస్తుంది.
- వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది నొప్పిని హరించడంలో బాగా పనిచేస్తుంది. రెండు వెల్లుల్లి రెబ్బలను కచ్చాపచ్చాగా దంచి పిల్లలచేత కొద్దికొద్దిగా తినిపిస్తే చెవి నొప్పి తగ్గుతుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు, పావు చెంచా మిరియాల పొడి కలిపి పిల్లల చేత తాగిస్తే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
- ఒక చెంచా అల్లం రసంలో అరచెంచా తేనె కలిపి పిల్లల చేత నాకిస్తే చెవినొప్పి తగ్గుతుంది. వేడి వేడిగా సూప్‌లు తాగించినా ఫలితం ఉంటుంది.
- ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండే చేపలు, అవిసెలు, ఇతర గింజలను పిల్లలు తినే ఆహారంలో చేర్చడం వల్ల వారికి చెవి నొప్పి రాదు
- స్ట్రాబెర్రీ, కివి, నారింజ, జామ, బత్తాయి, అనాస పండ్లతోపాటు ఆకుకూరలను పిల్లలకు తినిపిస్తుంటే చెవి నొప్పి సమస్య దరి చేరదు.
- రాత్రిపూట పిల్లలు చెవినొప్పితో బాధపడుతుంటే.. ఆలివ్ ఆయిల్‌ను కొద్దిగా వేడిచేసి దానితో చెవి చుట్టూరా మర్దన చేయాలి. ఆలివ్ ఆయిల్‌లోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు కొద్దిపాటి ఉపశమనాన్ని కలిగిస్తాయి.

మన చుట్టూ ఉన్న సమాజంలో అనేక రకాల అసమానతలు కనిపిస్తూ ఉంటాయి. వాటిలో కొన్నింటినైనా తొలగించాలనే ఆశయంతో ముందుకు వెళ్తున్నారు గుంతకల్లుకు చెందిన కొందరు మహిళలు. రోజుకు రెండు రూపాయలు ఆదా చేస్తే- బాలికలకు ఉన్నత విద్యను అందించవచ్చనే లక్ష్యంతో 'అభయ విద్యా నిధి సొసైటీ' అనే ఒక సంస్థను స్థాపించారు. ఆ సొసైటీ ఇప్పుడు అనేక మంది పేద బాలికలకు ఆసరాగా నిలుస్తోంది.



చేయీ చేయీ కలిపి

గుంతకల్లుకు చెందిన సత్రసాల వసుంధర ఒక సాధారణ మహిళ. కానీ ఆమెకు సమాజానికి ఏదైనా చేయాలనే కోరిక బలంగా ఉండేది. విద్య వల్ల మహిళలకు సాధికారత వస్తుందని ఆమె నమ్మేవారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్నత విద్యను అభ్యసించలేని అనేక మంది బాలికలను ఆమె ప్రత్యక్షంగా చూశారు. వారికి ఏదైనా సాయం చేయాలనుకున్నారు. ఆ ఆలోచనల నుంచి పుట్టిందే 'అభయ విద్యా నిధి సొసైటీ'. తన వద్ద ఉన్న 20 వేల రూపాయలను విరాళంగా ఇచ్చి ఈ సొసైటీని ప్రారంభించారు. ఆమెలా సమాజానికి ఏదైనా చేయాలనే ఆసక్తి ఉన్నవారెందరో ఆమెకు సహకరించారు. చిన్న చిన్న బిందువులు కలిస్తేనే ఒక సముద్రమవుతుంది. మధ్యతరగతి ప్రజలు ఇతరులకు సాయం చేయలేరు కాబట్టి వసుంధర ఒక వినూత్నమైన ఆలోచనకు తెరలేపారు. దీనిలో భాగంగా- సొసైటీలో చేరిన సభ్యులందరి ఇళ్లలోను.. వారి పరిచయస్థుల ఇళ్లు, షాపుల్లోను హుండీ డబ్బాలు పెట్టారు. ఈ హుండి పెట్టుకున్న వారు క్రమం తప్పకుండా రోజుకు రెండు రూపాయలు దానిలో వేయాలి. ఇలా జమైన సొమ్ము ఏప్రిల్ నెలలో సొసైటీకి ఇస్తారు. ఈ ఆలోచన చాలా మందికి నచ్చింది. దీనిలో అనేక మంది హుండీల ద్వారా విరాళాలు ఇవ్వటం మొదలుపెట్టారు. మరి కొందరు ఒక అడుగు ముందుకేసి బాలికలకు ఫీజులు, పుస్తకాలకు- ట్యూషన్లకు అయ్యే వ్యయాన్ని భరిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఈ సొసైటీలో 150 మంది సభ్యులు ఉన్నారు. వీరి వద్ద ప్రతి ఏడాది వెయ్యి రూపాయల సభ్యత్వ రుసుము వసూలు చేస్తారు. ఈ రుసుముతో పాటుగా హుండీలు.. విరాళాలతో అనేక మంది బాలికలకు సాయం చేస్తున్నారు. మొదట్లో కేవలం ఇంటర్ వరకు చేరే బాలికలకే సాయం చేసేవారు. ఇప్పుడు డిగ్రీ చదివేవారికి కూడా సాయం చేస్తున్నారు.

> అర్హుల ఎంపికలో మా సొసైటీ నిబంధనలను తప్ప మరే ఇతర అంశాలనూ పరిగణనలోకి తీసుకోం. కుల, మతాలకు అతీతంగా బాలికలను ఎంపిక చేసి ఫీజులు చెల్లిస్తున్నాం. విద్యార్థినులు కూడా శ్రద్ధగా చదివి మాకు ఆత్మసంతృప్తిని కలిగిస్తున్నారు. రానున్న రోజుల్లో సొసైటీని మరింత విస్తృతపరుస్తాం.
>
> **- దేవరశెట్టి మాధవీలత,** సొసైటీ అధ్యక్షురాలు



ఎంపిక ఎలా..

"అర్హులైన వారందరూ బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో ఈ సొసైటీని ప్రారంభించాం. అందుకోసం కొన్ని కట్టుదిట్టమైన నియమాలను ఏర్పాటు చేసుకున్నాం" అంటారు ఈ సొసైటీ ఛైర్ పర్సన్ వసుంధర. మంచి మార్కులతో ప్రభుత్వ కాలేజీలో సీటు తెచ్చుకొని.. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారికి ఈ సొసైటీ సాయం చేస్తుంది. విద్యార్థినులు ఏ కులానికి చెందినవారు? ఏ మతానికి చెందినవారు? అనే పట్టింపులు ఏమి ఉండవు. అయితే సాయం పొందిన వారు కూడా మంచి మార్కులతో పాస్ కావాల్సి ఉంటుంది. ఒక సారి ఫెయిల్ అయినా- ఈ సాయాన్ని అందించరు. " సొసైటీ ఇచ్చిన ఆర్థిక సాయంతో నేను ఎంటెక్ పూర్తి చేశా. క్యాంపెస్ ఇంటర్వ్యూలో టీసీఎస్‌లో ఉద్యోగం వచ్చింది.. డిగ్రీలో పాస్ కావటమే లక్ష్యం కాదు.. మంచి మార్కులతో ఇతరుల కన్నా ముందు ఉండాలని చదివేదాన్ని" అంటారు సంధ్య. ఈ సొసైటీకి విరాళాల రూపంలో వచ్చిన డబ్బంతా బ్యాంకుల్లో ఉంచుతారు. కాలేజీల ఫీజులను నేరుగా సొసైటీ నుంచి నేరుగా చెల్లిస్తారు. అంతే కాకుండా ఈ మధ్యకాలంలో సాయం పొందుతున్న విద్యార్థినులందరికీ ఒక వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో ప్రతి రోజు గ్రూపు సభ్యులు సాధించిన విజయాలు.. ఇతర స్ఫూర్తి గాధలను షేర్ చేస్తూ ఉంటారు. వీటి వల్ల కూడా అనేక మంది విద్యార్థినులు ప్రేరణ పొందుతున్నారు. ఈ తరహా సొసైటీలు అన్ని ప్రాంతాల్లో ఏర్పాటైతే మరింత మందికి సాయం అందుతుందనటంలో ఎటువంటి సందేహం లేదు.

- **మహమ్మద్ రఫి,** గుంతకల్లు

కౌన్సెలింగ్

అనుబంధం బలంగా

డాక్టర్! మేమిద్దరం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లం. గత రెండేళ్లుగా ఇంటి నుంచే పని చేస్తున్నాం. అయితే ఈ తరహా వర్క్ ఫ్రం హోం బాగున్నట్టే అనిపించినా, గత కొంత కాలంగా మా మధ్య చీకాకులు, కోపతాపాలూ పెరుగుతున్నాయి. వీటిని వదిలించుకుని పూర్వంలా అన్యోన్యంగా మసలుకోగలిగే వాతావరణాన్ని నెలకొల్పే మార్గం ఉందా?

- ఓ సోదరి, హైదరాబాద్.

భార్యాభర్తల అనుబంధానికి దంపతులిద్దరూ సమ ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే పరిస్థితులను అంగీకరించి, వాటికి తగ్గట్టు మసలుకోవాలి. కలిసి ఒకే ఇంట్లో ఒకే వాతావరణంలో జీవించేటప్పుడు, అడపా దడపా చీకాకులు తలెత్తడం సహజమే! అయితే ఇద్దరి మధ్యా గొడవలు తలెత్తడానికి కారణాలను అన్వేషించుకోవాలి. పొరపాటు ఎక్కడ జరుగుతుందో ఎవరికి వారు గమనించుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా కలిసి గడిపే సమయం విసుగు తెప్పించేలా ఉండకుండా అందుకు తగిన పరిష్కారాలు ఆలోచించాలి.

భావవ్యక్తీకరణ: చెబుతున్నది ఆలకించాలే తప్ప, ప్రతిస్పందించడం కోసం వినడం సరి కాదు. స్పందించడం కోసం చెబుతున్నది వినడం మొదలుపెడితే, పర్యవసానాలు తప్పవు

ప్రేమాప్యాయతలు: దంపతుల మధ్య అనుబంధం... ప్రేమ, ఆప్యాయతలతో ముడిపడి ఉండాలి. దాంపత్య బంధం



మీద పట్టు సాధించాలంటే దంపతులు ఒకర్నొకరు అర్థం చేసుకోవాలి. సంసార జీవితం సజావుగా సాగించగలిగే మెలకువలను అలవరుచుకోవాలి.

నాణ్యమైన సమయం: పరిమాణం కంటే నాణ్యత ముఖ్యం. ఎంత సమయం కలిసి గడిపాం అనేది కాకుండా ఎంత నాణ్యమైన సమయాన్ని గడిపాం అనేదే ముఖ్యంగా దంపతులు భావించాలి. అలాంటి సమయం కోసం తీరిక చేసుకోవాలి.

ప్రేమ భాష: స్పర్శే ప్రేమ భాష. హత్తుకోవడం, స్పృశించడం, చేతులు కలపడం... ఇవన్నీ దంపతులను మానసికంగా చేరువ చేసేవే! కాబట్టి ప్రతి రోజూ అంతటి సాన్నిహిత్యంతోనే మెలగాలి.

దూర దృష్టి: జీవితం, అనుబంధం, కలిసి జీవితాన్ని కొనసాగించడంలో ఉండే ప్రయోజనాలను దూర దృష్టితో ఆలోచించాలి.

దంపతులిద్దరూ పరస్పర వృత్తులనూ, సమయాలనూ, స్వేచ్ఛలనూ గౌరవించుకుంటూ అద్భుతమైన అనుబంధాన్ని ఏర్పరుచుకోవాలి. అనుకూల భావాలను స్వాగతిస్తూ, ప్రతికూల భావాలకు చోటు లేకుండా చేసుకోవాలి.

- **డాక్టర్ మధురిమ రెడ్డి పూత,** సైకాలజిస్ట్, హైదరాబాద్

స్ఫూర్తి

ఒకప్పుడు రాకెట్ ప్రయోగాల్లో భాగస్వామి అయిన ఆమె... ఇప్పుడు పర్యావరణ కార్యకర్తగా వ్యర్థాలపై యుద్ధం చేస్తున్నారు. మార్పునకు ఇంటి నుంచే శ్రీకారం చుట్టి... ఆపై సమాజంలో చైతన్యం తెచ్చే పనిలో పడ్డారు. 'జీరో వేస్ట్ అడ్డా' ఇన్‌స్టా వేదికగా అవగాహన కల్పిస్తూ... భారతీయుల గృహాల్లో వ్యర్థాలను తగ్గించేలా స్ఫూర్తి రగిలిస్తున్నారు. ప్రధాని మోదీ నుంచి 'నేషనల్ గ్రీన్ చాంపియన్ క్రియేటర్' అవార్డును సైతం అందుకున్న ఇస్రో మాజీ శాస్త్రవేత్త పంక్తి పాండే ప్రయాణం ఇది.

భూమికి భారం తగ్గిస్తున్నారు

"మార్పు కోసం వేసే తొలి అడుగు ఎప్పుడూ ఒంటరే. ఆ అడుగు నాదే ఎందుకు కాకూడదు? ఈ ఆలోచనే నాలో ఉద్యమ స్ఫూర్తి రగిలించింది. వ్యర్థంపై యుద్ధానికి ప్రేరణ కలిగించింది. ఫలితంగా నాలుగేళ్ల కిందట 'జీరో వేస్ట్ అడ్డా' పురుడు పోసుకుంది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరం మాది. బీటెక్ తరువాత ఇస్రోలో మైక్రోవేవ్ ఇంజనీర్‌గా ఉద్యోగం వచ్చింది. 2009లో చేరాను. గత ఏడాది మార్చి వరకు పని చేశాను. అయితే మొదటి నుంచీ నాకు భూమికి భారంగా మారుతున్న, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాల విషయంలో ఆందోళన ఉండేది. ఈ క్రమంలో ఒకరోజు పత్రికలో దీనికి సంబంధించిన ఒక కథనం చదివాను. పర్యావరణవేత్తలు, ప్రేమికులు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాల గురించి అందులో చర్చించారు. ఆ సమయంలో నేను గర్భవతిని. ఇప్పుడే వాతావరణం ఇంతలా కలుషితమైతే.. ఇక పుట్టబోయే బిడ్డ పరిస్థితి ఏంటని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఈ ప్రశ్న నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. మరి పరిష్కారం ఏంటి?

మా ఇంటి నుంచి...

తెలిసి కొందరు, తెలియక కొందరు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యర్థాలు పేరుకుపోవడానికి మనమందరం కారణం అవుతున్నాం. మా ఇల్లే తీసుకోండి.. టిఫెన్ ప్లేట్ల నుంచి క్యారీబ్యాగ్‌ల వరకు ప్లాస్టిక్ వస్తువులే ఉండేవి. సౌలభ్యం కోసం కావచ్చు, మరొకటి కావచ్చు... కారణం ఏదైనా మనకు తెలియకుండా ప్లాస్టిక్ తదితర వ్యర్థాలు మన ఇంటిని ఆక్రమించేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే.. అది నాతోనే మొదలుకావాలని భావించాను. అందుకే మా ఇంటి నుంచే మార్పునకు శ్రీకారం చుట్టాను. క్యారీ బ్యాగ్‌లు, షాంపూ బాటిల్స్, కిచెన్‌లో వాడే స్క్రబ్బర్స్.. ఇలా ఎన్నో ఎక్కడబడితే అక్కడ కనిపించాయి. వాటికి ప్రత్యామ్నాయంగా పునర్వినియోగ స్టీల్ వస్తువులు, క్లాత్ బ్యాగ్స్‌లాంటివి తెచ్చాను. సెకండ్‌హ్యాండ్ ఫర్నీచర్ కొన్నాను. సాధ్యామైనంతవరకు వ్యర్థాలు తగ్గించుకొని, తదనుగుణంగా జీవనశైలిని మార్చుకున్నాను. ఆహార పదార్థాలు కూడా అవసరానికి మించి పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకున్నా. ఇదేతరహాలో ప్రజలను చైతన్యవంతులను చేస్తే ప్రయోజనం ఉంటుందని అనుకున్నా.



సామాజిక మాధ్యమాల ద్వారా...

నా దృష్టిలో త్వరితగతిన ప్రజలకు చేరువ కావడానికి సామాజిక మాధ్యమాలు అద్భుత సాధనాలు. సరైన రీతిలో ఉపయోగించుకొంటే సమాజంపై ఎంతో ప్రభావం చూపుతాయి. ఈ భావనతోనే 2021లో నేను 'జీరో వేస్ట్ అడ్డా' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీ ప్రారంభించాను. దానిద్వారా పర్యావరణానికి హాని కలిగిస్తున్న వ్యర్థాల గురించి అవగాహన కల్పించాను. వాటికి ప్రత్యామ్నాయ మార్గాలు సూచించాను. అవకాశం ఉన్నవారికి అనువైన కంపోస్టింగ్ పద్ధతులు వివరించాను. కొద్ది రోజుల్లోనే నా పోస్టులు వేలమందిని ఆకర్షించాయి. ఇప్పుడు ఇన్‌స్టాలో నా పేజీని నాలుగు లక్షలమందికి పైగా ఫాలో అవుతున్నారు. ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో కూడా నా పోస్టులు షేర్ చేస్తున్నారు. నా సూచనలు, సలహాలతో చాలామంది తమ జీవన శైలిని మార్చుకున్నామని చెబుతుంటే నాకు ఎంతో సంతోషంగా ఉంటుంది. ఒక చిన్న అడుగుతో పర్యావరణానికి కొంతైనా మేలు జరుగుతోంది. ఇలాంటి మార్పునే నేను కోరుకుంది."

> **వర్క్‌షాప్‌లు కూడా...**
>
> ఒక పర్యావరణ ప్రేమికురాలిగానే కాకుండా.. శాస్త్రవేత్తగా కూడా నేను ఆలోచించడం మొదలుపెట్టాను. వ్యర్థాలను తగ్గించి, తద్వారా కాలుష్యాన్ని నివారించేందుకు, పునర్వినియోగించేందుకు ఆచరణసాధ్యమయ్యే మార్గాలపై నిత్యం అన్వేషిస్తూనే ఉంటాను. ప్రయోగాలు చేస్తుంటాను. దీనికి అనుబంధంగా 'ప్రాజెక్ట్ కాంచన్' నెలకొల్పాను. మరింత చైతన్యం తేవాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాను. నా సేవలకు గుర్తింపుగా గత ఏడాది ప్రధాని మోదీ నుంచి 'నేషనల్ గ్రీన్ చాంపియన్ క్రియేటర్' అవార్డు అందుకున్నాను. 'ఫోర్బ్స్' మ్యాగజైన్ టాప్ 100 చేంజ్ మేకర్స్ జాబితాలో కూడా చోటు సంపాదించాను. ఏదిఏమైనా దీన్ని ఒక పనిగా కాకుండా ఒక బాధ్యతగా భావిస్తున్నా. అందరూ అలానే భావిస్తే భూమికి భారం తగ్గుతుంది. పర్యావరణం పచ్చగా వర్ధిల్లుతుంది."

సర్వ రోగ నివారిణి

శీతాకాలంలో విరివిగా లభించే సింగాడా దుంపలు... చూడడానికి నల్లని బొగ్గుల్లా కనిపిస్తాయి. లోపల మాత్రం తెల్లగా ఉంటుంది. వీటిలో చాలా పోషకాలు ఉంటాయనీ, వీటిని ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయనీ నిపుణులు చెబుతున్నారు.



- సింగాడాలు తీపి, వగరు కలగలిసిన రుచిలో క్రంచీగా ఉంటాయి. వీటిని ఉడికించుకుని లేదా కాల్చుకుని తినవచ్చు. సలాడ్స్, సూప్స్ శాండ్‌విచ్‌లలో వినియోగించుకోవచ్చు. వీటిని ఎండబెట్టి పిండి చేసి దానితో రొట్టెలు, లడ్డూలు, కడి లాంటి కూరలు తయారు చేసుకోవచ్చు. సింగాడా పిండిని పూజలు, ఉపవాసాలప్పుడు ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు.
- సింగాడాలో పీచుపదార్థాలు అధికం. ఇవి జీర్ణక్రియను వేగవంతం చేసి చలికాలంలో ఎక్కువగా ఏర్పడే మలబద్దకం సమస్యను నివారిస్తాయి.
- వీటిలోని కాల్షియం, పొటాషియం, మాంగనీస్, జింక్, కాపర్ లాంటి మినరల్స్.. ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తాయి. శరీరంలో రక్తప్రసరణ వేగాన్ని నియంత్రించి గుండె ఆరోగ్యంగా పనిచేసేందుకు తోడ్పడతాయి. మెదడుకు చురుకుదనాన్ని ఇస్తాయి.
- సింగాడాలో అరుదైన లారిక్ యాసిడ్ ఉంటుంది. ఇది చర్మసౌందర్యాన్ని కాపాడడంతోపాటు శిరోజాలు ఒత్తుగా పెరిగేలా చేస్తుంది. చర్మానికి తగినంత తేమను అందిస్తుంది. సింగాడాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల చర్మం పొడిబారడం, చుండ్రు లాంటి సమస్యలు తగ్గుతాయి. శరీరంలో పేరుకున్న టాక్సిన్లు బయటికి వెళ్లిపోతాయి. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది.
- సింగాడాలో బి, సి, ఇ, కె విటమిన్లతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరానికి పోషణను అందిస్తాయి. కొవ్వులు, కేలరీలు నామమాత్రంగా ఉంటాయి. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ కూడా చాలా తక్కువ. మధుమేహం ఉన్నవారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

ట్రెండ్

బాలీవుడ్ బ్యూటీలు తెర మీద అద్భుతమైన నటనను ప్రదర్శించడంతో పాటు, అంతకు మించిన అద్భుతమైన బ్రాండ్లకు అధిపతులవుతున్నారు. ప్రముఖ తారలు, వాళ్ల సొంత బ్రాండ్ల గురించి తెలుసుకుందామా?

భామల బ్రాండ్స్

గ్లామర్, స్టైల్‌కు మారుపేరుగా నిలిచే హిందీ తారలు బ్రాండ్ల ప్రచారానికే పరిమితం కాకుండా సొంత దుస్తులు, సౌందర్య సాధనాల బ్రాండ్లను లాంచ్ చేసుకుంటూ ఫ్యాషన్ ప్రపంచంలో తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అలాంటి కొందరు ప్రముఖులు, వారి బ్రాండ్లు ఇవే..

మసాబా.. లవ్ చైల్డ్

నీనా గుప్తా కూతురు మసాబా గుప్తా తనదైన ప్రత్యేకమైన స్టైల్ స్టేట్‌మెంట్‌కు గుర్తింపు పొందింది. హౌస్ ఆఫ్ మసాబా అనే దుస్తుల లేబుల్‌ను కలిగి ఉన్న మసాబా, బ్యూటీ బ్రాండ్, లవ్‌చైల్డ్‌ను కూడా లాంచ్ చేసింది. ఈ చర్మ సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్‌లో పలురకాల లిప్‌స్టిక్‌లూ, ఫౌండేషన్‌లూ ఉంటాయి. నీనా గుప్తా, క్రికెటర్ వివియన్ రిచర్డ్స్ ప్రేమ ఫలితంగా పుట్టిన తాను 'లవ్‌చైల్డ్'గా గుర్తింపు పొందడాన్ని ప్రారంభంలో ప్రతికూలంగానే భావించాననీ, కానీ ఆ స్టేటస్‌ను సవాలు చేసేలా, అసాధారణమైన అంశాన్ని సరళతరం చేయాలని సంకల్పించినట్టు మసాబా ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది. ఆ క్రమంలోనే లవ్‌చైల్డ్ అనే బ్రాండ్‌ను సృష్టించి, తనదైన విప్లవాత్మక నైజాన్ని చాటుకునే ప్రయత్నం చేసింది మసాబా.

కత్రినా ఖైఫ్... కె బ్యూటీ

తన పేరులోని మొదటి అక్షరమైన 'కె' పేరుతో.. 2019లో కె బ్యూటీ బ్రాండును లాంచ్ చేసింది కత్రినా ఖైఫ్. అత్యుత్తమ నాణ్యతతో కూడిన, మేకప్ ఉత్పత్తులను ఈ బ్రాండ్ అందుబాటులోకి తీసుకొచ్చింది. లిప్‌స్టిక్స్, ఐలైనర్స్, ఫౌండేషన్ మొదలైన సౌందర్యసాధనాలు ఈ బ్రాండ్‌లో దొరుకుతాయి.



అనుష్క శర్మ... నష్



అద్భుతమైన నటనా నైపుణ్యాలతో అభిమానులను అలరించిన అనుష్క సొంత బ్రాండ్ గురించి తెలిసిన వాళ్లు తక్కువ. 2017లోనే ఈమె దుస్తుల బ్రాండ్ 'నష్'ను లాంచ్ చేసింది. సౌకర్యంగా ఉండే దుస్తుల కొరతను గమనించిన అనుష్క, సౌకర్యంతో పాటు స్టైల్‌కు ప్రాధాన్యమిస్తూ వినూత్నంగా, విభిన్నంగా ఉండే దుస్తుల బ్రాండ్‌ను లాంచ్ చేసింది.

జాక్వెలిన్ ఫెర్నాండెజ్... జస్ట్ ఎఫ్

ఫ్యాషన్ ప్రపంచ రారాణిగా పేరుపొందిన జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఫ్యాషన్ సెన్స్‌కు అభిమానులు దాసోహమవుతూ ఉంటారు. ట్రెండీగా, అధునికంగా కనిపించే వస్త్రధారణను అనుసరించే జాక్విలిన్ 2018లో జస్ట్ ఎఫ్ పేరుతో వస్త్రాల బ్రాండ్‌కు శ్రీకారం చుట్టింది. సరికొత్త ఫ్యాషన్లను అనుసరిస్తూ, అందుబాటు ధరల్లో రూపొందే జస్ట్ ఎఫ్ దుస్తులు అన్ని వయసుల మహిళలనూ విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. మరీముఖ్యంగా క్యాజువల్ వేర్ దుస్తుల అవసరతను గుర్తించిన జాక్వెలిన్, తెలివిగా తన బ్రాండ్‌తో ఆ ఖాళీని భర్తీ చేయడం తెలివైన ఎత్తుగడ అని వ్యాపార నిపుణులు భావిస్తూ ఉంటారు.



అక్కాచెల్లెళ్ల... రీసన్

అత్యంత ఫ్యాషన్‌గా కనిపించే సోనమ్ కపూర్, రియా కపూర్‌లను ప్రస్తావించకుండా ఫ్యాషన్ గురించి మాట్లాడడం అసంభవం. ఈ ఇద్దరు అక్కాచెల్లెళ్లు రీసన్ అనే సొంత దుస్తుల బ్రాండ్‌ను కలిగి ఉన్నారు. ట్రెండీగా, అందుబాటు ధరల్లో దొరికే వస్త్ర ప్రపంచం వీరిది. వీటిలో క్యాజువల్ వేర్ బాగా ప్రసిద్ధి పొందింది. 2017లో లాంచ్ చేసిన ఈ బ్రాండ్ ఎంతో తక్కువ కాలంలోనే మహిళల ఆదరణను చూరగొనడం విశేషం.

ముగ్గురు ప్రముఖుల... లేబుల్ లైఫ్

సుసాన్ ఖాన్, బిపాషా బసు, మలైకా అరోరా... ఎవరి పరిధిలో వాళ్లు తమదైన ప్రత్యేకతను కలిగి ఉన్నారు. ఈ ముగ్గురు ప్రముఖులూ కలిసి లేబుల్ లైఫ్ అనే దుస్తుల బ్రాండ్‌ను రూపొందించారు. 2012లో లాంచ్ అయిన ఈ లైఫ్‌స్టైల్ బ్రాండ్, దుస్తులతో పాటు, గృహాలంకరణ వస్తువులు, మహిళల యాక్సెసరీస్‌లను అందిస్తుంది. మహిళల వస్త్రాలకే పరిమితం కాకుండా మహిళలు ఇష్టపడే గృహాలంకరణ ఉత్పత్తుల మీద దృష్టి సారించి, తమలోని వ్యాపార మెలకువలను చాటుకున్నారు.



సరికొత్త పాత్రలో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' అనేది వర్కింగ్ టైటిల్. బుధవారం ఈ సినిమాను పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బి.గోపాల్ క్లాప్ కొట్టారు. బాలకృష్ణ కూతురు తేజస్విని కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకులు బోయపాటి శ్రీను, బాబీ, బుచ్చిబాబు సానా గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ను షేర్ చేశారు. రాజసం ఉట్టిపడేలా శక్తిమంతమైన లుక్‌లో ఓ వైపు, మెడలో రుద్రాక్షమాల ధరించి మరోవైపు.. రెండు విభిన్న లుక్స్‌లో కనిపించారు బాలకృష్ణ. చారిత్రక నేపథ్యంలో సాగే ఈ సినిమాలో ఆయన ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని సరికొత్త పాత్రలో ఆయనను చూపించబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. హృదయానికి హత్తుకునే భావోద్వేగాలు, సరికొత్త అనుభూతినిచ్చే సన్నివేశాలు, థ్రిల్‌ను పంచే పోరాటఘట్టాలు, అద్భుతమైన విజువల్స్‌తో సినిమాను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. 'సింహా', 'జై సింహా', 'శ్రీరామ రాజ్యం' సినిమాల తర్వాత బాలకృష్ణతో కలసి ఆమె నటిస్తున్న నాలుగో చిత్రమిది. థమన్ సంగీతం అందిస్తున్నారు. బాలయ్య, గోపీచంద్ మలినేని కాంబోలో 2023లో విడుదలైన 'వీర సింహారెడ్డి' మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే.



నిర్మాత సీహెచ్‌ఆర్‌బీ చౌదరి కన్నుమూత

టాలీవుడ్ నిర్మాత సీహెచ్‌ఆర్‌బీ చౌదరి(55) బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన పూర్తి పేరు చలసాని రామబ్రహ్మం చౌదరి. జేడీ చక్రవర్తి హీరోగా 'నేను ప్రేమిస్తున్నాను', రాజశేఖర్‌తో 'నేటి గాంధీ' అల్లరి నరేశ్‌తో 'సెల్ఫీరాజా' చిత్రాలను నిర్మించారు. ఆయన తండ్రి చలసాని గోపి, మావయ్య టీ త్రివిక్రమరావు కూడా విజయవంతమైన చిత్ర నిర్మాతలే. చౌదరి స్వగ్రామం కృష్ణా జిల్లాలోని పెదమద్దాలిలో నేడు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రివాల్వర్ రీటాగా గుర్తుండిపోతాను


కీర్తిసురేశ్

ఇప్పటివరకూ డార్క్ కామెడీ నేపథ్యంలో చాలా చిత్రాలు వచ్చాయి. అవన్నీ హీరో పాత్ర చుట్టూ అల్లుకున్న కథలు. కానీ 'రివాల్వర్ రీటా' మాత్రం హీరోయిన్ ఓరియంటెడ్ కథతో రూపుదిద్దుకున్న డార్క్ కామెడీ చిత్రం. ఇకపై ప్రేక్షకులకు రివాల్వర్ రీటాగా గుర్తుండిపోతాను' అని హీరోయిన్ కీర్తిసురేశ్ అన్నారు. జేకే చంద్రు దర్శకత్వంలో ఆమె టైటిల్ రోల్ పోషించిన చిత్రమిది. సుధన్ సుందరం, జగదీశ్ పళని సామి నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కీర్తిసురేశ్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఈ చిత్రం ఉంటుంది. నన్ను రీటా పాత్రలో అద్భుతంగా చూపించిన చంద్రుకు ధన్యవాదాలు. పక్కా కమర్షియల్ హంగులతో ఈ సినిమా తీశారు. అజయ్, సునీల్, రాధిక గారి అభినయం ప్రధానాకర్షణగా నిలుస్తుంది' అని అన్నారు. డిస్ట్రిబ్యూటర్ కుమార్ మాట్లాడుతూ 'సినిమా ఎక్స్‌ట్రార్డినరీగా వచ్చింది. నాకు నచ్చి, తెలుగు, కన్నడ భాషల్లో పంపిణీ చేస్తున్నాను. కీర్తి గారు ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. పాత్రలోకి పరకాయ ప్రవేశం చేశారు. దర్శకుడు ప్రతి విషయాన్ని సునిశితంగా పరిశీలించి సినిమాను తెరకెక్కించారు' అని తెలిపారు. అద్భుతమైన కథతో తెరకెక్కిన చిత్రమిది, కీర్తిసురేశ్ గారితో కలసి నటించినందుకు ఆనందంగా ఉంది అని అజయ్ ఘోష్ తెలిపారు.



ప్రేక్షకులను అలరించేలా..

నటుడు, నిర్మాత డీఎస్‌ఆర్ తనయుడు సాయికృష్ణ దమ్మలపాటి హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'పదహారు రోజుల పండగ'. సాయికిరణ్ అడివి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రదా పిక్చర్స్, సాయి సినీ చిత్ర బేనర్‌పై సురేశ్‌కుమార్ దేవత, హరిత దుద్దుకూరు, ప్రతిభ అడివి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాను ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు శేఖర్ కమ్ముల క్లాప్ కొట్టగా, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నిర్మాత సురేశ్‌బాబు గౌరవ దర్శకత్వం వహించారు. రచయిత కోనవెంకట్, నిర్మాత కేకే రాధామోహన్ నిర్మాతలకి స్క్రిప్ట్ అందించారు. ఈ సందర్భంగా నిర్మాత సురేశ్‌కుమార్ మాట్లాడుతూ 'ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది. సరికొత్త కథతో వినోదం, భావోద్వేగాలు కలగలిసి ఉంటాయి' అని అన్నారు. సాయికృష్ణ మాట్లాడుతూ 'మంచి చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నందుకు ఆనందంగా ఉంది. సినిమా ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. సాయికిరణ్ అడివి మాట్లాడుతూ 'ఈ సినిమా ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది. సాయికృష్ణకు పరిశ్రమలో మంచి భవిష్యత్తు ఉంది' అని అన్నారు. ఈ చిత్రంలో గోపిక ఉదయన్ కథానాయిక. వెన్నెల కిశోర్, రేణూ దేశాయ్, అనసూయ భరద్వాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

'రామాయణ' ప్రపంచానికే ప్రామాణికంగా ఉంటుంది

నితీశ్ తివారీ



దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో 'రామాయణ' చిత్రం రెండు భాగాలుగా రూపుదిద్దుకుంటున్న విషయం విదితమే. రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతగా నటిస్తున్నారు. ఇందులో రావణుడి పాత్ర పోషిస్తూ, చిత్ర నిర్మాణంలో కూడా భాగస్వామి అయ్యారు కన్నడ హీరో యశ్. వచ్చే ఏడాది డిసెంబర్‌లో 'రామాయణ' చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు నితీశ్ తివారీ ఓ ఆంగ్ల మీడియా సంస్థకు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని ఆసక్తికరమైన అంశాలు వెల్లడించారు. ఓ దృశ్య కావ్యంలా, విజువల్ వండర్‌గా 'రామాయణ'ను రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 'కొన్ని కథలు ఎన్ని సార్లు విన్నా కొత్తగానే ఉంటాయి. అలాగే రామాయణం కూడా. ఈ సినిమాలో వీఎఫ్‌ఎక్స్ కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. విజువల్స్ చాలా బాగుంటాయి. అతిశయోక్తి కాదు కానీ 'రామాయణ' మొత్తం ప్రపంచానికే ఓ ప్రామాణికంగా ఉంటుంది. ఓ తపస్సులా, యజ్ఞంలా ఐదేళ్ల నుంచి ఈ సినిమా కోసం పని చేస్తున్నాం. ప్రపంచంలోనే గొప్ప వీఎఫ్‌ఎక్స్ స్టూడియోల్లో ఒకటైన ప్రైమ్ ఫోకస్‌తో కలసి పని చేయడం ఆనందంగా ఉంది. ఇంత అద్భుతమైన చిత్రానికి నేను దర్శకత్వం వహిస్తున్నాను అని గర్వంగా చెప్పడానికి నాకు రెండేళ్లు పట్టింది. చిత్రం మీద పూర్తి నమ్మకంతో ఉన్నానిప్పుడు.. వచ్చే ఏడాది దాదాపు ఇదే సమయానికి విడుదలయ్యే 'రామాయణ' చిత్రం తొలి భాగానికి ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందా అని కొంత టెన్షన్‌గా ఉంది' అన్నారు నితీశ్ తివారీ.

ఆత్మీయ అనుబంధం ఏర్పడింది




"ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రం కోసం మేము కంపోజ్ చేసిన ట్యూన్‌కు తగినట్లు రామ్ 'నువ్వుంటే చాలు' అనే అద్భుతమైన పాట రాశారు. సంగీత దర్శకులుగా మమ్మల్ని తెలుగు ప్రేక్షకులకు చేరువ చేసిన ఆ పాటతో మాకు ఒక ఆత్మీయ అనుబంధం ఏర్పడింది' అని వివేక్, మెర్విన్ చెప్పారు. మహేశ్ బాబు పి. దర్శకత్వంలో రామ్ కథానాయకుడిగా నటించిన 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంగీత దర్శకులు వివేక్, మెర్విన్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'తమిళంలో సంగీత దర్శకులుగా ఇరవై చిత్రాలకు పనిచేశాం. 'ఆంధ్ర కింగ్ తాలూకా' తెలుగులో మాకు మొదటి సినిమా. హీరో రామ్ గారు పిలిచి అవకాశమివ్వడంతో ఈ సినిమాకు సంగీత దర్శకులుగా పనిచేశాం. ఇందులో ప్రతి పాటా విజువల్‌గా స్టన్నింగ్‌గా ఉంటుంది' అని వివేక్ చెప్పారు. 'ఈ చిత్రం నుంచి నాలుగు పాటలను విడుదల చేశాం. అన్నింటికీ ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. కథలో కీలకమైన మూడు పాటలను సినిమా రిలీజయ్యాక విడుదల చేస్తాం. ప్రేక్షకులు ఈ పాటలన్నింటినీ థియేటర్లలో ఎంజాయ్ చేస్తారు. నేపథ్య సంగీతం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది' అని మెర్విన్ తెలిపారు.

దర్శకుడు సంపత్ నందికి పితృవియోగం



దర్శకుడు సంపత్ నంది ఇంట విషాదం నెలకొంది. ఆయన తండ్రి కిష్టయ్య (73) కన్నుమూశారు. మంగళవారం రాత్రి కిష్టయ్య తన నివాసంలో తుది శ్వాస విడిచారు. తండ్రిని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు సంపత్ నంది. 'నాన్న.. ఇకపై నువ్వు లేకుండానే ఉండాలి. చిన్నప్పుడు నా ఆరోగ్యం బాగాలేకపోతే ఆయుర్వేద వైద్యం కోసం నీ భుజాల మీద 10 కిలోమీటర్లు మోసుకెళ్లిన సంఘటన మొన్నే కదా జరిగింది అని అనిపిస్తోంది. నన్ను దగ్గరుండి 'ఖైదీ' సినిమాకు తీసుకెళ్లింది నిన్ననే కదా అని అనిపిస్తోంది. ఏ సినీ అభిమాని ఇంటికొచ్చినా మా వాడి దగ్గరకు వెళ్లు అని నా ఫోన్ నంబర్ ఇచ్చి ప్రోత్సహించడం.. ఇకపై ఇవన్నీ జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. ఇప్పటివరకూ నేను తీసిన సినిమాలు తప్పితే, మిగతా ఏ సినిమాలు థియేటర్లో చూడని నీ ప్రేమ నాకు మళ్లీ కావాలి' అని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

అరుదైన రికార్డు సాధించిన హనుమాన్ చాలీసా



భక్తి గీతం 'హనుమాన్ చాలీసా' ఓ అరుదైన ఘనత సాధించింది. యూట్యూబ్‌లో 500 కోట్ల వ్యూస్ వచ్చిన తొలి భారతీయ వీడియోగా రికార్డు సృష్టించింది. టీ-సిరీస్ సంస్థ 2011లో తమ యూట్యూబ్ ఛానల్లో ఈ గీతాన్ని అప్‌లోడ్ చేసింది. టీ- సిరీస్ వ్యవస్థాపకుడు గుల్షన్ కుమార్ ఈ గీతంలో నటించారు. హరిహరన్ ఈ గీతాన్ని ఆలపించగా, లలిత్ సేన్ సంగీతం అందించారు. టీ- సిరీస్ ఎండీ భూషణ్ కుమార్ ఈ వీడియో సాధించిన రికార్డుపై స్పందించి, ఆనందం వ్యక్తం చేశారు.

అహ్మదాబాద్..అధికారికం

భారత్‌లోనే 2030 కామన్వెల్త్ క్రీడలు
ప్రకటించిన నిర్వాహకులు

గ్లాస్గో: రెండు దశాబ్దాల విరామం తర్వాత కామన్వెల్త్ క్రీడలు భారత్‌లో జరగనున్నాయి. 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులను అహ్మదాబాద్ దక్కించుకొంది. నెల రోజుల కిందే ఖరారైనప్పటికీ.. బుధవారం జరిగిన కామన్వెల్త్ జనరల్ అసెంబ్లీలో అధికారికంగా ధ్రువీకరించారు. మొత్తం 74 దేశాలకు చెందిన ప్రతినిధులు భారత ఆతిథ్యాన్ని ఆమోదించారు. 15 నుంచి 17 క్రీడాంశాలను ఈ క్రీడల్లో చేర్చనున్నట్టు కామన్వెల్త్ క్రీడల బోర్డు వెల్లడించింది. అథ్లెటిక్స్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, లాన్స్‌బౌల్స్, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ నెట్‌బాల్, బాక్సింగ్ క్రీడలను ఇప్పటికే ఖరారు చేశామనీ.. ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, టీ20 క్రికెట్, బీచ్ వాలీబాల్, సైక్లింగ్, హాకీ, జూడో, షూటింగ్, స్క్వాష్, రెజ్లింగ్, ట్రయాథ్లాన్‌లాంటి మరికొన్ని క్రీడాంశాలు పరిశీలనలో ఉన్నాయని తెలిపింది. నైజీరియాకు చెందిన అబూజ నగరం కూడా ఈ క్రీడల నిర్వహణ కోసం పోటీపడింది. కానీ, ఎగ్జిక్యూటివ్ బోర్డు పెద్దలంతా అహ్మదాబాద్‌కే ఓటేశారు. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం భారత్ పోటీపడుతున్న నేపథ్యంలో కామన్వెల్త్ హక్కులు లభించడం శుభపరిణామం. ఇక.. 2030లో కామన్వెల్త్ క్రీడలు వందేళ్లు పూర్తి చేసుకోనుండడం విశేషం. ఈ మెగా ఈవెంట్‌కు భారత్ వేదికవడం ఇది రెండోసారి. అంతకుముందు 2010లో దేశ రాజధాని ఢిల్లీలో ఈ క్రీడలు జరిగాయి. తొలి కామన్వెల్త్ గేమ్స్‌కు 1930లో కెనడా ఆతిథ్యమిచ్చింది. అహ్మదాబాద్‌కు ఆతిథ్య హక్కులు దక్కడంపై ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ శుభాకాంక్షలు తెలిపారు.

మరో రెండు ఈవెంట్లకు ప్రతిపాదన: అహ్మదాబాద్ నగరం మరో రెండు మెగా ఈవెంట్లకు కూడా వేదికయ్యే అవకాశముందని భారత అధికారులు వెల్లడించారు. 2028లో అండర్-20 వరల్డ్ అథ్లెటిక్స్‌తో పాటు 2031 సీనియర్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ల ఆతిథ్యానికి అహ్మదాబాద్ పేరును ప్రతిపాదించామన్నారు.





రెండో టెస్ట్‌లో 408 పరుగులతో భారత్ చిత్తు

చరిత్ర ఎరుగని చెత్తాట

- హార్మర్‌కు దాసోహం
- దక్షిణాఫ్రికా ఘన విజయం
- 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్

హార్మర్ దెబ్బకు టీమిండియా హాహాకారాలు చేసింది. స్పిన్‌ను ఎలా ఆడాలో కూడా అర్థం కానట్టుగా.. మన బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టడంతో.. రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా చేతిలో భారత్ చిత్తయింది. భారత గడ్డపై కనీసం సిరీస్ డ్రా చేసుకొంటే చాలనుకున్న సఫారీలు.. 2-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి సరికొత్త రికార్డు సృష్టించారు.

గువాహటి: లాంఛనం ముగిసింది! చరిత్రలో లేని రీతిలో భారత జట్టు ఘోర పరాజయాన్ని చవిచూసింది. సైమన్ హార్మర్ (6/37) సుడులు తిరిగే బంతులకు దిమ్మ తిరిగిన టీమిండియా బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టడంతో.. దక్షిణాఫ్రికాతో రెండో టెస్ట్‌లో భారత్ 408 పరుగుల తేడాతో భారీ ఓటమిని చవిచూసింది. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 0-2తో వైట్‌వాష్‌కు గురైంది. కోచ్ గంభీర్ హయాంలో గత 13 నెలల్లో స్వదేశంలో భారత్ క్లీన్‌స్వీప్ కావడం ఇది రెండోసారి. ఇక గత 25 ఏళ్లలో భారత గడ్డపై సఫారీలకు ఇది తొలి సిరీస్ విజయం. నాలుగో ఇన్నింగ్స్‌లో 549 పరుగుల లక్ష్యం దాదాపు అసాధ్యమే. కానీ, టీమిండియా బ్యాటర్లు తుదికంటా పోరాడి కనీసం డ్రాతోనైనా పరువు నిలుపుతారని అభిమానులు ఆశించారు. ఆ ఆశల్ని మన బ్యాటర్లు అడియాశలు చేశారు. ఆటకు ఐదో, ఆఖరి రోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 27/2తో రెండు ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 140 పరుగులకే కుప్పకూలింది. రవీంద్ర జడేజా (54) మినహా ఎవరూ కనీసం రెండు పదులు స్కోరు చేయలేక పోయాడు. కేశవ్ మహరాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికా 489, 260/5 డిక్లేర్ చేయగా.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 201 పరుగులకు ఆలౌటైంది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా మార్కో యాన్సెన్, 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా హార్మర్ నిలిచారు.

వేటాడిన హార్మర్: పిచ్ నుంచి లభిస్తున్న సహకారంతో హార్మర్ చెలరేగడంతో.. రెండు సెషన్లు కూడా ముగియకుండానే టీమిండియా చాపచుట్టేసింది. లోబౌన్స్ బంతితో నైట్ వాచ్‌మన్ కుల్దీప్ (5)ను బౌల్డ్ చేసిన హార్మర్.. ఆ వెంటనే ధ్రువ్ జురెల్ (2)ను క్యాచవుట్ చేశాడు. అయితే, వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ (14), కెప్టెన్ రిషభ్ పంత్ (13) ఆదుకొంటారని భావించారు. అయితే, పంత్‌ను కూడా హార్మర్ కుదురుకోనీయలేదు. కానీ, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జడేజా ఆచితూచి ఆడడంతో టీ సమయానికి భారత్ 90/5తో నిలిచింది. తిరిగి వచ్చిన తర్వాత సుదర్శన్‌ను ముత్తుసామి వెనక్కిపంపాడు. ఈ దశలో జడ్డూ, సుందర్ (16) ఏడో వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యంతో పోరాడే ప్రయత్నం చేశారు. కానీ, సుందర్, నితీశ్ కుమార్ (0)ను హార్మర్ తన వరుస ఓవర్లలో వెనక్కిపంపాడు. హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న జడేజాతోపాటు సిరాజ్ (0)ను కేశవ్ అవుట్ చేయడంతో టీమిండియా కథ ముగిసింది. సిరాజ్‌ను అవుట్ చేసిన యాన్సెన్ క్యాచ్ అద్భుతమనే చెప్పాలి. బౌండరీలైన్ వద్ద ఒంటిచేత్తో ఆ క్యాచ్‌ను పట్టిన తీరుకు సిరాజ్‌తోపాటు బవుమా కూడా ఆశ్చర్య పోయారు.


ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ సైమన్ హార్మర్ (6/37)


పంత్

స్కోరు బోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 489; భారత్ తొలి ఇన్నింగ్స్: 201; దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 260/5 డిక్లేర్;

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 13, రాహుల్ (బి) హార్మర్ 6, సాయి సుదర్శన్ (సి) మార్‌క్రమ్ (బి) ముత్తుసామి 14, కుల్దీప్ (బి) హార్మర్ 5, జురెల్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 2, పంత్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 13, జడేజా (స్టంప్డ్) వెరీన్ (బి) కేశవ్ 54, సుందర్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 16, నితీశ్ (సి) వెరీన్ (బి) హార్మర్ 0, బుమ్రా (నాటౌట్) 0, సిరాజ్ (సి) యాన్సెన్ (బి) కేశవ్ 0; ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 63.5 ఓవర్లలో 140 ఆలౌట్; వికెట్ల పతనం: 1-17, 2-21, 3-40, 4-42, 5-58, 6-95, 7-130, 8-138, 9-140; బౌలింగ్: యాన్సెన్ 15-7-23-1, ముల్డర్ 4-1-6-0, హార్మర్ 23-6-37-6, కేశవ్ 12.5-1-37-2, మార్‌క్రమ్ 2-0-2-0, ముత్తుసామి 7-1-21-1.

ఇంకో మెట్టు కిందికి..

'డబ్ల్యూటీసీ'లో భారతకు ఐదోస్థానం

దక్షిణాఫ్రికాతో సిరీస్ ఓటమితో వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో టీమిండియా నాలుగు నుంచి ఐదో స్థానానికి దిగజారింది. ఈ సైకిల్‌లో 9 టెస్ట్‌లు ఆడిన భారత్ 48.15 విజయాల శాతంతో.. పాకిస్థాన్ (50 శాతం) కంటే దిగువకు చేరడం గమనార్హం. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక మొదటి మూడుస్థానాల్లో ఉన్నాయి.

- *భారత్ గడ్డపై అత్యధికంగా 27 వికెట్లు పడగొట్టిన దక్షిణాఫ్రికా బౌలర్ హార్మర్. స్టెయిన్ (26 వికెట్లు)ను హార్మర్ అధిగమించాడు.*
- *ఒక టెస్ట్ మ్యాచ్‌లో అత్యధికంగా 9 క్యాచ్‌లు అందుకొన్న ఫీల్డర్‌గా మార్‌క్రమ్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో రహానె 8 క్యాచ్‌ల రికార్డును తిరగ రాశాడు.*
- *పరుగుల పరంగా భారత జట్టు చరిత్రలో ఇది అత్యంత ఘోర పరాజయం. 2004లో నాగ్‌పూర్ టెస్ట్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ 342 రన్స్ తేడాతో ఓటమి అతి పెద్దది. ఇప్పుడు దక్షిణాఫ్రికా చేతిలో 408 పరుగుల తేడాతో పరాజయం పాలైంది.*

'పోల్' ఆటగాడి ప్రాణం తీసింది!

రోహ్‌తక్ (హరియాణా): తాను రోజూ సాధన చేసే బాస్కెట్‌బాల్ కోర్టు.. అందులోని బాస్కెట్‌బాల్ పోల్ ఆ జాతీయస్థాయి క్రీడాకారుడికి మరణ శాసనమైంది. హర్దిక్ రథి (16) రోజుమాదిరే ఇక్కడి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బాస్కెట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. బంతిని బాస్కెట్‌లో వేసే సాధన క్రమంలో తుప్పుపట్టిన బాస్కెట్‌బాల్ పోల్ అతడిపై పడింది. గమనించిన సహచర ఆటగాళ్లు పోల్‌ను పక్కకుతీసి హర్దిక్‌ను రక్షించే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయాడు.

అజ్లాన్ షా హాకీలో మలేసియాపై భారత్ గెలుపు

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత్ ఆతిథ్య మలేసియాను 4-3తో చిత్తు చేసింది. భారత్ తరఫున సెల్వమ్ (7వ), సుఖ్‌జీత్ (21వ), రోహిదాస్ (39వ), సంజయ్ (53) గోల్స్ చేశారు. టోర్నీలో భారత్ తర్వాతి మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో గురువారం ఆడనుంది.


గంభీర్

ఇప్పుడేమంటావ్?

అద్భుతమేమీ జరగలేదు. అసలు రెండో టెస్ట్‌లో మన ప్రధాన బ్యాటర్ల ఆట తీరు చూస్తే అద్భుతమన్న పదమే అత్యాశ అవుతుంది! భారత టెస్టు చరిత్రలోనే అత్యంత చెత్త ప్రదర్శనను కనబరచిన మన ఆటగాళ్లకు అసలేమైంది. గత జూన్-జులైలో ఇంగ్లండ్ పర్యటనలో కఠినమైన సిరీస్‌ను డ్రా చేయడం ద్వారా కొత్త కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలోని జట్టు శభాష్ అనిపించుకుంది. మరిప్పుడు పరిస్థితి ఎందుకు తారుమారైంది. ఇంగ్లండ్ టూర్ తర్వాత మన దేశంలో బలహీన వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా 2-0తో దక్కించుకుంది. కానీ బలమైన జట్టు ఎదురుపడేసరికి స్వదేశంలోనూ మనోళ్లు చేతులెత్తేస్తున్నారు.

గురువు బాధ్యత తీసుకుంటాడా ?

కోచ్‌గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టాక భారత జట్టు అద్భుతాలు చేయలేదు సరికదా.. స్వదేశంలో గత నవంబరులో న్యూజిలాండ్ చేతిలో (0-3), ఇప్పుడు దక్షిణాఫ్రికాపై అవమానకర రీతిలో క్లీన్‌స్వీప్‌లు. ఆస్ట్రేలియా గడ్డపై ఆ జట్టు చేతిలో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో 1-3తో పరాజయం. అలాగే 27 ఏళ్ల తర్వాత వన్డేలలో శ్రీలంక చేతిలో టీమిండియా సిరీస్‌ను కోల్పోయింది. గతంలో కిర్‌స్టెన్, కుంబ్లే, రవిశాస్త్రి, ద్రవిడ్‌ల హయాంలో టీమిండియా చక్కని ఫలితాలే రాబట్టింది. నాటి కెప్టెన్ కోహ్లీతో కోచ్ కుంబ్లేకు సరిపడకపోయినా..అది జట్టు ప్రదర్శనపై మాత్రం ప్రభావం చూపలేదు. కానీ గంభీర్ వ్యవహార శైలి భిన్నమైనదని చెబుతారు. సీనియర్లేకాదు..జూనియర్లు కూడా అతడి తీరుపై సంతృప్తిగా లేరన్నది జట్టు వర్గాల సమాచారం. జట్టు ఎంపిక, ఆటగాళ్లను బ్యాటింగ్ ఆర్డర్‌లో పైకి కిందికి మార్చడం తదితర గంభీర్ నిర్ణయాలపై విశ్లేషకులు ఆశ్చర్యం ప్రకటించడం పరిపాటి అయిపోయింది. ఇకపోతే..న్యూజిలాండ్, ఆస్ట్రేలియాపై టెస్ట్ సిరీస్‌ల ఓటముల తర్వాత సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, అశ్విన్ అనూహ్యంగా సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. వారు ముగ్గురికీ కోచ్ గంభీర్ పొమ్మనలేక పొగబెట్టాడన్న విమర్శలు తీవ్ర స్థాయిలో వినిపించాయి. మరి స్వదేశంలో రెండు టెస్ట్ సిరీస్‌ల్లో వైట్‌వాష్‌కు లోనైన నేపథ్యంలో కోచ్‌గా గంభీర్ బాధ్యత తీసుకోవాలి కదా! అన్న చర్చ మొదలైంది.

బ్యాటర్లు, బౌలర్ల సమష్టి వైఫల్యం..

ఈ సిరీస్‌లో కోల్‌కతా టెస్ట్‌లో పట్టుబట్టి స్పిన్ వికెట్ తయారు చేయించుకున్న గిల్ సేన భంగపడింది. దాంతో గువాహటి టెస్ట్‌కు అటు బౌలర్లు, బ్యాటర్లకు సమంగా అనుకూలించేలా పిచ్‌ను రూపొందించారు. మరి బ్యాటింగ్‌కు సహకరించిన పిచ్‌పై భారత బ్యాటర్లు ఎందుకు భంగపడ్డారు. ప్రత్యర్థి మిడిల్, టెయిలెండర్ బ్యాటర్లు ధారాళంగా పరుగులు చేసిన వికెట్‌పై కనీసం మన టాప్, మిడిలార్డర్ బ్యాటర్లు ఎందుకు రాణించలేకపోయారు? నిర్లక్ష్యపు షాట్లతో వికెట్లు పారేసుకున్నారు. జట్టు ఇక్కట్లలో ఉన్నప్పుడు బాధ్యత లేకుండా ఆడారు. తొలి ఇన్నింగ్స్‌లో రాణించలేకపోయిన జడేజా...రెండో ఇన్నింగ్స్‌లో ఆకట్టుకున్నాడు. నితీశ్ కుమార్ తన ఎంపికకు ఏమాత్రం న్యాయం చేయలేకపోయాడు. ఇక ఇటీవలి కాలంలో ఆపద్బాంధవుడి పాత్ర పోషిస్తున్న సుందర్ సత్తా చాటబట్టి తొలి ఇన్నింగ్స్‌లో 200 స్కోరైనా సాధ్యమైంది. లేదంటే మనోళ్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉండేది. మొదటి ఇన్నింగ్స్‌లో స్పిన్నర్ కుల్దీప్ ఎంతో ఓపికగా (134 బంతులు) ఆడిన తీరు చూస్తే మన ప్రధాన బ్యాటర్ల వైఫల్యం మరింత స్పష్టమవుతుంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నా భవిష్యత్ బీసీసీఐ చేతుల్లో..: గంభీర్

సొంతగడ్డపై వరుసగా రెండో వైట్‌వాష్ కావడంతో కోచ్ గంభీర్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, ఈ దారుణ వైఫల్యానికి తాను సహా అందరూ బాధ్యులేనని గౌతీ అన్నాడు. తన భవిష్యత్‌ను బీసీసీఐ నిర్ణయిస్తుందని చెప్పాడు. 'భారత క్రికెట్ కంటే నాకు ఏదీ ముఖ్యం కాదు. యువ జట్టుతోనే ఇంగ్లండ్‌లో సిరీస్ డ్రా చేసుకొన్నప్పుడు కూడా అక్కడ ఉన్నది నేనే. నా హయాంలోనే చాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ గెలిచారన్న విషయాన్ని గుర్తుంచుకోవాల'ని చెప్పాడు. కివీస్‌తో సిరీస్‌లో ఎంతో అనుభవం ఉన్న రోహిత్, కోహ్లీ జట్టులో ఉన్నారన్న విషయాన్ని గౌతీ నర్మగర్భంగా చెప్పాడు. అయితే, ఇప్పటి టాపార్డర్ బ్యాటర్లు కొందరికి 15 టెస్ట్‌లు ఆడిన అనుభవం కూడా లేదని తెలిపాడు.

19 ఏళ్ల కుర్రాడు.. కప్ కొట్టాడు

చెస్ వరల్డ్ కప్ విజేత సిందరోవ్



పనాజీ: ఉజ్బెకిస్థాన్ చెస్ ఆటగాడు జావోఖిర్ సిందరోవ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ 19 ఏళ్ల గ్రాండ్‌మాస్టర్ ఫిడే వరల్డ్ కప్‌లో చాంపియన్‌గా నిలిచాడు. ఫైనల్లో సిందరోవ్ 2.5-1.5తో చైనా గ్రాండ్‌మాస్టర్, 26 ఏళ్ల వీ యీని ఓడించాడు. తద్వారా పిన్న వయసులో ఫిడే వరల్డ్ కప్ నెగ్గిన ఆటగాడిగా సిందరోవ్ రికార్డుకెక్కాడు. ఈ ఏడాది మహిళల వరల్డ్ కప్ నెగ్గిన భారత అమ్మాయి దివ్యా దేశ్‌ముఖ్ వయసు కూడా 19 ఏళ్లే కావడం విశేషం.

ఫైనల్ పోరులో భాగంగా తొలి రెండు గేమ్‌లను సిందరోవ్, వీ యీ డ్రాగా ముగించడంతో.. ఫలితం కోసం టైబ్రేక్‌కు వెళ్లారు. బుధవారం జరిగిన టైబ్రేక్ తొలి రౌండ్‌లో వీ యీని డ్రాతో నిలువరించిన సిందరోవ్ రెండో రౌండ్లో విజయం సాధించి టైటిల్ విజేతగా నిలిచాడు. సిందరోవ్‌కు ట్రోఫీతో పాటు రూ. కోటి ప్రైజ్‌మనీ దక్కింది. ఫైనల్ చేరడం ద్వారా వీళ్లిద్దరూ ఇప్పటికే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో భారత్ నుంచి తెలుగు ఆటగాడు అర్జున్ ఇరిగేసి క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పాలయ్యాడు.

ఆసియా క్రీడలే తదుపరి లక్ష్యం


ఆర్చర్ జ్యోతి సురేఖ

హైదరాబాద్: ఆసియా క్రీడలే తన తదుపరి లక్ష్యమని స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ తెలిపింది. 2022 ఆసియా క్రీడల కాంపౌండ్ ఆర్చరీలో భారత్ కాంపౌండ్, రికర్వ్ విభాగాలలో కలిపి 5 స్వర్ణాలు సహా మొత్తం 9 పతకాలు సాధించింది. ఇక.తదుపరి ఆసియా క్రీడలు వచ్చే ఏడాది సెప్టెంబరు-అక్టోబరులో జపాన్‌లోని నగోయాలో జరగనున్నాయి. ఆ క్రీడల్లో కూడా మెరుగైన ప్రదర్శన చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో సురేఖ తెలిపింది.

హైదరాబాద్ విజయం

జాధవ్‌పూర్: సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నమెంట్‌లో హైదరాబాద్ విజయం సాధించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 5 వికెట్లతో మధ్యప్రదేశ్‌ను ఓడించింది. మొదట మధ్యప్రదేశ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 144 పరుగులు చేసింది. కెప్టెన్ మిలింద్ 3 వికెట్లు పడగొట్టగా, అర్ఫాజ్ అహ్మద్, రక్షణ్ రెడ్డి చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో రాహుల్ బుద్ధి (59 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకోవడంతో హైదరాబాద్ 18.1 ఓవర్లలోనే 145/5 స్కోరు చేసి గెలిచింది.

50 వేల కోట్ల విద్యుత్తు

కుంభకోణానికి తెరలేపారు

రామగుండం, పాల్వంచ, మక్తల్ పవర్ ప్లాంట్లలో భారీ అవినీతి

- వాటాల పంపకాల కోసమే క్యాబినెట్ సమావేశాల నిర్వహణ
- తెలంగాణ రాష్ట్రాన్ని అరాచకాలకు కేంద్రంగా మారుస్తున్నారు: హరీశ్



హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు తాజాగా రూ.50 వేల కోట్ల విద్యుత్తు కుంభకోణానికి తెరలేపిందని, ఇందులో 30-40శాతం మేర కమీషన్లు దండుకునేందుకు సీఎం, మంత్రులు వ్యూహం పన్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలన అవినీతి కంపుతో గాడి తప్పిందని విమర్శించారు. విధానపరమైన నిర్ణయాల కోసం నిర్వహించాల్సిన క్యాబినెట్ సమావేశాలను కాంగ్రెస్ సర్కారు వాటాల పంపకాల కోసమే నిర్వహిస్తోందని ఆరోపించారు. తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలకు కేంద్రంగా మారుస్తోందని, రేవంత్ నిర్ణయాల్లో ప్రజాప్రయోజనాలకన్నా ఆయన స్వప్రయోజనాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని విమర్శించారు. రేవంత్ ఏం మాట్లాడినా, ఏం చేసినా దాని వెనుక కమీషన్లు, స్కామ్‌లు ఉంటాయని మండిపడ్డారు. రూ.5లక్షల కోట్ల భూ కుంభకోణాన్ని ఇటీవల తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బయటపెట్టినా.. ప్రభుత్వం దానిపై సమాధానం కూడా చెప్పలేదన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం హరీశ్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న థర్మల్ విద్యుత్తును 40శాతానికి తగ్గిస్తామని విద్యుత్తు పాలసీ కాపీలోనే పేర్కొన్నారని, మొన్నటిదాకా థర్మల్ విద్యుదుత్పత్తి అవసరంలేదన్నవారే ఇప్పుడు థర్మల్ ప్రాజెక్టు అంశాన్ని ఎందుకు తెరమీదకు తెచ్చారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

బీఆర్ఎస్ నేతలను భయపెట్టే ప్రయత్నం

రామగుండం, పాల్వంచ, మక్తల్ పవర్ ప్లాంట్లలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ మూడు చోట్ల 2400 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు రూ.50 వేలకోట్లు అవసరం అని, అందులో రూ.10వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్సుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగతా రూ.40 వేల కోట్లను అప్పు రూపంలో ఎక్కడినుంచి తెస్తారని ప్రశ్నించారు. మంగళవారం క్యాబినెట్ భేటీలో రామగుండం, పాల్వంచ, మక్తల్‌లో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ప్రాజెక్టుకు సంబంధించిన నిర్ణయం తీసుకున్నారన్నారు. మెగావాట్ ఉత్పత్తికి 12.23 కోట్ల ఖర్చుతో మొత్తం 2400 మెగావాట్లు ఉత్పత్తి చేసేందుకు ఇప్పటికే ఎన్టీపీసీ డీపీఆర్ సిద్ధంచేసిందని.. అదే సమయంలో మెగావాట్ ఉత్పత్తికి 14కోట్లు అవుతాయని జెన్‌కో డీపీఆర్‌లో పేర్కొందని.. అప్పుడు ఎవరు తక్కువ ధరకు కోట్‌చేస్తే.. వారికి ప్రాజెక్టు అప్పగించాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా రేవంత్‌రెడ్డి భారీవ్యయంతో నిర్మించబోయే పవర్ ప్లాంట్ కాస్ట్ పర్ మెగావాట్‌కు రూ.14కోట్ల చొప్పున నిర్ణయించినట్లు తెలుస్తోందన్నారు. నల్లగొండ జిల్లా దామరచర్లలో 4వేల మెగావాట్ల పవర్ ప్లాంట్‌కు అప్పట్లో కేసీఆర్ సంకల్పిస్తే.. తమ ప్రాంతాన్ని కాలుష్య కాసారంగా మారుస్తున్నారని, తాము అధికారంలోకి వస్తే ఆ ప్రాజెక్టును ఆపేస్తామని నాడు ప్రతిపక్షంలో ఉన్న, ఇప్పటి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారని గుర్తుచేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమే థర్మల్ ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధమవుతుంటే ఎందుకు మాట్లాడంలేదో కోమటిరెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కారు దోపిడీ, స్కామ్‌లను తాము బయటపెడుతున్నప్పుడల్లా.. కేసులు వేస్తామని, జైల్లో పెడతామంటూ బీఆర్ఎస్ నేతలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజలకు తెలిసేలా


నిషేధిత భూములు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోనున్నారు. వాస్తవానికి సర్కారీ భూములు సంతలో సరుకుగా మారాయి. ప్రభుత్వ, అటవీ, వక్ఫ్, దేవాదాయ, పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం ప్రకారం గుర్తించిన భూములను అడ్డదిడ్డంగా అమ్ముకుంటున్నారు. దీనిని అడ్డుకునే వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడంతో క్రయ విక్రయాలు బహిరంగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ చట్టం-1908 సెక్షన్ 22(ఏ) కింద.. విక్రయించడానికి వీల్లేని భూముల జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం రెండు నెలల క్రితం ఆదేశాలిచ్చింది. దీంతో జిల్లా కలెక్టర్లు జాబితాను సిద్ధం చేశారు. అన్ని జిల్లాల నుంచి నిషేధిత భూముల వివరాలను ఏ, బీ, సీ, డీ, ఈ కేటగిరీలుగా విభజించి రిజిస్ట్రేషన్ శాఖ కోరిన ఫార్మాట్ ప్రకారం పంపారు. ఈ నెల 24 నాటికే జాబితాలు రిజిస్ట్రేషన్ శాఖకు అందాయి. అయితే చాలా చోట్ల తప్పులు దొర్లినట్లు గుర్తించిన కలెక్టర్లు.. మరోసారి సవరణ చేసి తుది జాబితాలను పంపుతామనడంతో మరో అవకాశం ఇచ్చారు. సవరణల అనంతరం ఈ నెలాఖరులోపు పూర్తి స్థాయిలో జిల్లాల వారీగా నిషేధిత భూముల రికార్డులు అందుబాటులోకి రానున్నాయి. డిసెంబరు 3 నుంచి ప్రజలు కూడా చూసుకునే వెసులుబాటు కలగనుంది.

హరీశ్ వ్యాఖ్యలు అసత్యాలు

- డిస్కమ్‌లను అప్పుల్లో ముంచింది బీఆర్ఎస్సే
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త డిస్కమ్ ఏర్పాటు అంశానికి సంబంధించి మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలు అసత్యాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. విద్యుత్ రంగంలో రాష్ట్రాన్ని నట్టేట ముంచిన బీఆర్ఎస్ దొంగలకు ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పారని, దాంతో మైండ్ దెబ్బతిని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ మధ్యలో ఉన్న ఇండస్ట్రియల్ జోన్‌లో పరిశ్రమల భూములను కన్వర్షన్‌కు ప్రభుత్వం జీవో ఇవ్వకముందే రూ.5 లక్షల కోట్ల కుంభకోణం అంటూ కేటీఆర్ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారని తుమ్మల పేర్కొన్నారు. ఇప్పుడు బావమరిది(కేటీఆర్) కంటే తానేం తక్కువ కాదన్నట్టు బావ(హరీశ్) రూ.50వేల కోట్ల కుంభకోణం అని మరో అబద్ధం ఎత్తుకున్నారని విమర్శించారు. ఏం మాట్లాడాలో తెలియక విద్యుత్ ప్లాంట్లలో అవినీతి అంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇష్టమొచ్చిన ధరలకు విద్యుత్ కొనుగోళ్లు చేసి, విచ్చలవిడిగా అవినీతికి పాల్పడి, తెలంగాణ డిస్కమ్‌లను రూ.90వేల కోట్ల అప్పుల్లో ముంచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తుమ్మల స్పష్టం చేశారు. అవసరం లేకపోయినా ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు పేరిట వేలకోట్ల ప్రజాధనాన్ని దోపిడీ చేశారని ఆరోపించారు. బొగ్గులేని దామరచర్లలో థర్మల్ పవర్ ప్లాంట్ కట్టి ప్రజలకు భారం.. నాయకులకు లాభం అనే కుట్రను అమలు చేశారన్నారు. భద్రాద్రిలో కాలం చెల్లిన టెక్నాలజీతో ప్లాంట్ నిర్మించి జెన్‌కోను దెబ్బతీశారన్నారు. దామరచర్లలో తమ సొంత ప్లాంట్లకు లాభం చేకూర్చేందుకు ఎన్టీపీసీ ప్లాంట్ ఆలస్యానికి కారణమైనది బీఆర్ఎస్సేనని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే ఒప్పందం చేసుకుని ఉంటే ఇప్పుడు 2,400 మెగావాట్ల విద్యుత్ రాష్ట్రానికి అందుబాటులో ఉండేదని తుమ్మల వెల్లడించారు. యాదాద్రి- భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ నిర్మాణాల్లో జరిగిన అవినీతిపై ప్రభుత్వం ఇప్పటికే జ్యుడిషియల్ కమిషన్‌తో న్యాయవిచారణ చేపట్టిందన్నారు. ఏ రోజైనా ఆ అవినీతి బయటపడుతుందన్న భయం బీఆర్ఎస్ నేతల్లో కనిపిస్తోందని, అందుకే ఏదో చెప్పి తప్పించుకునేందుకు హరీశ్ రావు ప్రయత్నిస్తున్నారని తుమ్మల తెలిపారు. కాంపిటీటివ్ బిడ్డింగ్‌లో ఫెయిల్ అయిన కంపెనీకి నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్ట్ ఇచ్చి, యూనిట్ విద్యుత్ రేటును రూ.9వరకు పెంచారని, బొగ్గు, నీటి వనరుల్లేని ప్రాంతంలో యాదాద్రి ప్లాంట్ నిర్మించి భారీ నష్టం కలిగించారని తుమ్మల పేర్కొన్నారు.

మా నీళ్లను లాక్కుపోతే..
మేం అడుక్కు తినాలా?

- వందేళ్ల నాటి కేటాయింపులను ఎలా కుదిస్తారు?
- నీటి కేటాయింపులు తగ్గిస్తే సంక్షోభమే
- కృష్ణా ట్రైబ్యునల్-2లో ఆంధ్రప్రదేశ్ వాదన

అమరావతి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): "వందేళ్ల కిందట కేటాయించిన నీటిని లాక్కుంటే మేము అడుక్కుతినాలా?" అని.. కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట ఏపీ తన వాదన వినిపించింది. కృష్ణా జలాల పునఃసమీక్షపై జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ సారథ్యంలోని కృష్ణా జలాల వివాద ట్రైబ్యునల్-2 విచారణలో రెండో రోజు బుధవారం ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు కొనసాగించారు. నీటి కేటాయింపులపై కృష్ణా ట్రైబ్యునల్-1, ట్రైబ్యునల్-2 ఇచ్చిన ఆదేశాలను మార్చేందుకు ఆస్కారమే లేదన్నారు. "రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు వ్యవసాయమే ఆధారంగా మారింది. కొత్త రాష్ట్రంగా చెబుతున్న తెలంగాణ ఇటు నదీ జలాల విషయంలోనూ, ఆర్థికంగానూ సంపూర్ణ పరిపుష్టి కలిగి ఉంది. ఆ రాష్ట్రానికి రాజధాని హైదరాబాద్, ప్రపంచశ్రేణి ఐటీ కంపెనీలు ఉన్నాయి. హైదరాబాద్ సహా తెలంగాణ జిల్లాలన్నింటిలోనూ వ్యవసాయంతో సహా పరిశ్రమలూ ఉండడంతో ఆర్థికంగా బలోపేతమవుతోంది. కానీ ఏపీకి రాజధానీ లేదు. పరిశ్రమలు కూడా లేవు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో రాజధాని నగరాన్ని నిర్మించుకోలేకపోయింది. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో మాకు ఉన్న నీటి కేటాయింపులను కూడా కుదిస్తే ఆర్థికంగా సంక్షోభంలోకి వెళ్లిపోతాం" అని ఆయన వివరించారు. తెలంగాణకు ఇలాంటి ఇబ్బందులేవీ లేవన్నారు. కృష్ణా జలాల గురించి మాట్లాడుతున్న తెలంగాణ.. గోదావరి జలాల గురించి పూర్తిగా దాస్తోందని తెలిపారు. రెండు నదుల జలాలనూ కలిపి చూస్తే తెలంగాణకు నీటికి లోటే లేదన్నారు. రాష్ట్ర విభజన జరిగాక చిన్న, మధ్యతరహా ప్రాజెక్టులకు ట్రైబ్యునళ్లు కేటాయించిన నీటిని పునఃసమీక్షించేందుకు వీల్లేదని గుప్తా వాదించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో గత కేటాయింపులను మార్చేందుకు వీల్లేదన్నారు. "రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్‌లో అంతర్జాతీయ ఐటీ సంస్థలన్నీ పెట్టుబడులు పెట్టాయి. ఆర్థికంగా సుసంపన్నమైన హైదరాబాద్ రాజధానిగా తెలంగాణలోనే ఉంది. ఏపీ ఆర్థిక లోటుతో ఉంది. అందువల్ల గతంలో ట్రైబ్యునళ్లు ఏపీ ప్రాజెక్టులకు కేటాయించిన నీటిలో కోత పెట్టడానికి ఎంత మాత్రం వీల్లేదు." అని వాదించారు. రాష్ట్ర విభజనకు ముందున్న ఉమ్మడి రిజర్వాయర్లకు కేటాయింపులు కుదించేందుకు వీల్లేదని పునరుద్ఘాటించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌తో పాటు పులిచింతల కూడా ఉమ్మడి ప్రాజెక్టుల పరిధిలోకి వస్తుందన్నారు. ట్రైబ్యునల్ విచారణ గురువారం కూడా కొనసాగనుంది.

అయోధ్య రామాలయానికి 'మిధాని' కిటికీలు

- 31 టైటానియం కిటికీలు అందించిన హైదరాబాద్ సంస్థ


టైటానియం కిటికీ

సంతోష్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ మిధాని(మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్) అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయానికి అవసరమైన కిటికీలను ప్రత్యేకంగా తయారు చేసి అందజేసింది. కిటికీలు తుప్పుపట్టకుండా సుదీర్ఘ కాలం నిలిచేలా ఉండేందుకు టైటానియం లోహంతో వాటిని తయారు చేసింది. అయోధ్య ఆలయ అవసరాలకు అనుగుణంగా బంగారు వర్ణంలో ప్రత్యేకంగా డిజైన్ చేసి టైటానియంతో తయారు చేసిన 31 కిటికీలను అందించామని మిధాని అధికారులు వెల్లడించారు. వాణిజ్య అవసరాలకు కాకుండా నిర్మాణ అవసరాలకు టైటానియం ఉపయోగించిన దేశంలోని మొదటి సంస్థగా మిధాని నిలిచిందని ప్రకటించారు.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి

- రాజ్యాంగంలో వెసులుబాటు వల్లే తెలంగాణ ఏర్పడింది
- రాజ్యాంగ దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వ్యాఖ్య
- రాజ్యాంగ విలువలను ఆచరించాలి
- హైకోర్టు సీజే అపరేశ్‌కుమార్ సింగ్


హైకోర్టులో రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలకు అనుగుణంగా జీవనం కొనసాగించడానికి వీలుగా ప్రతి ఒక్కరూ రాజ్యాంగం గురించి తెలుసుకోవాలని, ఇందులో భాగంగానే ప్రధాని మోదీ కేవైసీ(రాజ్యాంగాన్ని తెలుసుకుందాం:నో యువర్ కాన్‌స్టిట్యూషన్) మంత్రాన్ని యువతకు అందజేశారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. రాజ్యాంగంలో ఉన్న వెసులుబాటు ఆధారంగానే తెలంగాణ ఏర్పాటైందని, జాతీయ సమగ్రత ఏ మాత్రం దెబ్బతినకుండా ప్రాంతీయ ఆకాంక్షలను గుర్తించే విధంగా రాజ్యాంగం అవకాశాలు కల్పించందని చెప్పారు. హైకోర్టులో బుధవారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించారని, ఇది భారతీయులందరూ వేడుక చేసుకోవాల్సిన శుభదినమని అన్నారు. దాదాపు మూడేళ్లపాటు శ్రమించి ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగాన్ని అప్పటి నిర్మాతలు మనకు అందించారని పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అలుపెరుగని పోరాటం చేశారని ఆయన కొనియాడారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ మేధస్సు, నైతిక ధైర్యం, న్యాయంపై అచంచలమైన నిబద్ధతతో రూపుదిద్దుకున్న రాజ్యాంగం చట్టపరమైన పత్రం మాత్రమే కాదని, సామాజిక మార్పు కోసం ఒక పరివర్తన చార్ట్ అని పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తి కోర్టు గదులకే పరిమితం కాకూడదని, ఇది ప్రతి వ్యక్తి, ప్రతి సమాజం, ప్రతి ఇంటిని చేరుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పౌరులందరూ రాజ్యాంగ విలువలను అర్థం చేసుకుని, ఆచరించినప్పుడే దాని ఉద్దేశం సాకారమవుతుందన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు, ఏజీపీ సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ ఛైర్మన్ నరసింహారెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డి, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఎ.జగన్ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌లిస్టు ఏజెన్సీకి డయాలసిస్ టెండరు

తప్పుడు ధ్రువపత్రంతో దొరికిపోయిన ఏజెన్సీ.. ఐదేళ్ల పాటు నిషేధించిన ఢిల్లీ ప్రభుత్వం

- సర్కారీ టెండర్లలో పాల్గొనాలంటే నిషేధిత జాబితాలో ఉండొద్దు
- అయినా రాష్ట్రంలో ఆ ఏజెన్సీకి కాంట్రాక్టు
- వైద్యశాఖ ఉన్నతాధికారులు కుమ్మక్కు
- వెలుగులోకి వస్తున్న అక్రమాలు



హైదరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లో పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) పద్ధతిలో డయాలసిస్ సేవలందిస్తున్న ఏజెన్సీల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం మూడు ఏజెన్సీలు కిడ్నీ బాధితులకు రక్తశుద్ధి సేవలందిస్తున్నాయి. ఇందులో ఒక ఏజెన్సీ ఎంపికలో నిబంధనలను ఉల్లంఘించినట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాల ద్వారా తెలిసింది. బ్లాక్ లిస్టులో ఉన్న సదరు ఏజెన్సీకి తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాలభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) కాంట్రాక్టు కట్టబెట్టింది. 2022లో ఇది జరిగింది. ఈ విషయం నాటి ఆరోగ్యశ్రీ, టీజీఎంఎస్ఐడీసీ అధికారులకు తెలిసినా కాసుల కోసం కక్కుర్తి పడి టెండర్ల ప్రక్రియలో సదరు సంస్థ పాల్గొనేలా చూసుకున్నారు. నిబంధనల మేరకు ప్రభుత్వం పిలిచే ఏ టెండర్‌లోనైనా పాల్గొనే ఏజెన్సీలు బ్లాక్‌లిస్టులో ఉండకూడదు. ఏదైనా ఏజెన్సీని బ్లాక్‌లిస్టులో పెడితే నిషేధ కాలం ముగిసేవరకు ఆ ఏజెన్సీ ఏ ప్రభుత్వ టెండర్లలో పాల్గొనకూడదనే నిబంధన ఉంది. దీన్ని తెలంగాణ వైద్యారోగ్య శాఖ తుంగలోకి తొక్కి సదరు సంస్థకు డయాలసిస్ బాధ్యతలను అప్పగించింది.

బ్లాక్‌లిస్టులో ఎందుకు పెట్టారంటే..

ఢిల్లీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ సేవలు అందించేందుకు 2022లో పిలిచిన టెండర్ ప్రక్రియలో ఆ ఏజెన్సీ పాల్గొంది. టెండర్ నిబంధనల ప్రకారం బిడ్డర్లు తప్పనిసరిగా సంబంధిత అధికారుల సంతకంతో పనితీరు ధ్రువపత్రం సమర్పించాలి. అయితే ఆ ఏజెన్సీ ఫోర్జరీ ధ్రువపత్రం సమర్పించింది. దానిలో ఫైల్, డిస్పాచ్ నంబర్లు, జారీ చేసిన అధికారి పేరు లేదు. దీనిపై ఢిల్లీ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) అనుమానం వ్యక్తం చేసింది. వెంటనే ఉత్తరప్రదేశ్ ఆరోగ్య శాఖకు లేఖ రాసి, ఆ సర్టిఫికెట్ ప్రామాణికతను పరిశీలించింది. యూపీ అధికారుల విచారణలో ఆ ధ్రువపత్రం నకిలీదని తేలింది. అది తమ జాయింట్ డైరెక్టర్ (మెడికల్ కేర్) కార్యాలయం నుంచి ఇవ్వలేదని తెలిపింది. దీంతో ఢిల్లీ డీజీహెచ్ఎస్ ఆ ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేసింది. దానికి ఆ సంస్థ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగాను, ఆమోదయోగ్యంగానూ లేదని ఢిల్లీ డీజీహెచ్ఎస్ పేర్కొంది. దీంతో ఐదేళ్ల పాటు ఆ ఏజెన్సీని బ్లాక్ లిస్టులో పెడుతున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాని కాపీని దేశంలోని ఇతర రాష్ట్రాలకు పంపింది. తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఈ వ్యవహారమంతా తెలిసి కూడా సదరు ఏజెన్సీని టెండరులో పాల్గొనేలా చేసి, కాంట్రాక్టు కట్టబెట్టారు.

అంతా పైవాళ్లే చూస్తారు!

రాష్ట్రంలో 98 డయాలసిస్ కేంద్రాలు ఉండగా, మూడు ఏజెన్సీలకు వాటి నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఒక సంస్థకు 28, మరోదానికి 43, మూడో ఏజెన్సీకి 27 కేంద్రాలను అప్పగించారు. ఈ కేంద్రాలపై సరైన పర్యవేక్షణ ఉండటం లేదు. జిల్లా సమన్వయకర్తలు (డీసీలు), జిల్లా మేనేజర్ల (డీఎంలు) పరిధిలోని టీమ్ లీడర్లు ఈ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించి.. నివేదికలు పంపాలి. ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలో రాష్ట్రస్థాయి జనరల్ మేనేజర్ దీన్ని పర్యవేక్షించాలి. కానీ ఇందుకు పూర్తి విరుద్ధంగా జరుగుతున్నట్లు క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఈ కేంద్రాల పరిశీలన, తనిఖీలు జిల్లాస్థాయిలో పనిచేసేవారికి బదులు ఆరోగ్యశ్రీ ట్రస్టు కార్యాలయంలోని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లే చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన కార్యాలయం నుంచే డయాలసిస్ కేంద్రాల తనిఖీలకు వెళ్లి నివేదికలు ఇస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. డయాలసిస్ సాఫ్ట్‌వేర్ అంశాలతో పాటు ఇతర వ్యవహారాలనూ ఆరోగ్యశ్రీలో డిప్యుటేషన్‌పై వచ్చిన ఓ అధికారే పర్యవేక్షిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నాలుగేళ్లకు పైగా సదరు అధికారి పాతుకుపోయి, అక్కడ మొత్తం వ్యవస్థను శాసిస్తున్నట్లు ఆరోగ్యశ్రీ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. ఎన్ని తీవ్ర ఆరోపణలు వచ్చినా తన పలుకుబడితో ఆరోగ్యశ్రీ ట్రస్టును ఏలుతున్నారని అంటున్నారు. ఎంతమంది సీఈవోలు మారినా సదరు అధికారిని మాత్రం కదపలేకపోయారని చెబుతున్నారు.

అయ్యప్ప భక్తులకు
ఆర్టీసీ ప్రత్యేక రాయితీ

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక రాయితీ ప్రకటించింది. శబరిమల యాత్రకు బస్సు బుక్ చేసుకుంటే ఒక గురుస్వామి, ఇద్దరు మణికంఠ స్వాములు, ఒక అటెండరు, ఇద్దరు వంటవారికి ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఒకటి కంటే ఎక్కువ బస్సులు బుక్ చేస్తే మరిన్ని అదనపు సదుపాయాలను కల్పిస్తామని సంస్థ ప్రకటించింది. పూర్తి సమాచారం కోసం స్థానిక డిపో మేనేజరు, లేదా ఆర్టీసీ కాల్ సెంటరు 040-69440000, 23450033 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

వరంగల్ నుంచి బెంగళూరుకు లహరీ ఏసీ

వరంగల్ నుంచి బెంగళూరు వెళ్లే ప్రయాణికుల కోసం లహరీ ఏసీ స్లీపర్ బస్సు సేవలను ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చింది. ఆర్టీసీ సేవలను ప్రయాణికులు వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

టీటీడీకి రూ.9 కోట్ల భారీ విరాళం

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): టీటీడీకి బుధవారం రూ.9 కోట్ల భారీ విరాళం అందింది. అమెరికాలో నివాసముంటున్న మంతెన రామలింగరాజు తన కుమార్తె మంతెన నేత్ర, అల్లుడు వంశీ గాదిరాజు పేరుపై ఈ విరాళాన్ని అందజేశారు. తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయాల (పీఏసీలు) ఆధునికీకరణకు ఈ మొత్తం వినియోగిస్తారు. తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో దాతతో కలిసి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఎంపీ అప్పలనాయుడు మీడియాకు ఈ వివరాలు తెలిపారు. 2012లో కూడా టీటీడీకి మంతెన రామలింగరాజు రూ.16.06 కోట్లు విరాళంగా ఇచ్చారని తెలిపారు. రామలింగరాజు మాట్లాడుతూ, తిరుమలతో తమ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన ఇద్దరు తాతలతో పాటు చిన్నాన్న కనుమూరి బాపిరాజు టీటీడీ బోర్డు ఛైర్మన్లుగా పనిచేశారని చెప్పారు.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,27,910 ▲	1,17,250 ▲	1,76,000 ▲
విజయవాడ	1,30,000 ▲	1,21,000 ▲	1,64,000 ▲
విశాఖపట్నం	1,30,000 ▲	1,14,700 ▼	1,76,000 ▲
రాజమండ్రి	1,27,910 ▲	1,17,250 ▲	1,61,000 ▲
ప్రొద్దుటూరు	1,25,900 ▲	1,15,830 ▲	1,63,000 ▲
ముంబై	1,26,080 ▲	1,15,940 ▲	1,59,025 ▲

భారత మార్కెట్లోకి 'రెడ్ రాక్ డెలీ' చిప్స్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ చిప్స్ బ్రాండ్ 'రెడ్ రాక్ డెలీ'ని పెప్సికో భారత్ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. కెటిల్ కుక్డ్, బేక్డ్, పాప్డ్ వంటి మూడు విభిన్న పద్ధతుల్లో దేశీయంగానే ఉత్పత్తి చేస్తూ, భారతీయ అభిరుచులకు అనుగుణంగా వివిధ ఫ్లేవర్లలో ఈ చిప్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పెప్సికో ఇండియా ఫుడ్స్ చీఫ్ మార్కెటింగ్ అధికారి సాక్షి వర్మ మీనన్ తెలిపారు. ఈ చిప్స్ ప్రస్తుతం ప్రముఖ క్విక్ కామర్స్ వేదికల్లో అందుబాటులో ఉంటాయని, స్థానిక రుచులతో మేళవిస్తూ యువ వినియోగదారులకు భిన్నమైన స్నాకింగ్ అనుభవాన్ని అందించడంపై దృష్టి సారిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

మార్కెట్లో ఫెడ్ జోష్



రేట్ల తగ్గుదల ఆశలతో పోటెత్తిన కొనుగోళ్లు

- సెన్సెక్స్ 1,022 పాయింట్లు అప్
- రూ.5.51 లక్షల కోట్ల సంపద వృద్ధి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస నష్టాలకు తెరపడింది. బుధవారం ట్రేడింగ్‌లో మదుపరులు కొనుగోళ్లు పోటెత్తించడంతో ఈక్విటీ సూచీలు భారీగా లాభపడ్డాయి. సెన్సెక్స్ ఏకంగా 1,022.50 పాయింట్లు ఎగబాకి 85,609.51 వద్దకు చేరింది. నిఫ్టీ 320.50 పాయింట్ల వృద్ధితో 26,205.30 వద్ద స్థిరపడింది. ఆల్‌టైం రికార్డు ముగింపు స్థాయికి సూచీ కేవలం 10 పాయింట్ల దూరంలో ఉంది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వచ్చేనెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు ఊపందుకోవడంతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన ఈక్విటీ సూచీలూ పరుగులు తీశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడులు, రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం త్వరలోనే కుదరవచ్చన్న అంచనాలు, ముడిచమురు ధరల తగ్గుదల వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయని విశ్లేషకులు పేర్కొన్నారు. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.5.51 లక్షల కోట్లు పెరిగి రూ.474.92 లక్షల కోట్లకు చేరింది.

- సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ మినహా అన్నీ రాణించాయి. బజాజ్ ఫిన్‌సర్వ్ షేరు 2.63 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.32%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.23% వృద్ధి చెందాయి. రంగాల వారీ సూచీల్లో టెలికాం మినహా అన్నీ లాభపడ్డాయి.
- విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.4,778.03 కోట్లు, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు(డీఐఐ) రూ.6,247.93 కోట్ల నికర కొనుగోళ్లు జరిపారు.

బంగారం.. 2 వారాల గరిష్ఠం

దేశీయంగా బంగారం ధరలు దాదాపు 2 వారాల గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల లోహం రేటు 10 గ్రాములపై రూ.1,200 పెరిగి రూ.1,30,100కు చేరింది. 99.5% స్వచ్ఛత లోహం కూడా అదే స్థాయిలో పెరిగి రూ.1,29,500గా నమోదైంది. కిలో వెండి సైతం రూ.2,300 ఎగబాకి రూ.1,63,100 ధర పలికింది. అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 0.81% వృద్ధితో 4,164 డాలర్లకు, సిల్వర్ 1.71% పెరిగి 52.37 డాలర్లకు చేరాయి.

కెనరా బ్యాంక్ రూ.3,500 కోట్ల సమీకరణ

బాసెల్-3 ప్రమాణాలతో కూడిన అడిషనల్ టైర్-1 (ఏటీ1) బాండ్ల జారీ ద్వారా రూ.3,500 కోట్లు సమీకరించనున్నట్లు ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ బుధవారం ప్రకటించింది. మూలధన నిల్వలను పెంచుకోవడంతోపాటు భవిష్యత్ వృద్ధి ప్రణాళికలకు తోడ్పడేందుకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు బ్యాంక్ తెలిపింది.

రిలయన్స్ @ రూ.21 లక్షల కోట్లు

రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ తొలిసారిగా రూ.21 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఒకదశలో 2 శాతానికి పైగా పెరిగి రూ.1,571.80 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 1.99% లాభంతో రూ.1,569.75 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.21,24,259.89 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రిలయన్స్ షేరు 29 శాతానికి పైగా పెరిగింది.

ఎంసీఎక్స్ షేరు రూ.10,000

ఎంసీఎక్స్ షేరు ధర తొలిసారిగా రూ.10,000 మార్క్‌ను దాటేసింది. బీఎస్ఈలో షేరు ధర ఏకంగా 4.08% వృద్ధి చెంది రూ.10,274.60 వద్ద ముగిసింది. ఈ షేరు లాభపడటం ఇది వరుసగా మూడో రోజు. ఈ ఏడాది మార్చిలో రూ.4,408 వద్ద ఏడాది కనిష్ఠాన్ని నమోదు చేసిన ఎంసీఎక్స్ షేరు.. గడిచిన 8 నెలల్లో 132% శాతం వృద్ధి చెందడం విశేషం.

వడ్డీ రేట్లు తగ్గినా బేఫికర్

- మా లాభాలకు ఢోకా ఉండదు
- పావు శాతం వరకు తగ్గనున్న 'రెపో'
- ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి



న్యూఢిల్లీ: ఆర్‌బీఐ కీలక రెపోరేటు మరో పావు శాతం తగ్గించినా తమ నికర వడ్డీ లాభాలకు ఢోకా ఉండదని ఎస్‌బీఐ భావిస్తోంది. బ్యాంకు ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం చెప్పారు. సెప్టెంబరు త్రైమాసికానికి 2.97 శాతంగా ఉన్న తమ నికర వడ్డీ లాభం శాతం వచ్చే ఏడాది మార్చి మూడు శాతానికి చేరుతుందని భావిస్తున్నట్టు ఎస్‌బీఐ చీఫ్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మొత్తానికి చూసినా జీడీపీ వృద్ధిరేటు ఏడు శాతానికి పైనే ఉండవచ్చునన్నారు.

మారిన వైఖరి : నిజానికి డిసెంబరు 5న ముగిసే ఎంపీసీ భేటీలో ఆర్‌బీఐ కీలక రెపోరేటు జోలికి పోకపోవచ్చని ఎస్‌బీఐ నిన్న మొన్నటి వరకు భావించింది. ఆర్‌బీఐ కూడా ఇవే సంకేతాలు ఇచ్చింది. అయితే అక్టోబరు నెల రిటైల్ ద్రవ్యోల్బణం పావు శాతానికి పడిపోయిన నేపథ్యంలో డిసెంబరు 5న ముగిసే భేటీలోనూ రెపోరేటు మరింత కుదించే అవకాశం ఉందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఇటీవల సూచనప్రాయంగా వెల్లడించారు. ఈ తగ్గింపు పావు శాతం వరకు ఉంటుందని ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి చెప్పారు.

కలిసి రానున్న అంశాలు : ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు బ్యాంకులు తన ఆర్‌బీఐ వద్ద ఉంచాల్సిన నగదు నిల్వల నిష్పత్తిని (సీఆర్ఆర్) ఒక శాతం వరకు తగ్గించింది. దీంతో బ్యాంకుల వద్ద నిధుల లభ్యత పెరిగి వడ్డీ ఆదాయం పెరుగుతోంది. దీనికి తోడు అధిక వడ్డీరేటుతో తీసుకున్న డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేట్లను బ్యాంకు తగ్గిస్తోంది. ఎస్‌బీ ఖాతాలపై చెల్లించే వడ్డీరేటునీ ఎస్‌బీఐ 0.2% తగ్గించింది. ఇవన్నీ తమ నికర వడ్డీ లాభాలను పెంచుతాయని శ్రీనివాసులు శెట్టి చెప్పారు.

హెచ్‌పీలో 2028లోగా 6,000 జాబ్స్ ఔట్

న్యూయార్క్: టెక్ ఉద్యోగాల్లో కోతల పర్వం కొనసాగుతోంది. వచ్చే మూడేళ్లలో నాలుగు వేల నుంచి ఆరు వేల మంది ఉద్యోగులను తీసివేయనున్నట్టు పర్సనల్ కంప్యూటర్ల (పీసీ) తయారీ సంస్థ హెచ్‌పీ ఇంక్ ప్రకటించింది. దీని వల్ల 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,900 కోట్లు) వరకు ఆదా అవుతాయని కంపెనీ సీఈఓ ఎన్‌రిక్ లోరెస్ ప్రకటించారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఇంటర్నల్ ఆపరేషన్స్, కస్టమర్ సపోర్ట్ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులపై ఈ కోతల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావమే ఇందుకు కారణమన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ హెచ్‌పీ కంపెనీ 1,000 నుంచి 2,000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది.

షేర్ సర్టిఫికెట్లు పోగొట్టుకున్నారా?

డూప్లికేట్ కాపీలు పొందడం ఇక ఈజీ ● నిబంధనలను సడలించనున్న సెబీ

ముంబై: షేర్లు, బాండ్లు, మ్యూచువల్ ఫండ్ పథకాలు వంటి సెక్యూరిటీల సర్టిఫికెట్లను పోగొట్టుకున్నారా..? వాటి డూప్లికేట్ కాపీలను ఇకపై సులభంగా, తక్కువ ఖర్చుతో పొందేలా నిబంధనలను సడలించాలని సెబీ భావిస్తోంది. డూప్లికేట్ సెక్యూరిటీ సర్టిఫికెట్ల జారీకి ఒకే రకమైన ఫారాలను ప్రతిపాదించింది. అంతేకాదు, పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ ఫైల్ చేయడం, పత్రికల్లో ప్రకటన జారీ చేయాల్సిన అవసరం లేకుండా డూప్లికేట్ సర్టిఫికెట్ల జారీ చేయగలిగే పరిమితిని ప్రస్తుతమున్న రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని కూడా సెబీ ప్రతిపాదించింది. అంతేకాదు, నకిలీ కాపీల కోసం దరఖాస్తు చేసే సమయంలో అఫిడవిట్‌తోపాటు ఇండెమ్నిటీ బాండ్‌ను కూడా జతచేసే అవసరానికి స్వస్తి పలికి అఫిడవిట్ కమ్ ఇండెమ్నిటీ బాండ్‌ను సమర్పిస్తే చాలని సెబీ అంటోంది. వీటిపై డిసెంబరు 16లోగా అభిప్రాయాలు తెలుపాల్సిందిగా ప్రజలను కోరింది.

ప్రస్తుత నిబంధనలు ఇలా..

సెబీ తాజా సర్క్యులర్ ప్రకారం.. ప్రస్తుతం డూప్లికేట్ సెక్యూరిటీల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మూడు దశల ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. ఇందుకు మదుపరి ఎఫ్ఐఆర్/ పోలీస్ స్టేషన్‌లో సమర్పించిన ఫిర్యాదు కాపీ/ కోర్టు ఇంజక్షన్ ఆర్డరు/పోగొట్టుకున్న సెక్యూరిటీల వివరాలతో కూడిన ఫిర్యాదు కాపీని సమర్పించాల్సి ఉంటుంది. అలాగే, పోయిన సెక్యూరిటీ సర్టిఫికెట్ల విషయమై ఏదైనా వార్తా పత్రిక ద్వారా ప్రకటన కూడా జారీ చేయాలి. ఆ తర్వాత మదుపరి అఫిడవిట్, ఇండెమ్నిటీ బాండ్‌ను విడివిడిగా సెబీ నిర్దేశిత ఫార్మాట్‌లో సమర్పించాల్సి ఉంటుంది. అయితే, దరఖాస్తు సమర్పించేనాటికి ఆ సర్టిఫికెట్ల విలువ రూ.5 లక్షలకు మించని పక్షంలో ఎఫ్ఐఆర్ సమర్పించడం, పత్రికలో ప్రకటన జారీ చేయాల్సిన అవసరం లేదు.

పెట్టుబడి సలహాదారులు, రీసెర్చ్ అనలిస్టులకు
విద్యార్హత నిబంధనల సడలింపు

పెట్టుబడి సలహాదారులు, రీసెర్చ్ అనలిస్ట్‌లకు విద్యార్హత నిబంధనలను సెబీ సడలించింది. ఏ డిగ్రీ అభ్యర్థి అయినా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించింది. అయినప్పటికీ, ఎన్ఐఎస్ఎం సర్టిఫికేషన్ పరీక్షలో ఉత్తీర్ణులవడం మాత్రం తప్పనిసరని మంగళవారం విడుదల చేసిన నోటిఫికేషన్లలో స్పష్టం చేసింది. ప్రస్తుతం ఫైనాన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కామర్స్, ఎకనామిక్స్, క్యాపిటల్ మార్కెట్లు వంటి ఆర్థిక సంబంధిత రంగాల్లో డిగ్రీ లేదా మాస్టర్ డిగ్రీ పూర్తి చేసినవారు మాత్రమే ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు లేదా రీసెర్చ్ అనలిస్ట్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

హరిత పెట్టుబడులతో 2047 నాటికి 4.8 కోట్ల కొలువులు

న్యూఢిల్లీ: పర్యావరణ పరిరక్షణకు ఉపకరించే పెట్టుబడులు మన ఆర్థిక వ్యవస్థకు కూడా పెద్ద ఊతం కానున్నాయి. 2047 నాటికి ఈ రంగంలోకి వచ్చే 4.1 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.364.9 లక్షల కోట్లు) పెట్టుబడులతో సుమారు 4.8 కోట్ల పూర్తి స్థాయి ఉద్యోగాలు ఏర్పడనున్నాయి. ఇంధన, పర్యావరణ, జల మండలి (సీఈఈడబ్ల్యు) ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. దీంతో 2047 నాటికి దేశంలో పర్యావరణ హిత వస్తువుల మార్కెట్ కూడా 110 లక్షల డాలర్లకు (సుమారు రూ.97.9 లక్షల కోట్లు) చేరుతుందని అంచనా వేసింది. శిలాజ ఇంధనాల నుంచి హరిత ఇంధనాలకు మారడం, పునరుత్పాదక విధానాలు, ప్రకృతి ఆధారిత ఉత్పత్తులు వంటి రంగాల్లో భారత్‌లో భారీ అవకాశాలు ఉన్నట్టు సీఈఈడబ్ల్యు తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	650	విజయవాడ	660
వరంగల్	652	గోదావరి	645
చిత్తూరు	673	విశాఖపట్నం	635
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	103
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	98
కర్నూలు	100	నెల్లూరు	103
విశాఖపట్నం	100	అనంతపురం	103
గోదావరి	103		

ద్రవ్యోల్బణ అంచనాల్లో పక్షపాతం లేదు

ముంబై: ద్రవ్యోల్బణ అంచనాల్లో తమకు ఎలాంటి వ్యవస్థాగత పక్షపాతం లేదని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ పూనం గుప్తా స్పష్టం చేశారు. నిపుణులతో చర్చలు, అనేక నమూనాల ఆధారంగా ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ అంచనాలు వెలువడరిస్తుంటుందన్నారు. అయితే అంతర్జాతీయ పరిణామాల కారణంగా కొన్ని సార్లు తమ అంచనాలు తప్పుతాయన్నారు.

కస్టమర్ల ముంగిట్లోనే చార్జింగ్ స్టేషన్లు

టెస్లా ఇండియా జీఎం

న్యూఢిల్లీ: ఖాతాదారుల జీవన శైలికి చేరువలోనే చార్జింగ్ స్టేషన్ల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయబోతున్నట్లు ఈవీ కార్ల దిగ్గజం టెస్లా ఇండియా జీఎం శరద్ అగర్వాల్ వెల్లడించారు. ఈవీ వాహనదారులు టిఫిన్లు, భోజనాలు చేసే ప్రదేశాలు, పని చేసే ప్రాంతాలు, విశ్రాంతి తీసుకునే ప్రాంతాల్లో సూపర్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఢిల్లీ, ముంబై నగరాల్లో ఇప్పటికే ఈ పని ప్రారంభించినట్లు తెలిపారు. మిగతా నగరాల విషయంలోనూ తమ వైఖరి ఇలానే ఉంటుందన్నారు. అవసరమైతే ఖాతాదారుల ఇంటి వద్ద కూడా చార్జింగ్ సేవలు అందిస్తామన్నారు.

మెడికల్ టూరిజం క్యాపిటల్‌గా హైదరాబాద్

» ఈశాన్య రాష్ట్రాలకు సహకారం అందిస్తాం: దామోదర

హైదరాబాద్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగానికి సంబంధించి తెలంగాణ ప్రత్యేక హబ్‌గా నిలుస్తోందని, హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం క్యాపిటల్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. తెలంగాణ -నార్త్ ఈస్ట్ కనెక్ట్‌లో భాగంగా రాజ్‌భవన్‌లో బుధవారం జరిగిన ఆరోగ్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈశాన్య రాష్ట్రాలతో.. బంధాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వైద్య సేవలు అందించేందుకు ఉస్మానియా నూతన హస్పిటల్, మూడు టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్‌లో హెల్త్ సిటీ నిర్మిస్తున్నామని దామోదర తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఐవీఎఫ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించి ఆరోగ్యపరంగా ఏ విధమైన సహకారం అయినా అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు.

ఆరోగ్యశ్రీ నుంచి డీఎంఈకి నేరుగా చెల్లింపులు

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలల బలోపేతం, నిర్వహణ కోసం నిధులను నేరుగా వైద్య విద్య సంచాలకుల కార్యాలయానికి (డీఎంఈ) విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జె. చోంగ్తు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వాస్పత్రులకు చెల్లించే మొత్తం నిధుల్లో 80 శాతం నేరుగా డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌కు బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మిగతా 20 శాతం నిధులను ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, వైద్య పరికరాల కొనుగోలు, నాణ్యమైన సేవలు అందించడానికి వినియోగించాలని నిర్ణయించింది. ఈ నిధుల విడుదల అంశంపై చర్యలు తీసుకోవాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్, ముఖ్య కార్యనిర్వహణ అధికారికి ప్రభుత్వ కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు.

ఆడబిడ్డలు సంతోషపడితే ఓర్వలేరా?

» ఇందిరమ్మ చీరలపై దుష్ప్రచారం తగదు: మంత్రి సీతక్క

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డలు, మహిళా సంఘాలు ఎంపిక చేసుకున్న డిజైన్లు, రంగులతోనే ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని మంత్రి సీతక్క అన్నారు. గత బీఆర్ఎస్ సర్కారులా సూరత్, దుబాయ్ నుంచి కిలోల లెక్కన తెచ్చిన చీరలు కావని, ఇవి సిరిసిల్ల నేతన్నలు స్వయంగా నేసినవని, ఈ విషయంలో అనుమానముంటే కేటీఆర్, హరీశ్‌రావు, కవిత సిరిసిల్లకు వెళ్లి తెలుసుకోవాలని సవాల్ విసిరారు. ఆడవాళ్ల సంతోషాన్ని చూసి కేటీఆర్, హరీశ్‌రావు ఓర్వలేక... దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ చీరలు బాగా లేవని మాట్లాడటం సిరిసిల్ల నేతన్నలను అవమానించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది క్రితమే 65 లక్షల చీరలకు ఆర్డర్ ఇచ్చామని, అందరికీ ఇచ్చేందుకు మరో 35 లక్షల చీరలకు ఆర్డర్ ఇచ్చినట్లు సీతక్క స్పష్టం చేశారు.

యాసంగికి 20 లక్షల క్వింటాళ్ల విత్తనాలు!

» వ్యవసాయ శాఖ విత్తన ప్రణాళిక ఖరారు

యాసంగి సీజన్ పంటల సాగుకు రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించింది. ఈ సీజన్లో 78.81 లక్షల ఎకరాలు(సుమారు 79 లక్షల ఎకరాల్లో) పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనాలు తయారు చేశారు. ఇందుకుగాను 19,66,220 క్వింటాళ్ల విత్తనాలు (సుమారు 20 లక్షల క్వింటాళ్లు) అవసరమవుతాయని ప్రణాళికలో పేర్కొన్నారు. ఇందులో సింహభాగం ప్రైవేటు విత్తన సరఫరా కాగా, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా 1.28 లక్షల క్వింటాళ్లు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. యాసంగిలో 63.20 లక్షల ఎకరాల్లో వరి, 15.61 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగవుతాయని పేర్కొన్నారు.

నెలాఖరులోగా జనగణన ప్రీ టెస్ట్ పూర్తవ్వాలి

» జనగణన సంచాలకురాలు భారతి హోళికేరి

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జనగణన-2027కు సంబంధించిన ప్రీ-టెస్ట్‌ను ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకురాలు భారతి హోళికేరి అధికారులను ఆదేశించారు. బుధవారం జీహెచ్ఎంసీ పరిధిలోని రామచంద్రాపురంలో పర్యటించి జనగణన ప్రీ-టెస్ట్ జరుగుతున్న తీరును సమీక్షించారు. డేటా సేకరణలో అనుసరిస్తున్న విధానాలు, క్షేత్రస్థాయి పురోగతిని తెలుసుకుని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లతో మాట్లాడారు.

రైల్వే టికెట్ బుకింగ్‌లో సాంకేతిక లోపం

» టికెట్లపై తప్పుడు సమయం.. 29 మంది అవస్థలు

బర్కత్ పుర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైల్వే టికెట్ బుకింగ్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా ప్రయాణికులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి మధురై ఎక్స్‌ప్రెస్ బుధవారం ఉదయం 10.49 గంటలకు బయలు దేరుతుంది. గత నెలలో ఈ రైలు టికెట్ బుక్ చేసుకున్న 29 మందికి ప్రయాణికులకు మాత్రం రైలు బయలు దేరే సమయం 12.45 గంటలుగా చూపించింది. ప్రయాణికులు అదే సమయానికి స్టేషన్ కు చేరుకోవడంతో అప్పటికే రైలు వెళ్లిపోయింది. దీంతో అసహనానికి గురైన ప్రయాణికులు.. అధికారులను నిలదీశారు. అధికారులు స్పందించి ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రైల్వే సర్వీసును ఏర్పాటు చేయడంతో వివాదం సద్దుమణిగింది.

గంజాయి మత్తులో దారుణం

» ఏడేళ్ల బాలుడిపై ముగ్గురు యువకుల లైంగిక దాడి

సైదాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో ఏడేళ్ల బాలుడిపై ముగ్గురు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడిన దారుణ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఓ బస్తీలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న దంపతులకు కుమారుడు (7), కూతురు ఉన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న బాలుడికి జ్వరం రావడంతో సోమవారం పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడు. మధ్యాహ్న సమయంలో బాలుడి ఇంటికి వద్దకు స్థానికంగా ఉండే ఓ యువకుడు వచ్చి తనతో వస్తే గాలిపటం, చాక్లెట్ ఇప్పిస్తానని చెప్పాడు. ఆశపడిన బాలుడు ఆ యువకుడి ఇంటికి వెళ్లాడు. అక్కడ మరో ఇద్దరు స్నేహితులున్నారు. గంజాయి మత్తులో ఉన్న వారంతా కలిసి బాలుడిని బాత్రూంలోకి తీసుకువెళ్లి అమానుషంగా సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. విషయం ఎవరికైనా చెబితే కొడతామని బాలుడిని బెదిరించారు. తర్వాత ఏడుస్తూ ఇంటికి వచ్చిన బాలుడిని తల్లి ఆరాతీయగా జరిగిన ఘోరం గురించి చెప్పాడు. బాలుడి తల్లి ఫిర్యాదుతో సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏజీ ఆఫీసులో 'కాగ్' ఆడిటింగ్ ఎక్స్‌లెన్స్ సెంటర్

» జవాబుదారీతనం పెంపునకే: కాగ్ సంజయ్‌మూర్తి

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) హైదరాబాద్‌లో ఫైనాన్షియల్ ఆడిట్ ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను (సీఓఈఎఫ్ఏ) ఏర్పాటు చేసింది. లక్డీకాపూల్‌లోని రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ (ఏజీ) కార్యాలయంలో ఇదివరకు ఉన్న రీజనల్ కెపాసిటీ బిల్డింగ్ అండ్ నాలెడ్జ్ ఇనిస్టిట్యూట్‌లో ఈ కేంద్రాన్ని భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కె.సంజయ్‌మూర్తి బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వరంగ సంస్థల్లోని ఆర్థిక లావాదేవీల ఆడిటింగ్‌లో మెరుగైన మార్పులను తీసుకురావడంతో పాటు, ప్రభుత్వ వ్యయంలో జవాబుదారీతనానికి, పారదర్శకతకు పెద్దపీట వేయడానికే ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి వైకుంఠద్వార దర్శనాలకు ఈ-డిప్

తిరుమల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరుగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి తొలి మూడురోజుల స్లాటెడ్ సర్వదర్శన (ఎస్ఎస్‌డీ) టోకెన్ల ఈ-డిప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం నుంచి ఐదురోజుల పాటు జరుగనుంది. డిసెంబరు 2వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు డిప్ ద్వారా ఎంపికైన భక్తులకు టోకెన్ల సమాచారాన్ని టీటీడీ పంపనుంది.




డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కుమారుడు సూర్య విక్రమాదిత్య-సాక్షి నిశ్చితార్థ వేడుక బుధవారం రాత్రి ప్రజాభవన్‌లో ఘనంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ హాజరై.. వారికి శుభాకాంక్షలు తెలిపారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ప్రధానమంత్రిని ఆహ్వానిద్దాం

వివిధ శాఖల కేంద్ర మంత్రులను కూడా.. ఆహ్వానితులకు లోటు లేకుండా ఏర్పాట్లు ఉండాలి

» మంత్రులు, అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి

» 'తెలంగాణ రైజింగ్'పై రెండో రోజు సమీక్ష

» మారుతున్న నేరాల తీరుకు అనుగుణంగా పోలీసులు నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలి

» నూతన ఐపీఎస్ ప్రొబేషనర్లకు సీఎం దిశానిర్దేశం

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీలో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, వివిధ శాఖల కేంద్ర మంత్రులను ఆహ్వానిద్దామని సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో అన్నారు. ఈ కార్యక్రమానికి దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖులను ఆహ్వానించాల్సి ఉంటుందని, వారి జాబితాను ముందస్తుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆహ్వానితులకు అనుగుణంగా ఎక్కడా లోటు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. సమ్మిట్‌లో పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదుర్చుకునే విషయంలో ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ రూపకల్పనపై బుధవారం రెండో రోజు పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 2,600 మంది ఆహ్వానితులకు ఇప్పటికే ఆహ్వానాలు అందించామని అధికారులు సీఎంకు తెలిపారు. సదస్సులో ఏర్పాటు చేసే స్టాళ్ల డిజైన్లను కూడా వివరించారు. దీంతో మౌలిక సదుపాయాలు, సంక్షేమం, పరిశ్రమలు, వైద్యంతోపాటు వివిధ విభాగాలకు చెందిన స్టాళ్ల ఏర్పాటు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు. విభాగాల వారీగా వివిధ అంశాలపై మాట్లాడేందుకు వక్తలను సిద్ధం చేయాలని, వారికి ఇచ్చే సమయాన్ని ముందుగానే నిర్ణయించాలని అన్నారు. ఈవెంట్ల వారీగా.. ఒక్కో ఈవెంట్‌కు ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారిని బాధ్యుడిగా నియమించాలన్నారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా డ్రోన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెలాఖరులోగా గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన అన్ని డిజైన్లను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై సమీక్షలో రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు

పోలీసు శాఖను ఆధునికీకరిస్తున్నాం..

సమాజంలో నేరాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో ప్రజల అంచనాలకు అనుగణంగా పోలీసు శాఖను ఆధునికీకరిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను వాడుతున్నందున పోలీసులు అందుకు దీటుగా తమ సాంకేతికతను పెంచుకోవాలన్నారు. తెలంగాణకు కేటాయించిన నలుగురు ఐపీఎస్ ప్రొబేషనర్లు ఆయేషా ఫాతిమా, మనీషా నెహ్రా, మందరె సోహన్ సునీల్, రాహుల్‌కాంత్ బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీసు అకాడమీ డైరక్టర్ అభిలాష్ బిష్త్ వారిని ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పోలీసింగ్‌పై తన లక్ష్యాలను వారితో పంచుకున్నారు. మాదక ద్రవ్యాలు, ఉగ్రవాద సంబంధిత కేసుల దర్యాప్తులో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. గుంపులను నియంత్రించడం, విపత్తులో వేగవంతమైన స్పందన అవసరమని, పౌరులతో మెరుగైన అవగాహన కోసం తెలుగులో మాట్లాడటం తప్పనిసరి అని పేర్కొన్నారు. తెలుగు భాషలో ప్రావీణ్యం సంపాదించుకోవాలని సూచించారు.

హైదరాబాద్.. ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్

(మొదటిపేజీ తరువాయి)

చెందిన ఎమ్88 మిలిటరీ ఇంజిన్ ఎంఆర్‌వోకు కూడా శంకుస్థాపన చేసుకున్నామన్నారు. ఈ ఎంఆర్‌వో భారత వైమానిక దళం, భారత నావికా దళానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

రాష్ట్రంలో ప్రపంచ ప్రధాన కంపెనీలు..

తెలంగాణలో 25 కంటే ఎక్కువ ప్రధాన ప్రపంచ కంపెనీలు, 1,500కు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయని సీఎం రేవంత్ అన్నారు. తమ ప్రగతిశీల పారిశ్రామిక విధానం, ఎంఎస్ఎంఈ విధానం దేశంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా నిలిచిందని చెప్పారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు ప్రముఖ ప్రపంచ కంపెనీల నుంచి అనేక భారీ పెట్టుబడులను ఆకర్షించాయన్నారు. సఫ్రాన్, బోయింగ్, ఎయిర్ బస్, టాటా, భారత్ ఫోర్జ్ వంటి సంస్థలు హైదరాబాద్‌ను తయారీ, పరిశోధన, అభివృద్ధి కోసం ఎంచుకున్నాయని వివరించారు. దేశంలోని ప్రముఖ ఎంఆర్‌వో, ఏరో ఇంజిన్ హబ్‌లలో హైదరాబాద్ ఒకటని సీఎం చెప్పారు.. ఏరోస్పేస్ పెట్టుబడులను ఆకర్షించడానికి నైపుణ్యం చాలా ముఖ్యమైన ప్రమాణమన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో తెలంగాణ 100 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసిందని తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ విమానాల నిర్వహణ కోసం ప్రత్యేక శిక్షణపై దృష్టి పెడుతోందన్నారు. 30 వేల ఎకరాల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు.

గ్లోబల్ సమ్మిట్‌కు అందరికీ ఆహ్వానం..

తమ విజన్‌ను ఆవిష్కరించడానికి డిసెంబరు 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు అందరినీ ఆహ్వానిస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. 2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నామని చెప్పారు. బెంగళూరు-హైదరాబాద్‌ను డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. సఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఏర్పాటు వల్ల భవిష్యత్తులో ఎయిర్ క్రాఫ్ట్‌ల తయారీ ఖర్చు భారీగా తగ్గుతుందన్నారు. దాంతో రాబోవు రోజుల్లో 15 బిలియన్ అమెరికన్ డాలర్ల వరకు విదేశీ మారక నిల్వలు పెంచుకోవచ్చని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏవియేషన్ రంగంలో దేశీయ సామర్థ్యాలకు సఫ్రాన్ పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వనుందన్నారు. భారత మార్కెట్‌లో ఎంఆర్‌వో మార్కెట్ 2031 నాటికి 4 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు. 8.9 శాతం వృద్ధిని నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, సఫ్రాన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భద్రతపై దృష్టి సారించండి

» కోడ్ ఉల్లంఘనులపై కేసులు పెట్టండి

» సమీక్షలో ఎన్నికల కమిషనర్ ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు విడతల్లో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నాహాలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, కమిషనర్లు, సీనియర్ పోలీసు, రెవెన్యూ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్‌లో పలు కీలక సూచనలు చేశారు. తొలిదశ ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ, కోడ్ అమలు, చెక్‌పోస్టుల ఏర్పాటు, సోషల్ మీడియాపై నిఘా తదితర అంశాలపై చర్చించారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి విద్వేషాలు చెలరేగకుండా పటిష్ఠ బందోబస్తును ఏర్పాటుచేయాలని, గతంలో ఎన్నికల నేరాల్లో పాల్గొన్న వారిని బైండోవర్ చేయించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయడం, నిఘా కొనసాగించడం అవసరమని ఆమె స్పష్టం చేశారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలు, పోలింగ్ స్టేషన్ల వద్ద భద్రత విషయంలో గట్టి చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు ఆమె సూచించారు. ఎన్నికల విధుల్లో నియమిస్తున్న సిబ్బందికి ముందస్తు శిక్షణ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కాగా, గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నిర్వహణ, ఇతరత్రా అంశాలపై ప్రజలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేయడం కోసం గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ఏర్పాటు చేశామని ఎన్నికల సంఘం కార్యదర్శి మకరంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్(టీఎస్ఈసీ.జీవోవీ.ఇన్) లోనికి వెళ్లి గ్రీవెన్స్ మాడ్యూల్‌పై క్లిక్ చేసి, ప్రజలు తమ నంబర్‌ను రిజిష్టర్ చేసుకుని తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చని సూచించారు.

బండి సంజయ్‌పై ఎన్నికల కమిషన్‌కు టీపీసీసీ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఆయా గ్రామాల అభివృద్ధికి రూ.10 లక్షల చొప్పున నిధులిస్తామని ప్రకటించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని టీపీసీసీ ఆరోపించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికి టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ పి.రాజేశ్‌కుమార్ ఫిర్యాదు చేశారు.

శత్రు డ్రోన్లపై 'ఇంద్రజాల్' అస్త్రం

దేశంలో మొట్టమొదటి యాంటీ డ్రోన్ గస్తీ వాహనం.. కృత్రిమ మేధ సాయంతో డ్రోన్లపై నిఘా

» శత్రు డ్రోన్‌గా తేలితే వెంటనే నిర్వీర్యం

» అభివృద్ధి చేసిన ఇంద్రజాల్ సంస్థ

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శత్రుదేశాల డ్రోన్లను ముందే గుర్తించి, వెంటాడి, వేటాడే అత్యాధునిక ఆయుధం అందుబాటులోకి వచ్చింది. మన దేశంలోనే మొట్టమొదటి 'యాంటీ డ్రోన్ పాట్రోల్ వెహికిల్ (ఏడీపీవీ)'ను హైదరాబాద్‌కు చెందిన ఇంద్రజాల్ డిఫెన్స్ సంస్థ బుధవారం ఆవిష్కరించింది. 'ఇంద్రజాల్ రేంజర్'గా పిలుస్తున్న ఈ వాహనంలోని వ్యవస్థలు కృత్రిమ మేధ ఆధారంగా స్వతంత్రంగా పనిచేస్తాయి. గస్తీ కాస్తున్న సమయంలోనే చుట్టూ పది కిలోమీటర్ల దూరంలోని డ్రోన్లపై నిఘా పెడుతాయి. శత్రుదేశాల డ్రోన్లను గుర్తించి, హ్యాకింగ్, జామింగ్ ద్వారా నిర్వీర్యం చేస్తాయి. సంప్రదాయ యాంటీ డ్రోన్ వ్యవస్థల కంటే ఆధునికంగా దీనిని అభివృద్ధి చేసినట్టు ఇంద్రజాల్ డిఫెన్స్ సంస్థ వెల్లడించింది. టీ-హబ్‌లో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ దేవేంద్ర ప్రతాప్ పాండే చేతుల మీదుగా 'ఇంద్రజాల్ రేంజర్'ను ఆవిష్కరించింది. ముంబైలో జరిగిన 26/11 మారణకాండను గుర్తు చేసుకుంటూ, దాడి జరిగాక స్పందించడం కంటే ముందే అడ్డుకోవడం మేలనే ఉద్దేశంతో నవంబరు 26న విడుదల చేసినట్టు తెలిపింది. కీలక మౌలిక సదుపాయాలను నాశనం చేయడం ద్వారా ఆధిపత్యం చూపడానికి డ్రోన్లను వినియోగించడం పెరిగిందని ఈ సందర్భంగా దేవేంద్ర ప్రతాప్ పాండే పేర్కొన్నారు. శత్రు దేశాలు పంపుతున్న డ్రోన్లను మన బలగాలు ప్రతి రోజూ నిర్వీర్యం చేస్తూనే ఉన్నాయని.. ఇంద్రజాల్ రేంజర్ లాంటి వాహనాల అభివృద్ధి మన రక్షణ రంగంలో కీలక ముందడుగుగా నిలుస్తుందన్నారు.

ప్రయాణిస్తూనే కూల్చేస్తుంది

ఇంద్రజాల్ సీఈవో, సహ వ్యవస్థాపకుడు కిరణ్ రాజు మాట్లాడుతూ.. ఇంద్రజాల్ రేంజర్ కృత్రిమ మేధ ఆధారిత కౌంటర్ డ్రోన్ వ్యవస్థ అని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు మన సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ 255 పాకిస్థానీ డ్రోన్లను నిర్వీర్యం చేసిందని చెప్పారు. శత్రుదేశ డ్రోన్లను నిర్వీర్యం చేయడానికి వేగంగా స్పందించే వ్యవస్థ కావాల్సి ఉందని, ఆ అవసరాన్ని ఇంద్రజాల్ రేంజర్ తీరుస్తుందని పేర్కొన్నారు. సాధారణంగా యాంటీ డ్రోన్ వ్యవస్థలు ఒకేచోట ఉంటాయని.. దానికి భిన్నంగా ఇది ప్రయాణిస్తూనే చుట్టూ 10 కిలోమీటర్ల దూరంలోని డ్రోన్లను గుర్తించగలదన్నారు. 4 కిలోమీటర్ల దూరంలో ఉండగానే డ్రోన్లను నియంత్రణలోకి తీసుకుంటుందని, సాధ్యం కాకపోతే 2 కిలోమీటర్ల దూరంలో ఉండగానే వాటిని కూల్చివేస్తుందని వెల్లడించారు. ఇది ఇంటర్నెట్‌తో సంబంధం లేకుండానే పనిచేస్తుందని, డేటాను పంపడమే తప్ప రిసీవ్ చేసుకోదని.. కాబట్టి సైబర్‌దాడుల బారినపడే అవకాశాలు ఉండవని తెలిపారు. శత్రువు గుర్తించి, దాడి చేసే లోగానే ఇది మరో చోటుకు వెళ్తుంది కాబట్టి.. నష్టం జరిగే అవకాశాలు తక్కువని పేర్కొన్నారు. దేశ అంతర్గతంగా కీలక మౌలిక సదుపాయాలు, రద్దీ నగరాల్లో కూడా ఇది రక్షణ కల్పిస్తుందని చెప్పారు. సున్నితమైన ప్రాంతాల్లో డిజిటల్ జియో ఫెన్సింగ్ వేయడంతోపాటుగా.. అతిక్రమణలను రికార్డ్ చేయడం, ఆ డ్రోన్లను నియంత్రణలోకి తీసుకోవడం దీనితో సాధ్యమన్నారు. ఈ వాహన పనితీరు పరీక్షించిన సమయంలో 6 రోజుల్లో 70 డ్రోన్లను నిర్వీర్యం చేసిందని తెలిపారు.

యుద్ధానికే కాదు..అక్రమాల నియంత్రణకూ

యుద్ధ రంగంలో పదాతి దళాలు ముఖాముఖి పోరాడటం, యుద్ధ విమానాలు శత్రుదేశ స్థావరాలపై దాడులు చేయడం పాత పద్ధతి. ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ వ్యవస్థలు అభివృద్ధి చెందిన తరువాత యుద్ధాల తీరే మారిపోయింది. రష్యా- ఉక్రెయిన్ మధ్య యుద్ధంలో డ్రోన్లే కీలకంగా మారడం చూస్తున్నదే. ఉక్రెయిన్ చిన్నపాటి డ్రోన్లతోనే రష్యాకు భారీ స్థాయిలో నష్టం కలిగించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ కూడా భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు ప్రయత్నించింది. దీనికి తోడు ఇటీవలి కాలంలో దేశ సరిహద్దు ప్రాంతాలలో మత్తుపదార్థాలు, ఆయుధాలు జార విడిచేందుకు ఉగ్రవాదులు, స్మగ్లర్లు డ్రోన్లను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సరిహద్దుల వద్ద గస్తీతోపాటు అక్రమ రవాణాను అరికట్టడానికీ 'ఇంద్రజాల్ రేంజర్' ఉపయోగపడుతుంది.

ప్రపంచ టాప్-100 నగరాల్లో హైదరాబాద్

» అత్యుత్తమ నగరాల్లో 82వ స్థానం

» 'వరల్డ్ బెస్ట్ సిటీస్' నివేదికలో వెల్లడి

» 29వ స్థానంలో బెంగళూరు, ఢిల్లీకి 54వ ర్యాంకు

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలో అత్యంత నివాస యోగ్యమైన టాప్-100 నగరాల్లో హైదరాబాద్ స్థానం సంపాదించింది. దేశం నుంచి మూడు నగరాలకు ఈ ఘనత దక్కింది. బెంగళూరు 29, ఢిల్లీ 54వ స్థానంలో నిలవగా హైదరాబాద్ 82వ స్థానం సాధించింది. మౌలిక వసతులు, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే చారిత్రక పర్యాటక ప్రాంతాలు, ఆర్థికాభివృద్ధి, మెరుగైన జీవన ప్రమాణాలతోపాటు నివాసానికి అనుకూలంగా ఉండే ఇతర వసతులను పరిగణనలోకి తీసుకుని '2026 వరల్డ్ బెస్ట్ సిటీస్' నివేదిక రూపొందించినట్టు ఆ నివేదిక రూపొందించిన రెసొనెన్స్ కన్సల్టెన్సీ సీఈవో క్రిస్ ఫెయిర్ తెలిపారు. టాప్-5 నగరాల్లో లండన్, న్యూయార్క్, పారిస్, టోక్యో, మాడ్రిడ్ నిలిచాయి. హైదరాబాద్ విశేషతల గురించి నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. చారిత్రక కట్టడాలు చార్మినార్, గోల్కొండ కోటలతో నగరం అంతర్జాతీయ పర్యాటకులకు గమ్యస్థానంగా మారిందని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చిన విదేశీ పర్యాటకులు నగరంలోని విశేషతలు, వారసత్వ సంపదపై అత్యంత సంతృప్తిగా ఉన్నారని, వారసత్వ నగరంగా ప్రపంచానికి చాటి చెబుతున్నారని నివేదిక తెలిపింది. మరోవైపు గూగుల్, అమెజాన్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలకు కేంద్రంగా ఉంటూ ఐటీ రంగంలోనూ ప్రత్యేకత చాటుతోందని ప్రశంసించింది. పాతబస్తీ పర్యాటక ప్రాంతాలు, హైటెక్ సిటీ ఆధునికతతో కలబోసిన హైదరాబాద్ ప్రపంచంలోనే ప్రత్యేక నగరంగా నిలుస్తోందని తెలిపింది.





స్పీకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నవీన్‌యాదవ్, చిత్రంలో మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

స్పీకర్ ఛాంబర్‌లో ఎమ్మెల్యేగా నవీన్‌యాదవ్ ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన నవీన్ యాదవ్ బుధవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో జరిగిన ఉప ఎన్నికలో నవీన్ యాదవ్ గెలిచిన సంగతి తెలిసిందే. స్పీకర్ కార్యాలయంలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే గణేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హన్మంతరావుతో పాటు నవీన్ యాదవ్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన నవీన్‌యాదవ్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సందర్భంగా అభినందించారు. అనంతరం నవీన్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగ దినోత్సవం రోజున ప్రమాణస్వీకారం చేయడం అదృష్టంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ సమగ్ర అభివృద్ధి కోసం పని చేస్తానని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరుస్తానని చెప్పారు. తనకు టిక్కెట్ కేటాయించి జూబ్లీహిల్స్ నుంచి ఎమ్మెల్యేగా గెలవడానికి అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పెరిఫెరల్ మెడికల్ కాలేజీలకు అలవెన్స్‌లు ఇవ్వండి: టీటీజీడీఏ వినతి

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వెలుపల ఉన్న అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల అధ్యాపకులకు 'పెరిఫెరల్ మెడికల్ కాలేజ్ అలవెన్స్' అమలు చేయాలని తెలంగాణ టీచింగ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీటీజీడీఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు లేఖ రాసింది. హైదరాబాద్‌లో పనిచేస్తున్న అధ్యాపకులకు 30% హెచ్‌ఆర్‌ఏ ఉండగా.. బయట ప్రాంతాల్లో పనిచేస్తున్న అధ్యాపకులు నెలకు సగటున రూ 30,000 వరకు తక్కువ జీతం వస్తుందని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ తేడా వల్ల హైదరాబాదేతర ప్రాంతాల్లో పనిచేయడానికి అధ్యాపకులు ఆసక్తి చూపడం లేదని తెలిపింది. ఏపీతో పాటు పలు రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు ప్రత్యేక అలవెన్స్‌ను అమలు చేస్తున్నాయని, తెలంగాణలోనూ ఇదేవిధంగా చర్యలు తీసుకోవాలని టీటీజీడీఏ అధ్యక్ష, కార్యదర్శులు బి. కిరణ్ మాదాల కిరణ్ ఒక ప్రకటనలో కోరారు.

'హిల్ట్'తో రేవంత్‌కు లంకెబిందెలు దొరికాయి

» పారిశ్రామిక భూముల కుంభకోణంతో రూ.6.29 లక్షల కోట్ల లూటీకి కుట్ర: ఏలేటి

హైదరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పారిశ్రామిక భూముల మార్పు (హిల్ట్) పాలసీతో సీఎం రేవంత్ రెడ్డికి లంకెబిందెలు దొరికాయని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. 'హిల్ట్' విధానం రాష్ట్ర ప్రజలకు ఏ విధంగా మేలు చేస్తుందో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం తన స్వార్థం కోసం, దేశంలో అత్యంత సంపన్న రాజకీయ నేత కావాలనే ఉద్దేశంతో 'హిల్ట్' పేరుతో భారీ భూ కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. ఇది దేశంలోనే అతిపెద్ద భూ కుంభకోణమని అన్నారు. మహేశ్వర్ రెడ్డి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తూ మాట్లాడారు. 22 పారిశ్రామికవాడలకు సంబంధించిన 9,292 ఎకరాల భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చే పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్కాంకు పథకం వేసిందని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ విలువలో కేవలం 30 శాతానికే ఈ భూములను ధారాదత్తం చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ఇందుకు ఈ నెల 22న జీవో నం.27ను తీసుకొచ్చిందన్నారు. సీఎం ముందుగానే తన అనుచరులను ఆయా ఇండస్ట్రియల్ ఎస్టేట్లకు పంపించి.. అక్కడి కంపెనీలతో పథకం ప్రకారం ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఈ భూములు తెలంగాణ ప్రజల ఆస్తి అని, వాటి విలువ 6.30 లక్షల కోట్లకు పైనే ఉంటుందని, దీంతో రాష్ట్ర అప్పును సైతం తీర్చేయొచ్చని పేర్కొన్నారు.

చెక్‌డ్యామ్ పేల్చేశారని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

» కుంగిందని నిరూపిస్తే మీరు తప్పుకొంటారా?

» హరీశ్‌రావుకు ఎమ్మెల్యే విజయరమణారావు సవాల్

కరీంనగర్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని గుంపుల-తనుగుల మధ్య మానేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ను పేల్చివేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణా రావు అన్నారు. అదేసమయంలో, చెక్ డ్యామ్ కుంగిపోయిందని నిరూపిస్తే... మీరు రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఆయన సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో నాణ్యత లోపంతో, సరైన డిజైన్ లేకుండా నిర్మించడం వల్లే చెక్ డ్యామ్ కూలిపోయిందన్నారు. చెక్ డ్యామ్‌ను కూల్చివేశారంటూ హరీశ్‌రావు అబద్ధాలతో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ నుంచి మల్హర్ మండలం వరకు నిర్మించిన 23 చెక్ డ్యామ్‌లలో ఎనిమిది అప్పటికే కూలిపోయాయని ఎమ్మెల్యే తెలిపారు. నీటిపారుదల శాఖ మంత్రిగా హరీశ్‌రావు ఉన్నప్పుడే ఇవి నిర్మించారని, ఆయన డిజైన్ చేసినవే కూలిపోయాయని పేర్కొన్నారు.

దేవరయాంజల్ రికార్డులు సమర్పించండి: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం దేవరయాంజల్‌లోని శ్రీ సీతారామస్వామి ఆలయానికి చెందిన దాదాపు 1500 ఎకరాలకు పైగా భూములకు సంబంధించిన రికార్డులను సమర్పించాలని హైకోర్టు దేవాదాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆలయానికి చెందిన మొత్తం భూములకు సంబంధించి 1926 నుంచి ఉన్న ఒరిజినల్ అప్లికేషన్లు సహా మొత్తం రికార్డులు సమర్పించాలని తెలిపింది. ప్రైవేటు పట్టా భూములను ఆలయ భూములని పేర్కొంటూ నిషేధిత జాబితాలో చేర్చడంపై వి. నిర్మల సహా పలువురు దాదాపు 12 పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. నిషేధిత జాబితాలో చేర్చడాన్ని కొట్టేయాలని పిటిషనర్‌లు కోరారు. మరోవైపు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై సదరు భూములను తమ పేర్లపై పిటిషనర్లు రికార్డు చేయించుకున్నారని.. అవి ఆలయ భూములే అని దేవాదాయ శాఖ చెబుతోంది. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

» కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

న్యూఢిల్లీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీలకు కూడా చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై అసెంబ్లీలో మాదిరిగానే న్యాయస్థానాల్లోనూ రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలన్నారు. జాతీయ మాల మహానాడు నేతృత్వంలో న్యూఢిల్లీలో జరిగిన రాజ్యాంగ హక్కుల సాధన సభలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. రాహుల్ గాంధీ స్ఫూర్తితో కులాలకు అతీతంగా ప్రతి ఒక్కరు రాజ్యాంగ పరిరక్షణకు నడుం బిగించాలని, ఈ అంశంపై త్వరలోనే చైతన్య యాత్ర చేపడుతున్నామని ప్రకటించారు. రోస్టర్ విధానంతో మాలలకు అన్యాయం జరుగుతున్న అంశాన్ని ఇప్పటికే సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

కాళోజీ హెల్త్ వర్సిటీ పరీక్షల నియంత్రణ విభాగం సీజ్

» ఆరోగ్యశాఖ కార్యదర్శి ఆదేశాలతో రంగంలోకి అధికారులు

» ఆంధ్రజ్యోతి కథనానికి సీఎం స్పందన

వరంగల్ మెడికల్/హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం పీజీ వైద్య విద్య మార్కుల రీవ్యాల్యూయేషన్ ప్రక్రియపై వచ్చి న ఆరోపణలతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ ఆదేశం మేరకు కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య మంగళవారం అర్ధరాత్రి వర్సిటీకి వెళ్లారు. పరీక్షల నియంత్రణ విభాగంలోని జవాబు పత్రాలు భద్రపర్చిన గదితో పాటు జవాబు పత్రాలను స్కాన్ చేసిన కంప్యూటర్లను ఎమ్మార్వో సమక్షంలో సీజ్ చేశారు. విచారణ కమిటీ సభ్యులైన ఉస్మానియా వైద్య కళాశా ల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, హన్మకొండ కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, వరంగల్ విజిలెన్స్ ఎస్పీ శ్రీనివాసరావులు జరిపిన విచారణలో వర్సిటీ లో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. ఫోరెన్సిక్‌తో పాటు సాంకేతిక బృందాన్ని వర్సిటీకి పంపి సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది.

అక్రమార్కులపై నివేదిక ఇవ్వండి: సీఎం

కాళోజీ వర్సిటీ అక్రమాలపై విచారణ జరిపి పూర్తి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఘా విభాగాన్ని ఆదేశించారు. ఈనెల 24న కాళోజీ వర్సిటీలో అక్రమార్కులు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో పరిశోధనాత్మక కథనంపై సీఎం స్పందించారు. ఆయన ఆదేశాల నేపథ్యంలో నిఘా విభాగం అధికారులు బుధవారం విచారణ ప్రారంభించారు.

వీసీపై గవర్నర్‌కు ఫిర్యాదు

వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నంద కుమార్‌పై వచ్చిన ఆరోపణల విషయంలో విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు రాష్ట్ర గవర్నర్‌కు లేఖ రాశారు. హెల్త్ యూనివర్సిటీలో అక్రమార్కులు అంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని ఆయన కోడ్ చేశారు. అలాగే గతంలో సరోజిని కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా అక్రమాలకు పాల్పడి, సస్పెండ్ అయిన విషయాన్ని ఆ లేఖలో ప్రస్తావించారు. విద్యార్థుల భవిష్యత్తు, వైద్య విద్య ప్రతిష్ఠ, ఆరోగ్య రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున.. వెంటనే నిజానిజాలు తేల్చి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీ రిజర్వేషన్లు 21.39%

(మొదటిపేజీ తరువాయి)

పాటించామని తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 12,760 గ్రామ పంచాయతీలు ఉండగా.. అందులో 2,537 గ్రామాలు షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ గ్రామాలను పూర్తిగా ఎస్టీలకే కేటాయిస్తారు. బీసీ, ఇతర రిజర్వేషన్లేవీ వర్తించవు. నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని మిగతా 10,223 పంచాయతీల్లో బీసీలకు 2,186 పంచాయతీలు రిజర్వు అయ్యాయి. అంటే 21.39 శాతం పంచాయతీలు బీసీలకు కేటాయించారు. 2019 పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 22.78% రిజర్వేషన్ అందింది. అయితే గతంలో రాష్ట్రంలో 1,177 ఎస్టీ నోటిఫైడ్ పంచాయతీలు ఉండగా, ఈసారి ఆ సంఖ్య 1,248కు పెరిగింది. దీనికితోడు బీసీ జనాభా ఎక్కువగా ఉన్న 214 గ్రామాలు మున్సిపాలిటీలలో విలీనం కావడం, 223 కొత్త పంచాయతీల ఏర్పాటు, మండలాలు యూనిట్‌గా రిజర్వేషన్ల ఖరారు వంటి కారణాలతో బీసీ రిజర్వేషన్ల శాతం స్వల్పంగా తగ్గింది.



నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో రిజర్వేషన్ల తీరు

అంశం	2019లో	2025లో
గ్రామాలు	10,293	10,223
ఎస్టీలకు	688 (6.68%)	714 (6.99%)
ఎస్సీలకు	2,113 (20.53%)	2,090 (20.45%)
బీసీలకు	2,345 (22.78%)	2,186 (21.39%)

(నాన్ షెడ్యూల్డ్ ప్రాంతాల్లోనూ ఎస్టీ జనాభాకు అనుగుణంగా వారికి రిజర్వేషన్లు ఉంటాయి)

8 జిల్లాల్లో పెరిగిన బీసీ రిజర్వేషన్ల శాతం

జిల్లా	2019లో	ప్రస్తుతం
హన్మకొండ	15.08	22.53
జగిత్యాల	25.07	27.19
జనగాం	17.05	18.59
గద్వాల	25.40	27.76
కరీంనగర్	23.40	26.75
నిజామాబాద్	21.35	26.64
సూర్యాపేట	14.63	15.56
వనపర్తి	24.77	27.67



23 నెలల అభివృద్ధి మా బలం

» పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు కరువు

» మంత్రి పొంగులేటి

ఖమ్మం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 23 నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులే పంచాయతీ ఎన్నికల్లో తమకు అంతులేని బలాన్ని ఇస్తాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఖమ్మం 60వ డివిజన్ రామన్నపేటలో రూ.కోటి అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రజలకు ఇచ్చిన హామీలలే కాకుండా ఇవ్వని హామీలను కూడా పూర్తిచేసి వారి మనసులను గెలుచుకున్నామన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితమే బీఆర్ఎస్ పార్టీ బలహీనతకు స్పష్టమైన నిదర్శనమని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్లు వేయడానికి కూడా బీఆర్ఎస్‌కు అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయ ఢంకా మోగిస్తారని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో ప్రజలు ఇచ్చిన తీర్పును జీర్ణించుకోలేకపోతున్న బీఆర్ఎస్ నాయకులు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని పొంగులేటి విమర్శించారు.

బీసీలకు 17% రిజర్వేషన్లు సరికాదని పిటిషన్

వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్లపై వైఖరిని తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ, గిరిజన శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులు, రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్‌ఈసీ), సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో రిజర్వేషన్ల కోసం ఈ నెల 23న జిల్లా కలెక్టర్ (జిల్లా ఎన్నికల అధికారి) జారీ చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని కోరుతూ అందోల్ మండలం రాంసాన్‌పల్లికి చెందిన మాజీ సర్పంచ్ కొరబోయిన ఆగమయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. బీసీల జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు 42% రిజర్వేషన్లు ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఏకసభ్య కమిషన్ సూచించిన మేరకు 42 శాతానికి బదులుగా రాష్ట్రవ్యాప్తంగా 17.087% పంచాయతీ స్థానాలను కేటాయించడం సబబుకాదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, డిసెంబరు 10కి విచారణ వాయిదా వేశారు.

బీసీల్లో సబ్ క్యాటగిరీ రిజర్వేషన్లు లేకపోవడంపై పిటిషన్

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లకు సంబంధించి మార్గదర్శకాలను వెల్లడిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 46ను నిలిపివేయాలని కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ ఒకట్రెండు రోజుల్లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ ధర్మాసనం ముందుకు రానుంది. తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, శ్రీ మడివాల మాచదేవ రజకుల సంఘంతో పాటు మరో ముగ్గురు ఈ పిటిషన్ వేశారు. 'పంచాయతీ రాజ్ చట్టం-2018లోని సెక్షన్ 9(4) ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల్లో బీసీ- ఏ, బీ, సీ, డీలకు క్యాటగిరీ వారీగా రిజర్వేషన్లు కల్పించలేదు. దీంతో బీసీల్లోని.. మున్నూరు కాపు, ముదిరాజ్, యాదవ, గౌడ కులాలు స్థానిక సంస్థల్లో రాజకీయ అధికారాన్ని పొందుతాయి. ఇతర పేద బీసీ వర్గాల వారు పేదలుగానే మిగిలిపోతున్నారు. చట్ట ప్రకారం బీసీ రిజర్వేషన్లను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించేలా సర్కార్‌ను ఆదేశించాలి. అప్పటివరకు జీవో 46ను నిలిపివేయాలి' అని కోరారు.



స్థానిక ఎన్నికలతో బీజేపీ అధికారానికి పునాది

» అన్ని గ్రామాల్లో బరిలోకి పార్టీ అభ్యర్థులు

» అత్యధిక స్థానాల్లో గెలుపొందడమే లక్ష్యం

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



హైదరాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ నుంచి సర్పంచ్ వరకు గ్రామాల్లోని అన్ని స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఆయా అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి బీజేపీ అధికారం చేపట్టడానికి స్థానిక సంస్థల ఎన్నికలు పునాది కావాలంటూ దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ఇతర ముఖ్య నాయకులతో రాంచందర్ రావు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వార్డు మెంబర్ నుంచి సర్పంచ్ వరకు ప్రతీ గ్రామంలో బీజేపీ అభ్యర్థులు అన్ని స్థానాల్లో పోటీ చేయాలని ఈ సందర్భంగా అన్నారు. పార్టీ శ్రేణులు అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు అందించి, అత్యధిక స్థానాలు గెలిపించాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలన్నీ నిర్వీర్యం అయ్యాయని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా రెండేళ్లుగా పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని, రోడ్లు, పీఎం కిసాన్, మరుగుదొడ్ల నిర్మాణం, ఉపాధి హామీ పథకం, వీధి దీపాలు, శ్మశానాల అభివృద్ధి వంటి పనులు ఆ నిధులతోనే నిర్వహిస్తారని వివరించారు. ఈ విషయాలను గ్రామాల్లోని ప్రజలకు తెలియజేయాలని పార్టీ శ్రేణులకు రాంచందర్‌రావు సూచించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు డా. కె. లక్ష్మణ్, పార్టీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ పాల్గొన్నారు.

● రాజ్యాంగ రక్షణే బీజేపీ లక్ష్యం

బర్కత్‌పుర: భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ.. డాక్టర్ అంబేడ్కర్ సారథ్యంలో భారత రాజ్యాంగ నిర్మాణం జరగగా అందులో ఆరుగురు తెలుగువారు ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ఎన్నోసార్లు ఉల్లంఘించిందని, రాజ్యాంగం కోసం ఏమీ తెలియకపోయినా రాహుల్ గాంధీ రాజ్యాంగం పట్టుకుని తిరుగుతుంటారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో భాగంగా 'మనం మన భారత రాజ్యాంగం' అనే పుస్తకాన్ని రాంచందర్‌రావు ఆవిష్కరించారు.

రిజర్వేషన్లు తగ్గడంపై బీసీల ఆగ్రహం

జీవో 46ను రద్దు చేసి, 42% రిజర్వేషన్ కల్పించాలి.. అప్పటి దాకా పంచాయతీ ఎన్నికలను ఆపేయాలి

» లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం

» ప్రభుత్వానికి బీసీ సంఘాల హెచ్చరిక

» 29న రహదారుల దిగ్బంధం: కృష్ణయ్య

» 30న బీసీల ధర్మయుద్ధ భేరి: జాజుల

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/కవాడిగూడ/రాంనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గడంపై రాష్ట్ర వ్యాప్తంగా బీసీ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 46ను వెంటనే రద్దు చేయాలని, బీసీలకు 42% రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించేవరకు పంచాయతీ ఎన్నికలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బీసీలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం భరతం పడతామని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీలకు 42% రిజర్వేషన్లు సాధించే వరకు బలమైన ఉద్యమం చేస్తామన్నారు. ఇందులో భాగంగా 29న రాష్ట్రవ్యాప్తంగా రహదారుల దిగ్బంధం చేయనున్నట్లు ప్రకటించారు. జీవో 46కు వ్యతిరేకంగా విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో కృష్ణయ్య ఒక్క రోజు నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు కేవలం 17% రిజర్వేషన్లు మాత్రమే అమలు చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. బీసీలకు 42% రిజర్వేషన్లను సాధించే వరకు విశ్రాంతి తీసుకోబోమన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లు 42% రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం సరైంది కాదని సినీ నటుడు నారాయణమూర్తి పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే మోసం అనేది ప్రజలకు తెలిసిపోయిందని బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. జీవో 46ను వెంటనే రద్దు చేసి, సర్పంచ్ ఎన్నికలను వాయిదా వేయాలని '42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి' నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు రాస్తారోకో నిర్వహించారు. అరగంటపాటు రోడ్డుపై బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్ మాట్లాడుతూ.. "ఏ సీఎం చేయని ద్రోహం రేవంత్‌రెడ్డి బీసీలకు చేశారు" అని ఆరోపించారు. బీసీ మంత్రులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి బీసీ ఉద్యమంలో భాగస్వాములు కావాలని బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ పిలుపునిచ్చారు. బీసీలను అణచివేసేందుకు కుట్రలు చేస్తున్న రేవంత్‌రెడ్డికి సీఎంగా కొనసాగే అర్హత లేదని బీసీ పొలిటికల్ ఫ్రంట్ వైస్ చైర్మన్ ఎస్ దుర్గయ్యగౌడ్ అన్నారు.



42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో చేస్తున్న నాయకులు

17.08% రిజర్వేషన్‌తో అవమానిస్తారా?

42% రిజర్వేషన్ల సాధనకై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ఈ నెల 30న ఛలో హైదరాబాద్, బీసీల ధర్మయుద్ధ భేరి సభలను నిర్వహిస్తామని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ ప్రకటించారు. వేలాది మందితో సుందరయ్య పార్కు నుంచి ఇందిరాపార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీసీల ధర్మయుద్ధ భేరి వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. నవంబర్ 25ను బీసీల విద్రోహ దినంగా పాటిస్తామన్నారు. కాగా, పలు బీసీ సంఘాల ప్రతినిధులు బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీభవన్‌ను ముట్టడించడానికి ప్రయత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ వారిని పరామర్శించారు.

బీసీల గొంతు కోసిన సీఎం రేవంత్‌రెడ్డి

స్థానిక ఎన్నికల్లో 42% రిజర్వేషన్ పేరిట మోసం.. 24% రిజర్వేషన్‌ను 17 శాతానికి తగ్గించారు

» దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ స్పందించగలరా?

» ఫ్యూచర్ సిటీ పేరిట 5లక్షల కోట్ల దోపిడీకి యత్నం: కేటీఆర్



హనుమకొండ టౌన్/జనగామ/గీసుగొండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల పేరిట సీఎం రేవంత్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. 42శాతం రిజర్వేషన్ల అంటూ బీసీలను మోసగించిన సీఎంగా చరిత్రలో నిలిచిపోతారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన 24శాతం రిజర్వేషన్‌ను 17శాతానికి తగ్గించారని మండిపడ్డారు. కులగణన పేరిట రూ.160కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం.. తడిగుడ్డతో బీసీల గొంతు కోసిందని ధ్వజమెత్తారు. పార్టీతో సంబంధం లేని పంచాయతీ ఎన్నికల్లో... పార్టీ పరంగా బీసీలకు ఎలా రిజర్వేషన్లు ఇస్తారని ప్రశ్నించారు. ఈ మోసం కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పందిస్తారా? అని నిలదీశారు. హనుమకొండ, జనగామలో బుధవారం నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశాలకు ఆయన హాజరయ్యారు. అనంతరం గీసుగొండ మండలంలోని టెక్స్‌టైల్ పార్కులో ఉన్న కైటెక్స్ వస్త్ర పరిశ్రమలో ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జై తెలంగాణ అననోడు సీఎం అయ్యాడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండలా మారారని, ఫ్యూచర్ సిటీ పేరుతో రూ.5లక్షల కోట్లు దండుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణను రాహుల్‌గాంధీకి పేటీఎం, ఏటీఎంలా మార్చుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని పలు పారిశ్రామిక వాడలకు గతంలో కేటాయించిన 9300 ఎకరాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ దెబ్బకు సీఎం, డిప్యూటీ సీఎం జూబ్లీహిల్స్ గల్లీల్లో తిరిగారని, అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారన్నారు. జూబ్లీహిల్స్ గెలుపును సీఎం రేవంత్‌రెడ్డి బలుపుగా భావిస్తే.. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలవాలని సవాల్ విసిరారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో ఏర్పాటైన కైటెక్స్, యంగ్‌వన్, గణేషా కంపెనీలతో వేల మందికి ఉపాధి లభిస్తోందని, కేసీఆర్ కల సాకారమైందని అన్నారు. కాగా, హనుమకొండలోని బాలసముద్రంలో కేటీఆర్ కాన్వాయ్‌లోని వాహనం ఢీకొని ద్విచక్రవాహనదారుడు గాయపడ్డాడు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.